

అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapakshamn.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ఎన్నికల కమిషన్ సంక్లిష్టతలోకి ఎందుకు దిగింది? 06

ఓట్ల తస్కరణకు బిజెపి, ఎన్నికల కమిషన్ మధ్య పొత్తు 05

నిర్దష్టకాలపరిమితి విధింపుపై... రాష్ట్రపతి అభిప్రాయాన్ని కోరితే తప్పేమిటి?



సంపుటి 08, సంచిక: 260 | బుధవారం | 20-08-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలకు

# సర్వం సిద్ధం

నేడు మహాసభలను ప్రారంభించనున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా






ప్రజాపక్షం/హైదరాబాద్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, గాజుల రామారంలోని 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (మహారాజా గార్డెన్స్)లో బుధవారం నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆహ్వాన సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. సిపిఐ రాష్ట్ర మహాసభలు జరగనున్న 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్' (గాజుల రామారం) ప్రాంతంలో అరుణ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. అరుణ తోరణాలు, ఫ్లెక్సీలతో ఈ ప్రాంతాన్ని ముస్తాబు చేశారు. మహాసభల వేదికైన 'కామ్రేడ్ బాలమల్లేష్ హాల్ (మహారాజా గార్డెన్స్) ను ప్రత్యేకంగా అలంకరించారు. షాపూర్ నగర్ చౌరస్తా నుంచి మహాసభల వేదికైన కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్ (గాజుల రామారం) వరకు ప్రత్యేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల కటౌట్లతో అలంకరించారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపుల అరుణ తోరణాలు, పతాకాలను ఏర్పాటు చేశారు. 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేష్' హాల్‌లో ఉదయం 11గంటలకు రాష్ట్ర మహాసభలను సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభిస్తారు. ఈ మహాసభలకు అతిథులుగా తరువాయి 2లో

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు సిపిఐ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో డి.రాజాకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహా, కళవేణ శంకర్, ఎం.బాల నర్సింహ్మా పుష్పగుచ్ఛాలు అందజేసిస్వాగతం పలికారు.



## 'ఇండియా కూటమి' ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా

# తెలంగాణ బిడ్డ

జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి పేరు ఖరారు చేసినట్లు కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జునఖర్గే ప్రకటన



**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి పేరు ఖరారైంది. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. దేశంలోని రెండవ అత్యున్నత పదవికి జరగనున్న ఎన్నికను 'సైద్ధాంతిక యుద్ధం' అని ఆయన అభివర్ణించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, గోవా మొదటి లోకాయుక్త కూడా హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వ కేంద్రం ట్రస్టీల బోర్డులో కూడా ఆయన ఉన్నారు. ఈనెల 21న ఆయన ఉప రాష్ట్రపతి పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం) సెంట్రల్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం ఉమ్మడి ప్రతిపక్షం సమావేశం కానుంది. ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి అభ్యర్థిని పోటీ నిలబడాలని నిర్ణయించుకున్నాయని, ఈ నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకోబడిందని ఖర్గే అన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు ఒకేను సూచించడం సంతోషంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద విజయమని ఖర్గే ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం దాడికి గురైనప్పుడల్లా, ప్రతిపక్ష పార్టీలు దానికి వ్యతిరేకంగా పోరాడటానికి ఏకమవుతాయని, ఈ ఎన్నికల్లో మంచి అభ్యర్థిని నిలబెట్టాలని తాము నిర్ణయంచుకున్నామన్నారు. ఖర్గే ఈ సందర్భంగా విపక్ష పార్టీల సంయుక్త ప్రకటనను చదివి వినిపించారు. జస్టిస్ తరువాయి 2లో



## నన్ను ప్రతిపాదించడం సంతోషకరం

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి : ఢిల్లీలో ఘనస్వాగతం

**న్యూఢిల్లీ :** భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రతిపాదించిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ఆయనకు ఢిల్లీ విమానాశ్రయంలో ఇండియా కూటమికి చెందిన వివిధ పార్టీల ఎంపిలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించిన ఇండియా తరువాయి 2లో

## రాష్ట్ర ప్రజల్లో గౌరవం పెరిగింది

- సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై సిఎం రేవంత్‌రెడ్డి హర్షం
- సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని తెలుగు రాష్ట్రాల పార్టీలకు విజ్ఞప్తి



ప్రజాపక్షం / హైదరాబాద్

రాజకీయాలకు అతీతంగా ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాలలోని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి తరువాయి 2లో

### విద్యుదాఘాతంతో 8మంది మృతి

03


4వ రాష్ట్ర మహాసభ

భారత కమ్యూనిస్టు పార్టీ (CPI) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ

2025-ఆగస్టు 20 నుండి 22 వరకు, గాజులరామారం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.

ప్రదర్శన: 20.08.2025న ఉదయం 9:00 గంటలకు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభం

మహాసభ వేదిక: మహారాజా గార్డెన్స్, గాజులరామారం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.

ప్రారంభ సభ: 20.08.2025 (బుధవారం) ఉదయం 10:00 గంటలకు

ప్రారంభకులు : కామ్రేడ్ డి. రాజా, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి

అతిథులు : కామ్రేడ్ డాక్టర్ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి

కామ్రేడ్ సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి

కామ్రేడ్ కె. రామకృష్ణ, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

కామ్రేడ్ జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి

ఉదయం 10:00 గంటలకు :
అరుణ పతాకావిష్కరణ: కామ్రేడ్ కె. ప్రతాప రెడ్డి

ఉదయం 10:15 గంటలకు:
అమరవీరుల స్థూపావిష్కరణ: కామ్రేడ్ ఏటుకూరి ప్రసాద్

అభివందనలతో...
కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి




# భారీ వర్షాలు... అపార నష్టం

ఎకరాకు రూ.25 వేలు పరిహారం?

- పలు జిల్లాల్లో దెబ్బతిన్న పత్తి పంట
- నీట మునిగిన వరి పంటలు, పొలాల్లో ఇసుక మేటలు

ప్రజాపక్షం/హైదరాబాద్

భారీ వర్షాలు రైతన్నలను అపార నష్టానికి గురి చేసింది. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాలు, వరదలతో పంటలన్ని నీటి పాలైయ్యాయి. ప్రధానంగా తరువాయి 2లో

## గాజాలో 60 రోజులు

# కాల్పుల విరమణ

10 మంది సజీవులు, 18 మంది నిర్జీవుల విడుదల హమాస్ అంగీకారం



**దోహా:** మధ్యవర్తుల ఒత్తిడితో గాజాలో కాల్పుల విరమణ, పది మంది బందీల విడుదలకు హమాస్ అంగీకారం తెలియజేసింది. 10 మంది సజీవులతోపాటు మరో 18 మంది నిర్జీవులైన బందీల మృతదేహాలను స్వాధీనం చేసేందుకు అంగీకరించింది. ఇందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్ళల్లో ఉన్న 140 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాల్సి ఉంటుంది. వీరిలో 60 మందిపైగా గడచిన 15 సంవత్సరాలుగా జీవిత ఖైదీలుగా ఉన్నారు. ఆదివారంనాడు కైరోలో మధ్యవర్తులతో జరిగిన సమావేశంలో హమాస్ నుండి ఈ అంగీకారం వెలువడింది. ఖతార్ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ తరువాయి 2లో

# రెండు వారాల్లో పుతిన్–జెలెన్‌స్కీ ముఖాముఖీ!



- ఆ తర్వాతే మా త్రైపాక్షిక సమావేశం
- అందుకు ఏర్పాట్లు చేస్తున్నా
- జెలెన్‌స్కీ సహా ఇయు నేతలకు ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్:** ఉక్రేన్‌లో రష్యా యుద్ధాన్ని ముగించేందుకు మార్గాన్వేషణలో భాగంగా పుతిన్ – జెలెన్‌స్కీల ముఖాముఖీ చర్చలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. వారిద్దరి మధ్యా ముఖాముఖీ తర్వాత తనతోపాటు ముగ్గురం కలిసి మరోసారి త్రైపాక్షిక సమావేశం జరుపుతామని చెప్పారు. వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో సోమవారం రాత్రి పొద్దుపోయాక జెలెన్‌స్కీతోపాటు అనేకమంది యూరోపియన్ యూనియన్ దేశాల నాయకులతో జరిగిన ఉమ్మడి సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. "నేను పుతిన్‌తో మాట్లాడా, రెండు వారాల్లో జెలెన్‌స్కీని కలిసేందుకు సిద్ధంగా ఉన్నానని పుతిన్ నాతో చెప్పారు, అందుకు అనువైన ఒక ప్రదేశాన్ని కూడా పరిశీలిస్తున్నాం, వీరిద్దరూ ఎక్కడ సమావేశం జరపాలో కూడా నిర్ణయిస్తాం" అని జెలెన్‌స్కీ, ఇ.యు నాయకులతో సమావేశం తర్వాత సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. కాగా నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టో కూడా సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన చేస్తూ, జెలెన్‌స్కీతో పాటు యూరోపియన్ యూనియన్ తరువాయి 2లో






# ప్రపంచం
WORLD NEWS

## హిందూఖుష్ ప్రాంతంలో భూకంపం

**కాబూల్ :** అఫ్ఘానిస్థాన్ హిందూఖుష్ ప్రాంతంలో భూకంపం సంభవించింది. 186 కి.మీ లోతున ఈ భూకంపం సంభవించిందని జర్మనీకి చెందిన భూగర్భ విజ్ఞానశాస్త్రాల పరిశోధనా కేంద్రం తెలియజేసింది. దీనివల్ల ఇస్లామాబాద్, రావల్పిండి, స్వాత్, ఛిత్రాల్, అబోటాబాద్, ఖైబర్‌పఖ్తుంక్వాలోని పలు ప్రాంతాలను భూకంపం కుదిపివేసిందని పాకిస్థాన్ మెటెటీరియో లాజికల్ శాఖ తెలిపింది. మంగళవారం ఉదయం 10.20 గంటల సమయంలో సంభవించిన భూకంపం 5.2 తీవ్రతతో ఉన్నట్లు రిచ్‌టర్ స్కేలుపై నమోదైంది.



## కాంగో తిరుగుబాటుదారుల దాడుల్లో
# 52 మంది పౌరులు మృతి

**కిన్షాసా:** డి.ఆర్.కాంగోలో తిరుగుబాటుదారులు చేసిన దాడుల్లో 52 మంది పౌరులు మరణించారు. ఈ నెలలో ఇప్పటివరకూ తిరుగుబాటు దారులు చేసిన దాడుల్లో వీరంతా మరణించారని ఐక్యరాజ్యసమితి శాంతి యంత్రాంగం మంగళవారం ప్రకటించింది. ఇటీవల అమెరికా మధ్యవర్తిత్వం చేయడంతో డి.ఆర్. కాంగోలో డి.ఆర్.కాంగో ఆర్మీకి, రువాండా దేశ మద్దతు ఉన్న ఎం–23 తిరుగుబాటు దారులకు మధ్య శాంతి ఒప్పందం జరిగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఐతే మీరంటే, మీరే శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ రెండు ప్రత్యర్థి వర్గాలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి.



తూర్పు కివు రాష్ట్రంలోని బెని, లుబెరో ప్రాంతాలలో ఈనెల తొమ్మిదో తేదీ నుండి 16వ తేదీ వరకూ ఎల్లైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఎ డి ఎఫ్) దాడులు చేసినట్లు ఐక్యరాజ్యసమితి శాంతి యంత్రాంగం తెలియజేసింది. 1990లో ఉగాండా తిరుగుబాటు దారులు ఈ ఎడిఎఫ్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఎడిఎఫ్ చేసి న తాజా దాడుల్లో కిడ్నాపులు, గృహదహనాలు, దోపిడీలు, వాహనాల దగ్ధం వంటి అనేక హింసాత్మక ఘటనలు జరిగాయి. తిరుగుబాటుదారుల దాడుల్లో మరణించిన పౌరులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని కూడా పేర్కొంది. ఇటీవలి నెలల్లో ఈ రెండు వర్గాలమధ్యా అనేక శాంతి ఒప్పందాలు జరిగినప్పటికీ రువాండా సరిహద్దు ల్లో ఉన్న డి.ఆర్.కాంగో తూర్పు ప్రాంతంలో దాడులు, హింస, అశాంతికి తెరపడటంలేదు. ఆగస్టు 18వ తేదీ నాటికి ఒక శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేస్తామని రెండు వర్గాలు ప్రకటించాయి. ఈ గడువు సోమవారంనాటితో ముగిసినప్పటికీ రెండు వర్గాల నుండీ ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

కాంగో తూర్పు ప్రాంతంలో అత్యంత విలువైన ఖనిజ వనరులు ఉన్నాయి. వీటిని దోచుకోవడానికి అనేక ఉగ్రవాద గ్రూపులు ఆ ప్రాంతంపై పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో ఎడిఎఫ్ కూడా ఉంది.

## యురోపియన్ యూనియన్ సహాయం
# బంగ్లాదేశ్ ఎన్నికలకు 4 మిలియన్ యూరోలు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలను అంతర్జాతీయస్థాయి ప్రమాణాలలో నిజాయతీగా, న్యాయబద్ధంగా నిర్వహించేందుకు యూరోపియన్ యూనియన్ నాలుగు మిలియన్ యూరోల ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో ఆ దేశ పార్లమెంటుకు 13వ సారి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అంతర్జాతీయ ఎన్నికల పరిశీలకులను మోహరించేందుకు వీలుగా అనువైన వాతావరణం ఉందా? లేదా? అనే విషయం తెలుసుకునేందుకు వచ్చేనెలలో ఒక సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా యూరోపియన్ యూనియన్ పంపిస్తోంది. ఢాకాలోని ఎన్నికల కార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎఎంఎం నజీర్ ఉద్దీన్‌తో మంగళవారం మధ్యాహ్నం బంగ్లాదేశ్‌లో యూరోపియన్ యూనియన్ దౌత్యవేత్త మైఖేల్ మిల్లర్ పత్రికాగోష్ఠిలో ఈ పరిణామాలను వివరించారు. మిల్లర్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులుగల యూరోపియన్ యూనియన్ ప్రతినిధిబృందం గంటన్నరసేపు ఎన్నికల కమిషనర్‌తో సమావేశం జరిపింది.



బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ జరుగుతోందో లేదో తెలుసుకోవడానికి, ఆ ప్రక్రియను పరిశీలించడానికి ఆ దేశం తో కలిసి యూరోపియన్ యూనియన్ సంయుక్త కృషి చేస్తోంది.

**ఈవారంలోనే కార్యాచరణ ప్రణాళిక విడుదల**

బంగ్లాదేశ్ పార్లమెంటుకు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన కార్యాచరణ ప్రణాళికను ఈ వారంలోనే తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని సీనియర్ అధికారులు మంగళవారంనాడు చెప్పారు. ఎన్నికల సంఘం సీనియర్ సెక్రటరీ అఖ్తర్ అహ్మద్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణపై ఒక కార్యాచరణ ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేశామని, తుది ఆమోద ం కోసం ఎన్నికల సంఘానికి సమర్పిస్తామని చెప్పారు. అన్ని ప్రభుత్వ విభాగాలతో అనుసంధానమైన ఈ ప్రణాళిక అమలు చేస్తారు. దేశంలో శాంతి భద్రతల పరిస్థితి గురించి ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదని కూడా ఆయన చెప్పారు.

**యూనస్ ప్రభుత్వం ఫిబ్రవరిలో వైదొలగుతుంది**

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా వ్యవహరిస్తున్న ప్రధాన సలహాదారు, నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనుస్ 2026 ఫిబ్రవరిలో ఆ పదవి నుండి వైదొలగుతారు.

దేశంలో 13వ సారి పార్లమెంటుకు ఎన్నికలు జరిగిన ప్రభుత్వ ఏర్పాటు ఖరారు కాగానే యూనుస్ సారథ్యంలో ఉన్న ప్రభుత్వం పదవి నుండి వైదొలగుతుందని తాత్కాలిక ప్రభుత్వంలో లా సలహాదారుగా ఉన్న ఆసిఫ్ నజ్రుల్ మంగళవారంనాడు సచివాలయంలో జరిగిన పత్రికాగోష్ఠిలో పునరుద్ఘాటించారు. మహ్మద్ యూనుస్ నిర్దేశించిన గడువు ప్రకారం దేశంలో ఎన్నికలు నిర్వహించే బాధ్యత తాత్కాలిక ప్రభుత్వానిదేతప్ప రాజకీయపార్టీలది కాదని ఆయన చెప్పారు.

## కూకట్‌పల్లిలో విద్యార్థిని హత్య కేసులో పురోగతి

*శరీరంపై 20 కత్తిపోట్లు * దర్యాప్తు రంగంలోకి ఐదు బృందాలు
* పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కూకట్‌పల్లిలో ఇంట్లో దారు ణ హత్యకు గురైన 6వ తరగతి విద్యార్థిని సహస్ర (11) దారుణ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు బాలనగర్ డిసిపి కె.సురేష్‌కుమార్ మీడియాకు తెలియజేశారు. హతురాలి శరీరంపై అగంతకులు పదునైన ఆయుధంతో 20 కత్తిపోట్లు చేశారన్నారు. పాఠశాలకు సెలవు ఉండడం..తల్లిదండ్రులు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో సహస్ర ఒంటరిగా ఉన్న సమయంలో పట్టపగలు మధ్యాహ్నం 12 గంటలకు దారుణ హత్యకు గురైంది.వీరి ఇంటి రెండో అంతస్తులో ఉన్న ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అదే బస్తీకి చెందిన మరో యువకుడిని కూడా విచారిస్తున్నారు. కేసు ఛేధించేందుకు ఐదు పోలీసు బృందాలు రంగంలోకి దించామని డిసిపి తెలిపారు. తమకు కీలక సిసిటివి ఫుటేజి అందిందని దాన్ని పరిశీలిస్తున్నామన్నారు.సహస్ర మృతదేహానికి గాంధీ మార్చురిలో మంగళవారం పోస్టుమార్టం పూర్తి కావడంతో కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. సహస్ర గొంతుపై 15 కత్తిపోట్లు ఉండడంతో మృతి చెంది ఉండవచ్చన్నారు. సంగారెడ్డిలో హతురాలి అంత్యక్రియలు పూర్తయ్యాయన్నారు. ఎవరెవరిపై అనుమానాలు ఉన్నాయనే విషయంపై బాధితురాలి తల్లిదండ్రులను కూడా అడుగుతున్నామన్నారు.

## నన్ను ప్రతిపాదించడం సంతోషకరం

(మొదటి పేజీ తరువాయి)

కూటమికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇండియా కూటమి దేశంలో 60 శాతం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుందని, అందుకు తాను సంతోషంగా ఉన్నానని తెలిపారు. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలు ఓట్లు వేయబోవని, ఎంపిలు వేస్తారని, కాబట్టి అభ్యర్థిగా తనకు ఓటు వేయాల్సిందిగా గౌరవ ఎంపిలందరికీ వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణ బిడ్డ

(మొదటి పేజీ తరువాయి)

సుదర్శన్‌రెడ్డి భారతదేశంలోని అత్యంత విశిష్ట, ప్రగతిశీల న్యాయనిపుణులలో ఒకరుని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి వంటి పదవులలో ఆయన సుదీర్ఘమైన, ప్రముఖ న్యాయవాద వృత్తిని కలిగి ఉన్నారని చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం స్థిరమైన, ధైర్యవంతమైన పోరాట యోధుదని కొనియాడారు. 'ఈ ఉపరాష్ట్రపతి పోటీ ఒక సైద్ధాంతిక పోరాటం. మన దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఎంతగానో రూపొందించిన విలువలను, మన దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఆధారపడిన విలువలను ఆయన పూర్తిగా ప్రతిబింబిస్తున్నందున ప్రతిపక్ష పార్టీలు బి. సుదర్శన్ రెడ్డిని తమ ఉమ్మడి అభ్యర్థిగా నామినేట్ చేశాయి. విలువలన్నీ దాడికి గురవుతున్నందున ఈ ఎన్నికల్లో పోరాడాలనే మా సమష్టి, దృఢ సంకల్పం' అని ఖర్గే పేర్కొన్నారు. ఆయన పేదల అనుకూల వ్యక్తి అని, అనేక తీర్పులలో... పేద ప్రజలకు అనుకూలంగా వ్యవహరించారనాన్రు. రాజ్యాంగం, ప్రాథమిక హక్కులను కూడా కాపాడారని చెప్పారు. కాంగ్రెస్ చీఫ్ వెంట ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు శరద్ పవార్, సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, టిఎంసి నేత డేరక్ ఓ బ్రెయిన్, డిఎంకె నేత తిరుచ్చి శివ, ఎస్‌పి నాయకుడు ధర్మేంద్ర యాదవ్ వంటి వివిధ ప్రతిపక్ష నాయకులు ఉన్నారు. ఉపరాష్ట్రపతి పోటీ 'ఒక సైద్ధాంతిక యుద్ధం' అని ఆయన నొక్కి చెప్పారు మరియు అందుకే అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా పోటీ చేస్తున్నాయి. కాగా, ఇటీవల ఇండియా కూటమి నుండి నిష్క్రమించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డికి ఇస్తోందని ఓ బ్రెయిన్ వెల్లడించారు. జులై 1946లో జన్మించిన సుదర్శన్‌రెడ్డి మే 2, 1995న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా, డిసెంబర్ 5, 2005న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జనవరి 12, 2007న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసి, జులై 8, 2011న పదవీ విరమణ చేశారు. డిసెంబర్ 27, 1971న ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో హైదరాబాద్‌లో న్యాయవాదిగా చేరారు.

**దక్షిణాది వర్సెస్ దక్షిణాది**

ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా సుదర్సన్‌రెడ్డిని ఎంపిక చేయడం వల్ల ఉపరాష్ట్రపతి ఎన్నిక దక్షిణాది వర్సెస్ దక్షిణాది మధ్య పోటీగా మారింది. దేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి ప్రతిపక్షాలు రాజకీయేతర వ్యక్తిని తమ అభ్యర్థిగా ఎంచుకోవాలని కూడా కోరుకున్నాయి. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ తన ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కలిగిన తమిళనాడుకు చెందిన అనుభవజ్ఞుడైన బిజెపి నాయకుడు మహారాష్ట్ర గవర్నర్ సి పి రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసింది. డిఎంకె తనను వ్యతిరేకించకుండా చూసుకోవడానికి ఎన్‌డిఎ తమిళనాడు నుండి రాధాకృష్ణన్‌ను తన అభ్యర్థిగా ఎంచుకుంటే, ప్రతిపక్షాలు తన సొంత వ్యూహంతో ప్రముఖ తెలుగు వ్యక్తిని తన అభ్యర్థిగా నిలబెట్టడం ద్వారా ప్రతిఘటించాయి. దీని వలన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పార్టీలు టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి, బిఆర్‌ఎస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వకుండా ఉండటం కష్టమే. అయితే ఇప్పటికే వైఎస్‌ఆర్‌సిపి ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది.

## కాల్పుల విరమణ

(మొదటి పేజీ తరువాయి)

అల్ తహానీ, ఈజిప్టు అధ్యక్షుడు ఎల్ సిసిలు సోమవారంనాడు హమాస్ ప్రతినిధులతో మరోసారి మాట్లాడినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. కానీ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ తిరస్కరించినట్లు ఇజ్రాయెల్ పత్రిక నుండి అనధికార వార్త వెలువడింది. మొత్తం 50 మంది బందీలను ఒకేసారి విడుదల చేయాలన్న తమ వైఖరిలో మార్పులేదని నెతన్యాహూ స్పష్టం చేశారన్న సమాచారాన్ని మీడియా ఖరాఖండిగా ధృవీకరించలేదు. ఐతే బందీలు,గల్లంతైనవారి కుటుంబీకుల వేదిక (ఇజ్రాయెల్) ఈ పరిణామాలపై ఇంకా స్పందించవలసి ఉంది.

60 రోజుల కాల్పుల విరమణతోపాటు సజీవులైన 10 మంది బందీల విడుదలకు హమాస్ అంగీకరించిందని మధ్యవర్తిత్వం చేస్తున్న ఖతార్ మంగళవారం ప్రకటించింది. హమాస్ ఉగ్రవాద సంస్థ సీనియర్ అధికారి బస్సెమ్ నైమా కూడా సోమవారం రాత్రి పొద్దుపోయాక తాజా ప్రతిపాదనకు అంగీకరిస్తున్న విషయం ధృవీకరించారు. హమాస్ తాజా ప్రతిపాదన తమ వద్దకు వచ్చిందని ఇజ్రాయెల్ అధికారి ఒకరు జెరూసలెంలో ప్రకటించారు. ఈ ప్రతిపాదన ప్రకారం ఇజ్రాయెల్ బందీలను విడుదల చేసినందుకు ప్రతిగా పాలస్తీనా ఖైదీలను కూడా ఇజ్రాయెల్ ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఇజ్రాయెల్ ప్రభుత్వ లెక్కల ప్రకారం హమాస్ వద్ద 50 మంది బందీలు ఉన్నారు. వీరిలో సగం మంది మాత్రమే సజీవులుగా ఉన్నారని నెతన్యాహూ ప్రభుత్వం అంచనా వేస్తున్నది. పాలస్తీనాలో అతిపెద్ద నగరం గాజా సిటీని స్వాధీనం చేసుకుని అక్కడి ప్రజలను దక్షిణ భాగంవైపుకు నెట్టేయాలనే ప్రణాళికతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని హమాస్ ఆలోచనలతో తమకు సంబంధం లేదని నెతన్యాహూ సంకేతాలు ఇచ్చారు. ఇటీవల దేశంలో నెతన్యాహూకు తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. హమాస్‌తో ఒక ఒప్పందం చేసుకోవాలని కోరుతూ రెండు రోజులక్రితం లక్షలమందితో ఇజ్రాయెల్‌లో జాతీయ సమ్మె జరిగిన తర్వాత హమాస్ నుండి సానుకూల స్పందన వచ్చింది. ట్రంప్ వ్యాఖ్యలు కూడా ఇందుకు తోడయ్యాయి. గాజా సమస్య పరిష్కరించేందుకు అమెరికా మద్దతుతో ఖతార్,ఈజిప్టు దేశాలు ఈ ఏడాది మే నెల నుండి హమాస్‌తో ముమ్మరంగా సంప్రదింపులు చేస్తున్నాయి. ఇజ్రాయెల్–హమాస్ ప్రతినిధుల మధ్య పరోక్ష చర్చలు జరిగినప్పటికీ రెండు వైపులా ప్రతినిధులు మొండి పట్టుదల ప్రదర్శించడంతో కాల్పుల విరమణ ఒప్పందం చివరి వరకూ వచ్చి ఆగిపోయింది. గాజా సిటీని పూర్తిగా ఆక్రమించేందుకు ఉద్దేశించిన ప్రణాళికను ఆమోదించామని ఇజ్రాయెల్ సైనిక దళాల అధికారి లెఫ్టినెంట్ ఏయల్ జామిర్ ప్రకటించగా, హమాస్‌ను పూర్తిగా నిర్మూలిస్తే తప్ప గాజా నుండి ఇజ్రాయెల్ బందీలు విడుదలయ్యే అవకాశం లేదని రెండు రోజులక్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరిక వ్యాఖ్యలు చేసిన తర్వాత హమాస్ నుండి సానుకూలమైన స్పందన వచ్చిందని భావిస్తున్నారు. హమాస్‌ను పూర్తిగా తుడిచిపెడతామని, గాజాలో హమాస్ వాసన లేకుండా చేస్తామని, వారి పరిపాలన ప్రమేయం లేకుండా పౌర పాలకులకు అధికారం అప్పగించాలని భావిస్తున్నామని, అప్పగివరకూ గాజాను పూర్తిగా ఆక్రమిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ కొత్త ప్రణాళిక ముందుకు తెచ్చారు. గాజా సంపూర్ణ ఆక్రమణ ప్రణాళికను ప్రపంచదేశాలు తీవ్రంగా ప్రతిఘటించినప్పటికీ నేతన్యాహూ వెనక్కు తగ్గడం లేదు. దీంతో పలు యూరప్‌దేశాలు పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల స్వతంత్ర,సార్వభౌమాధికార దేశంగా సెప్టెంబరునెలలో గుర్తించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి.

2023 అక్టోబరు 7 వ తేదీన ఇజ్రాయెల్‌లో జరిగిన భారీ మ్యూజిక్ ఫెస్టివల్‌పై హమాస్ ఉగ్రవాదులు సామూహిక దాడిచేసి 1200 మందిని కాల్చి చంపారు. మరో 250 మందిని బందీలుగా తీసుకెళ్ళారు. వీరిలో వివిధ దేశాలకు చెందిన ఇజ్రాయెల్ జాతీయులున్నారు. తర్వాత గాజాలో ఐ డి ఎఫ్ యుద్ధం ప్రారంభించింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ 61,827 మంది పాలస్తీనియన్లు, హమాస్ నాయకులు, కార్యకర్తలు మరణించగా, మరో లక్షన్నరమంది గాయపడ్డారు. ఆహార కేంద్రాలవద్ద ఆహారం కోసం ఎదురుచూస్తున్న సాధారణ పాలస్తీనా పౌరులు మరో 1200 మంది గడచిన మే నెల నుండి మరణించారు. మరో 200 మంది ప్రజలు ఆకలిబాధలతో గాజాలో మరణించారు.

## ముఖాముఖీ!

(మొదటి పేజీ తరువాయి)

నాయకులతో ట్రంప్ నిర్వహించిన సమావేశం ఎంతో విజయవంతమైందన్నారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు.

ఉక్రేన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం చేసేందుకు అలాస్కాలో ఆగస్టు 15వ తేదీన పుతిన్‌తో జరిగిన సమావేశంలో పూర్తి సానుకూల ఫలితాలు రాకపోవడంతో ట్రంప్ తన వ్యూహం మార్చుకున్నారు. నేరుగా పుతిన్–జెలెన్స్కీ మధ్య ముఖాముఖీ సంప్రదింపులు జరిగితేనే శాశ్వత శాంతి ఒప్పందం సాధ్యపడుతుందని అలాస్కా సమావేశం తర్వాత ట్రంప్ సరికొత్త ఆలోచన ప్రారంభించారు. యూరప్ నాయకులతో సమావేశంలో కూడా ట్రంప్ ఇదే విషయం ఉద్ఘాటించారు. ఈనెల 22వ తేదీన పుతిన్,జెలెన్స్కీ,ట్రంప్‌లతో త్రైపాక్షిక సమావేశం జరుగుతుందని అమెరికామీడియా మరోవైపు ప్రచారం చేస్తోంది.

## అపార నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పత్తి పంట రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. తిరిగి పంటలు వేసుకుందామన్నా ఇసుక మెటలతో పోలాలన్ని నిండిపోయ్యాయి. కూరగాయ పంటలు చేతికి రాకుండ పోయ్యాయి. పలు జిల్లాలో వరికి సైతం నష్టం వాట్లిలింది.. ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగానే రావడంతో అన్నదాతలు ముందుగానే పంటలు వేసుకున్నారు. అయితే పంటలు వేసుకున్న తర్వాత నెల రోజులు వర్షం ముఖం చాటేయడంతో రైతులు అష్ట కష్టాలు పడి పంటలను రక్షించుకున్నారు.

కొంతమేర కొలుకున్నమకున్న సమయంలో భారీ వర్షాలు తీవ్రంగ దెబ్బతిశాయి. దీంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 45లక్షల ఎకరాల్లో (92శాతం) మేర ఇప్పటీవరకు పత్తి పంట వేశారు. వరికి సంబంధించి 46 లక్షల ఎకరాలు (73శాతం) మేర పంట సాగు చేశారు. భారీవర్షా ల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాలలో పంట నష్టం చేసుకుంది.

**పంటలకు అపార నష్టం :**

భారీ వర్షాలు, వరదల కారణంగా వాణిజ్య పంటలకు అపార నష్టం కలిగింది.. ప్రధానంగా ఉత్తర తెలంగాణలో తీవ్ర నష్టం చోటుకుంది.. కేవలం ప్రాథమిక అంచనాల మేరకే ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 11,900 ఎకరాల్లో పంట నష్టం, జరిగింది. ఇందులో అత్యధికంగా పత్తి పంటకు నష్టం వాట్లిలింది.. ఇందులో అధికంగా అదిలాబాదు రూరల్ (2,600ఎకరాలు), తళమదుగు (2,100ఎకరాలు ), ఉట్నూర్ (800ఎకరాలు) పంట నష్టం వాట్లినట్లు అధికారులు ప్రాథమిక అంచన.. ఈ జిల్లాలో సుమారు 4.25లక్షల ఎకరాలు, కుమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లాల 3.26లక్షలు, మంచిర్యాల1.56 లక్షలు నిర్మల్ జిల్లాలో 1.38 లక్షలు, పత్తి సాగు చేశారు. భారీ వర్షాల కారణంగా ఈ జిల్లాలో అపార నష్టం చోటు చేసుకుంది..

అదేవిధంగా ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు, జిల్లాలో పత్తిపంటలతో పాటు వరికి సైతం తీవ్ర నష్టం వాట్లిలింది.. కరీంనగర్, మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట్, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలో కూరగాయాల పంటలు పూర్తిగా దెబ్బతినంగా వరి నీట మునుగడం, పొల్లాల్లో ఇసుక మెటలు వేయడంతో నష్టం చోటు చేసుకుంది...

**నష్టపరిహారం ఎకరాకు రూ.25 వేలు ?**

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీగా పంట నష్టం చోటు చేసుకోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.. జిల్లాల వారికి వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే పంటల నష్టానికి సంబంధించిప్రాథమిక అంచన వివరాలను ప్రభుత్వానికీ అందజేశారు. వర్షాలు ఇకా కొనసాగుతున్న నేపథ్యంలో తుది అంచనకు అధికారులు రాలేకపోతున్నారు. మొత్తం అంచనాలు అందిన తర్వాత ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు పంట నష్టం అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## రాష్ట్ర ప్రజల్లో గౌరవం పెరిగింది

(మొదటి పేజీ తరువాయి)

తమ అభ్యర్థిగా ప్రకటించడం తెలుగు ప్రజల, ముఖ్యంగా తెలంగాణ ప్రజల గౌరవాన్ని పెంచిందన్నారు. రాజకీయాలకు అతీతంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన బిఆర్‌ఎస్, ఎంఐఎం, టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి, సిపిఐ, సిపిఐ(ఎం) లను సిఎం కోరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి మాట్లా డారు.

ఈ నెల 21వ తేదీన ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామనేషన్ వేస్తారని, ఆ తరువాత ఇండియా కూటమి నేతలు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తా రని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఓటు చోరీకి పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఎన్‌డిఎ కూటమి ఒక వైపు, మహాత్ముడి స్ఫూర్తితో రాజ్యాంగాన్ని పరిరక్షించేం దుకు పోరాడుతున్న ఇండియా కూటమి మరో వైపు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తలపడుతున్నాయని సిఎం అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపిం చాల్సిన బాధ్యత ప్రతీ తెలుగువాడిపై ఉందన్నారు. మాజీ ప్రధానమంత్రి పి.వి. నర్సింహారావు తరువాత ఒక తెలుగువాడిని ఆ స్థాయిలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం మనందరికి గర్వకారణమని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఇప్పుడు ఉందని, రాజకీయాలకు అతీతంగా తెలుగు వారందరూ ఏకం కావాల్సిన సందర్భమని, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, కమ్యూనిస్టు మిత్రులు, ఉభయ రాష్ట్రాల ఎంపిలు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తి కాదని, ఆయనకు ఏ పార్టీలో సభ్యత్వం, ఏ పార్టీతో సంబంధం లేదని, ఆయన ఇండియా కూటమి ద్వారా ఉప రాష్ట్రపతి పదవి కోసం ప్రతిపాదించిన న్యాయ నిపుణులు అని సిఎం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కులగణన కోసం ఏర్పాటు చేసిన ఇండిపెండెంట్ నిపుణుల కమిటీకి ఆయన చైర్మన్ అని సిఎం గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రమాదం ఉందని సిఎం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎన్ డి ఎ అభ్యర్థి గెలుపును అడ్డుకునేందుకు ఇండియా కూటమి అన్ని ప్రయత్నాలనూ చేస్తుందని చెప్పారు.

**ఎన్ టి ఆర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలి**

1991లో ప్రధాని రేసులో ఉన్న పి.వి. నరసింహారావు నంద్యాల ఎంపిగా పోటీ చేసినపుడు, నాటి మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఆయనపై పోటీ పెట్టకుండా మద్దతు పలికి రాజకీయ విజ్ఞతను ప్రదర్శించారని సిఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు.

ఈనాడు ఒక తెలుగు వ్యక్తి ఉప రాష్ట్రపతి అయ్యే అవకాశం వచ్చిన నేపథ్యంలో రెండు రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలు ఎన్‌టిఆర్‌ను ఆదర్శంగా తీసుకుని విజ్ఞత ప్రదర్శించి ఆత్మ ప్రబోధానుసారం ఓటు చేయా లని సిఎం విజ్ఞప్తి చేశారు. తెలుగు ప్రజలంతా ఏకమై ప్రజాస్వామ్యాన్ని పరి రక్షించుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు.

## సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్.కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా హాజరుకానున్నారు. సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సౌహార్ద్ర సందేశాలు ఇస్తారు. ఉదయం 9 గంటలకు జీడిమెట్ల పోలీసు స్టేషన్ నుంచి మహాసభల ప్రాంగణం వరకు 'రెడ్ ఫ్లాగ్ మార్చ్' నిర్వహిస్తారు. అనంతరం 10 గంటలకు మహాసభల ప్రాంగణంలో సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాప రెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేస్తారు. తరువాత 10.15 గంటలకు ప్రముఖ కవి, నవచేతన పబ్లిషింగ్ హౌజ్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న మహాసభల్లో 743 మంది ప్రతినిధులతో పాటు సిపిఐ సీనియర్ నాయకులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొననున్నారు.

**మధ్యాహ్నం 3.15గం.కు ప్రతినిధుల సభ ప్రారంభం**

మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభమౌతుంది. ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు చర్చనీయాంశాల ఎజెండాను, కమిటీలను ప్రతిపాదించనున్నారు. అనంతరం సభాఅధ్యక్షవర్గం, స్టీరింగ్ కమిటీ, తీర్మానాల కమిటీ, మినిట్స్ కమిటీ, అర్హతల కమిటీని ఎన్నుకోనున్నారు. అనంతరం గత మహాసభల నుంచి ఇప్పటివరకు మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులకు సంతాపాన్ని తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎండి. యూసుఫ్ స్వాగతోపన్యాసం చేస్తారు. సాయంత్రం 4 గంటలకు ప్రతినిధుల సభను ఉద్దేశించి ముఖ్య అతిథులు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రసంగించనున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు 5 గంటలకు కార్యదర్శి నివేదికను సమర్పించనున్నారు.

**కార్యదర్శి నివేదికపై చర్చలు**

రాష్ట్ర మహాసభలలో భాగంగా రెండవరోజు గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభమౌతుంది. ప్రతినిధుల సభను ఉద్దేశించి ఉదయం 10.30 గంటలకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కె.నారాయణ ప్రసంగించనున్నారు. భోజన విరామం తర్వాత తిరిగి 3.30 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభంకానుంది. సాయంత్రం 4.30 గంటలకు ప్రతినిధుల సభను ఉద్దేశించి సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతారు. అనంతరం వివిధ అంశాలపై చర్చలు, తీర్మానాలు చేయనున్నారు.

**కమిటీల నివేదికల సమర్పణ, చర్చలు**

మహాసభలలో భాగంగా మూడవ రోజు శుక్రవారం ఉదయం 9.00 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. ఉదయం 10.30 గంటలకు ప్రతినిధుల సభను ఉద్దేశించి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆడిట్ కమిటీ, అర్హతల కమిటీ, కంట్రోల్ కమిషన్ నివేదికలు సమర్పణ, 11.30గంటలకు చర్చలకు కార్యదర్శి సమాధానం ఇస్తారు. మధ్యాహ్నం12.30 గంటలకు నూతన సమితి ఎన్నిక, జాతీయ మహాసభలకు ప్రతినిధుల ఎన్నికతో పాటు ఆహ్వాన సంఘానికి ధన్యవాదాల కార్యక్రమం ఉంటుంది. భోజన విరామం తర్వాత నూతన సమితి సమావేశమై రాష్ట్ర కార్యవర్గం, కార్యదర్శివర్గాన్ని ఎన్నుకోనున్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఫొటో ఎగ్జిబిషన్**

'భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి' లక్ష్యంగా మట్టి మనుషులు బంధూకులు పట్టి దొరల గడీలను గడగడలాండించడమే కాకుండా రజాకార్ ముష్కరులను తరిమికొట్టిన మహోత్తరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర ఘట్టాలతో ఫొటో ఎగ్జిబిషన్ సిపిఐ రాష్ట్ర మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.

సాయుధ పోరాట ఘట్టాలు, చరిత్రతో కూడిన ఛాయా చిత్రాలతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. నాటి మహోత్తర పోరాట చరిత్రను భావి తరాలకు తెలియజేసేందుకు నాటి సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీర యోధుల ఫొటోలను ఏర్పాటు చేశారు. మరోవైపు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి దాడులు

### 15వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ రమేష్



**ప్రజాపక్షం/తాండూర్ :** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిబి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిఎస్‌సి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 15వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగింది అని తెలిపారు. తాండూర్ మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు మగర్గంలో షెడ్‌కు నెంబర్ కోసం మున్సిపల్ అధికారులను సంప్రదించగా ఆర్ఐ రమేష్ 20 వేలు లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. బాధితుడు రూ.15వేలు నగదు ఇస్తుండగా పట్టుకోవడం జరిగింది అని తెలిపారు. విచారణ అనంతరం రిమాండ్‌కు పంపడం జరుగుతుంది అని అన్నారు.



## ప్రాధాన్యతాక్రమంలో
# అభివృద్ధి పనులు పూర్తి చేయండి

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు కీలకమని, ఉన్న వనరులను జాగ్రత్తగా వినియోగించుకుంటూ ప్రాధాన్యత క్రమంలో వివిధ శాఖల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క లతో కలిసి డిప్యూటీ సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ సహజంగా రాబడికి, బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా 1:3 వంతుల పద్ధతిన పనుల కేటాయింపు అనేది కొన్ని దశాబ్దాలుగా పాలనలో పాటిస్తున్న విధానమని తెలిపారు. అయితే గత 10 ఏళ్లు పరిపాలించిన వారు ఆదాయంతో, బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండా కొన్ని శాఖల్లో 1:25 వంతున అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చి వాటిని ప్రారంభించి వెళ్లిపోయారని, ఫలితంగా నిధుల కొరతతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన మంత్రులు వారి శాఖలో పనులు ప్రతిపాదించే పరిస్థితి లేకుండా పోయిందని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. గత ప్రభుత్వ పెద్దల నిర్ణయాల మూలంగా ప్రస్తుతం ఏ పనికి నిధులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, ఆ పనులు పూర్తయ్యే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. వివిధ శాఖల్లో నెలకొన్న అనారోగ్యకర పరిస్థితులను వివిధ శాఖల కార్యదర్శులు సరిచేయాలని డిప్యూటీ సీఎం ఆయా శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ముందుగా 95శాతం పూర్తయిన పనులను గుర్తించి. ఈ తరహాలోనే పనుల ప్రాధాన్యతను గుర్తిస్తూ, ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు.

సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ బి ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ టి.కె.శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతం, హోం శాఖ సెక్రెటరీ రవి గుప్తా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మరింత బలోపేతమే లక్ష్యం

### సిపిఐ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను పరిశీలించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రానున్న మూడేళ్ల కాలంలో అనుసరించాల్సిన విధి విధానాలను రూపొందించుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తూ ముందుకెళ్లే లక్ష్యంగా సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలు జరుగనున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేసారు. మేడ్చల్ జిల్లా గాజులరామారం లోని మహారాజ గార్డెన్స్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న ఈ మహాసభల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర, జాతీయ నేతలు పాల్గొని కూలంకుషంగా చర్చించి విధి విధానాలు రూపొందించుకోనున్నామన్నారు. మంగళవారం మహాసభల ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హన్మంతరావు, పార్టీ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షబ్బీర్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు ఎండి యూసూఫ్, ఆహ్వాన కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షులు ఏసురత్నం తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ మహాసభలను ముఖ్య అతిథిగా విచ్చేయనున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. తొలుత జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి సభావేదిక వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్ పేరిట ర్యాలీగా చేరుకొనే ఈ మహాసభలో అన్ని జిల్లాల నుండి వచ్చే 743 ప్రతినిధులతో పాటు ప్రత్యేక ఆహ్వానితులు మొత్తం 1000 మందికి పైగా పాల్గొంటారన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఉద్యమ కార్యాచరణ, విధి విధానాలను ఈ మహాసభల్లో రూపొందించుకోనున్నామన్నారు. గత వందేళ్లుగా సిపిఐ ప్రతి మూడేళ్లకు ఒకసారి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మహాసభలను నిర్వహిస్తూ రానున్న మూడేళ్ల కాలంలో ఏ విధంగా ముందుకు సాగాలన్న దిశగా నిర్ణయాలు తీసుకోవటమనేది సంప్రదాయంగా వస్తోందన్నారు. ఇదే తరహాలో గత మూడు మాసాలుగా తెలంగాణాలోని 33 జిల్లాలో మండల స్థాయి నుండి మహాసభలు ప్రారంభమై అన్ని జిల్లాల్లోనూ మండల ప్రతినిధులతో జిల్లా స్థాయి మహాసభలు పూర్తయ్యాయని, తదుపరి దశగా బుధవారం నుండి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి మహాసభల్లో జిల్లా స్థాయి పార్టీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మండల, జిల్లా స్థాయిలో జరిగిన చర్చల అంశాలన్నిటిని రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొనే ప్రతినిధులు మరోసారి చర్చించటం ద్వారా రానున్న మూడేళ్ల కాలంలో తీసుకోవాల్సిన విధి విధానాలను అందరి సమక్షంలో రూపకల్పన జరుగుతుందన్నారు.

ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు ఎండి యూసూఫ్ మాట్లాడుతూ కోటి 20 లక్షల మంది కార్మికులకు లబ్ది చేకూరే కనీస వేతనాలను గత 13 ఏళ్లుగా పెంచకపోగా కనీస వేతనాలు, సెలవులు, కార్మిక హక్కులకు దూరంగా ఉండే విధంగా కాంట్రాక్టు కార్మిక విధానాలు కొనసాగుతుండటం విచారకరమన్నారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

### డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ హామీ ఇచ్చారు. డిజిపి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం నాడు జరిగింది. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ...పోలీసు శాఖలోని సిబ్బంది సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డా. జితేందర్ భరోసా ఇచ్చారు. సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించడం, సంక్షేమ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేయడం, పదోన్నతులు, ఇతర పరిపాలనా అంశాలను వేగవంతంగా పరిష్క రించడం కోసం చేస్తున్న ప్రయత్నాలు సంఘం ప్రతినిధులకు తెలుసని అన్నారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు తమ సమస్యలను అధికారుల దృష్టికి దృష్టికి తీసుకువెళ్ళారు. ముఖ్యంగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ చర్యలకు మద్దతు అవసరం వంటి కొన్ని విషయాలను ప్రతిపాదించారు. ఇంటెలిజెన్స్ డిజిబి. శివధర్ రెడ్డి ఐపిఎస్, అదనపు డిజిపిలు, మహేశ్ ఎం. భగవత్ ఐపిఎస్, అనిల్ కుమార్ ఐపిఎస్, ఐజి పిఎం. రమేశ్ ఐపిఎస్, అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు.ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది పనిచేసే యూనిట్ కేంద్రాలలో వైద్య సిబ్బంది సదుపాయాలను కల్పించా లన్నారు. అసోసియేషన్ సూచనలను పరిశీలించి, అవసరమైన స్థాయిలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ భగవత్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపులను విస్తృత స్థాయిలో నిర్వహించి సిబ్బందికి వైద్య పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. పర్సనల్ అడిషనల్ డిజిపి అనిల్ కుమార్ మాట్లాడుతూ మెడికల్ ఇన్వాల్యుడేషన్ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## మరో ఐదు రోజులు వర్షాలు

### కొమరంభీమ్ ఆసిఫాబాద్‌కు రెడ్ అలెర్ట్ జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఐదురోజులు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. దక్షిణ ఒడిశా తీరంలో ఏర్పడిన వాయుగుండం పశ్చిమ, వాయువ్య దిశగా కదిలి భవానీపట్నానికి 50 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్యదిశగా కదులుతూ రాబోయే 12గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపారు. మంగళవారం ఆసిఫాబాద్ లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఈ క్రమంలో రెడ్ అలెర్ట్ జారీ చేశామన్నారు.

ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని, ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వివరించారు.





## ఐజెయు జాతీయ అధ్యక్షుడిగా బల్విందర్ సింగ్

### సెక్రటరీ జనరల్‌గా డి. సోమసుందర్ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) జాతీయ అధ్యక్షులుగా పంజాబ్‌కు చెందిన బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి.సోమసుందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఐజెయు 2025 ఎన్నికల అధికారి మహేష్ కుమార్ సిన్హా ప్రకటించారు. త్వరలో జరగనున్న 11వ ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ ప్లీనరీలో వీరు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. అప్పటి నుంచి వీరి పదవీ కాలం ప్రారంభం కానున్నది. ఈ ఎన్నిక ప్రక్రియ జూన్ 30వ తేదీన ప్రారంభం కాగా, అధ్యక్షులుగా బల్విందర్ సింగ్ జమ్మును, సెక్రటరీ జనరల్‌గా డి. సోమసుందర్‌ను బలపరుస్తూ 14 రాష్ట్రాల కమిటీలు ప్రతి పాదించాయి. ఈ నెల 11వ తేదీన ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షులు ఎస్.ఎన్. సిన్హాల సమక్షంలో పాట్నాలో ప్రధాన ఎన్నికల అధికారి మహేష్ సిన్హాకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఐజెయు జాతీయ అధ్యక్ష, సెక్రటరీ జనరల్ పదవులకు వీరి ఇద్దరి అభ్యర్థిత్వాలు తప్ప ఇతరులు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మహేష్ కుమార్ సిన్హా ప్రకటించారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డి.సోమసుందర్, ఎపియుడబ్ల్యూజె సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం ఐజెయు కార్యదర్శిగా ఉన్న సోమసుందర్, ఇప్పుడు సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. ఐజెయు జాతీయ అధ్యక్షులు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్గా డి. సోమసుందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ఐజెయు రాష్ట్ర కమిటీలు, జాతీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుదాఘాతంతో 8మంది మృతి

### కోమాలో ఉన్న మరో యువకుడు..
### చికిత్స పొందుతున్న మరో నలుగురు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో 48 గంటల్లో వేరు వేరు ఘటనల్లో ఎనిమిది మంది విద్యుదాఘాతంతో మృతిచెందగా మరొకరు కోమాలో ఉన్నారు. మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో క్రిష్ణాష్టమి సందర్భంగా రథాన్ని లాగే క్రమంలో కరెంట్ వైర్లకు తగలడంతో రథంపై ఉన్న పదిమందిలో ఆరుగురు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన నగర ప్రజలు మరవకముందే పాతబస్తీలో మరో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బండ్లగూడలో మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు యువకులు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షంలో వినాయకుడి విగ్రహం తీసుకెళ్తుండగా.. ట్రాక్టర్‌పై ఉన్న విగ్రహం కిరీటానికి హై టెన్షన్ వైర్లు తగిలాయి. ఈ దుర్ఘటనలో టోనీ(21), వికాస్ (20) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో యువకుడు అఖిల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఇ క మూడో ఘటన బాగ్‌అంబర్‌పేట్‌లో చోటుచేసుకుంది. వినాయక మండపం ఏర్పాటు సందర్భంగా అదే బస్తీకి చెందిన రామ్ చరణ్ (24) విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రస్తుతం అతను కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సాయి చరణ్ కోమాలోకి వెళ్లినట్లుగా అక్కడి డాక్టర్లు ప్రకటించారు.

# అంగన్‌వాడీ సేవల్లో తెలంగాణ అగ్రగామి

- 75 శాతం లబ్ధిదారులకు ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు ద్వారా హోం రేషన్
- కేంద్ర పోషణ్ ట్రాకర్‌లో వెల్లడి


**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంగన్‌వాడీ సేవల్లో తెలంగాణ మరో ముందడుగు వేసింది. లబ్ధిదారులకు నిజమైన పారదర్శకతతో పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఫేస్ రికగ్నిషన్ సిస్టంను సమగ్రంగా అనుసంధానం చేసింది. అంగన్‌వాడీ సిబ్బంది లబ్ధిదారుల వివరాలను మొదటిసారి నమోదు సమయంలో ఇకెవైసి, లైవ్ ఫోటో క్యాప్చర్ ద్వారా నమోదు చేస్తారు. ఆ తరువాత ప్రతి నెల హోం రేషన్ (టిహెచ్ఆర్) పంపిణీ సమయంలో ఫేస్ మాచింగ్ ప్రక్రియను అనుసరించి సరైన లబ్ధిదారునికే సరకులు అందజేస్తారు. ఈ విధానం వలన నిజమైన లబ్ధిదారులకే పోషకాహారం చేరుతుంది. పోషకాహారం పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేయడంతో పాటు పారదర్శకత మరింత పెరుగుతుంది.తెలంగాణలో అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని మెరుగు పరిచేందుకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అయితే లబ్దిదారులకే పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో ఎఫ్‌ఆర్ఎస్ విధానాన్ని తెలంగాణలో పక్కాగా అమలు చేస్తున్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క వరుస సమీక్షలతో ఎఫ్ఆర్ఎస్ నమోదు శాతం గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం



18,59,978 మంది హోమ్ రేషన్ (టిహెచ్ఆర్) లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 74.32 శాతం మందికి ఇప్పటికే ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా పోషకాహారం పంపిణీ జరుగుతోందని కేంద్ర పోషణ్ ట్రాకర్‌లో వెల్లడైంది. అంటే లక్షిత లబ్ధిదారులే సద్వినియోగం చేసుకునే విధంగా తెలంగాణ ప్రభుత్వం పారదర్శకతను అమలు చేస్తోంది. ఈ విధానం వలన పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషకాహార సరుకు లు ఎటువంటి దారి మళ్లింపులు లేకుండా నేరు గా లబ్ధిదారుల చేతికి చేరుతున్నాయి. ప్రభుత్వం దీన్ని ఇంకా విస్తరించి 90 శాతం కవరేజ్ లక్ష్యం గా నిర్ణయించుకుంది. ఆ దిశగా అంగన్ వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, సాంకేతిక వనరులను మరింతగా వినియోగించేందు కు చర్యలు ప్రారంభించింది. రాబోయే నెలల్లో మరింత మంది లబ్ధిదారులు ఈ వ్యవస్థలో నమోదు కాబోతున్నారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఫేస్ రికగ్నిషన్ సిస్టం వలన లబ్ధిదారులకే సరుకులు అందుతున్నాయి. ఇది పోషకాహారం పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చింది. తెలంగాణ ఈ విషయంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. మా లక్ష్యం 90 శాతం కంటే ఎక్కువ నమోదు సాధించడం. ప్రతి చిన్నారికి, ప్రతి తల్లికి సరైన సమయానికి పోషకాహారం చేరేలా ప్రభుత్వం చేపట్టిన చర్యలు సానుకూల ఫలితాలనిస్తున్నాయి అని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవల్లో ఎఫ్ఆర్ఎస్ వినియోగంతో విశేష ప్రగతిని సాధించిన మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బందిని మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించారు.

# ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు చేపడుతాం

### ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియచేస్తుందని, రాష్ట్రంలో ఫోటో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించేందుకు, వారి సంక్షేమానికి చర్యలు చేపడుతామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన ఫోటోగ్రఫి పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేసి దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమానికి అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్.ప్రియాంక, సిఎం కార్యాలయం సిపిఆర్ఓ గుర్రం మల్సూర్ హాజరయ్యారు. సభలో మంత్రి మాట్లాడుతూ కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫొటోజర్నలిస్టులకే ఉంటుందని, ఈ ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించే దిశగా ప్రతీ ఏటా ప్రపంచ ఫోటోగ్రఫి డే అధికారికంగా నిర్వహించి, ఫొటో కాంపిటిషన్‌లో విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను ప్రదానం చేస్తున్నామన్నారు. మాయని జ్ఞాపకాల, తీయని కల ఫొటోగ్రఫీ అని, ఎన్నో దశాబ్దాలు గడిచినా ఒక్క ఫోటో మాయని గత స్మృతులను తెలియచేస్తుందని అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యోదంతాన్ని మంత్రి ప్రస్తావిస్తూ ఆ సంఘటనలో ఉన్న ఫోటోగ్రాఫర్ తీసిన ఫొటో ద్వారానే హంతకులను పట్టుకున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫోటోజర్నలిస్టులన్నారు. స్వాతంత్ర్యోద్యమం నుండి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రచార మాధ్యమాలు కీలక పాత్ర వహిస్తున్నాయని, వీటిలో ఫోటోగ్రఫీకి అంత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక మాట్లాడుతూ కాలం గడచినా, ఫోటోలు మాత్రం చెక్కుచెదరకుండా ఉండి మధుర స్మృతులను మిగులుస్తాయన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని సమాచార శాఖ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 5 విభాగాలకు నిర్వహించిన ఫోటో కాంపిటీషన్ కు 94 మంది పాల్గొని 744 ఫోటోలను పంపించారని చెప్పారు. ఫోటోగ్రఫీరంగంలో నిష్ణాతులైన వారితో ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ విజేతలను ఎంపిక చేసిందని వివరించారు. ప్రధానంగా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, చేయూత, రాజీవ్ యువ వికాసం, జనరల్ అనే ఐదు విభాగాలుగా ఎంట్రీలను ఆహ్వానించి ప్రతీ విభాగానికి 8బహుమతులను ప్రకటించామని తెలియచేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

EE-Div16/EE/Divn.16//(SBN)/GHMC

NIT No. 22/Cir-16/Engg-Div-16/SBZ/GHMC/2025-26 తేది: 18.08.2025

**పని వివరణ:** జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట్ సర్కిల్-16లో సివిల్ పనులు, **మొత్తం టెండర్ విలువ:** రూ.14.00 లక్షలు **క్ర.సం.1 నుండి 3 వరకు, ప్రారంభ తేది:** 18.08.2025న మ.3.00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 21.08.2025న మ.3.15గం.ల వరకు, **శ్రీమతి డి.ఆశలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,** డివిజన్-16, సర్కిల్-16, అంబర్‌పేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. **సెల్: 9963550657 / 6309919062.** సంప్రదించవలసిన చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6673-PP/CL/ADVT/1/2025-26, Date: 19-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్.

NIT No. 17/SE(M)/CRZ/GHMC/25-26 టెండర్ ప్రకటన తేది: 18.08.2025

**క్ర.సం.1, పని వివరణ:** నెం.15 సివిల్ పనులు, **అంచనా విలువ:** రూ.1380.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 20.08.2025న సా.05.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 28.08.2025న మ.03.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వై.మహేశ్వర్‌రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి, పూల్‌బాగ్, బాబానగర్. ఫోన్: 7993354273. మరిన్ని వివరాలకు https://tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), చార్మినార్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6724-PP/CL/ADVT/1/2025-26, Date: 19-08-2025

**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం**
తెలంగాణ రాష్ట్ర విద్య & సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ : హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్

టెండర్ నోటీస్ నెం. SE/TGEWIDC/HYD/NIT/460 to 470/2025-26, తేదీ: 18-08-2025

అర్హత కలిగిన కాంట్రాక్టర్లు అందరి నుంచి ఈ క్రింది వాటి కోసం టెండర్లు ఆహ్వానించబడ్డాయి.(1) మక్తల్ వద్ద నున్న కెజిబివికి 2 నుండి 6వరకు C/o CRs. ల్యాబ్ & టాయిలెట్లు, పూర్వపు మహబూబ్‌నగర్ కెజిబివిలో 7నుండి 9 వరకు మరమ్మతులు, జోగులాంబ గద్వాల్‌లోని TGSWRSలో 10నుండి 12వరకు M&R వర్క్స్, మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట్ మరియు కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలలో C/o టాయిలెట్ బ్లాక్‌లు (రూ.12లక్షలు నుండి 350.00లక్షలు).

**టెండర్ల స్వీకరణ చివరి తేదీ మరియు సమయం : 04.09.2025 సాయంత్రం 4గంటల వరకు**

పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.inలో చూడవచ్చు. లేదా సూపరింటెండెంట్ ఇంజనీర్, TGEWIDC, 3rd బ్లాక్, 4th ఫ్లోర్, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, Opp: E-Gate, ఎల్.బి.స్టేడియం, హైదరాబాద్‌లోని కార్యాలయంలో స్వయంగా గానీ, ఫోన్ నెంబర్: 29565991లో కానీ సంప్రదించవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TGEWIDC, హైదరాబాద్.

DIPR R.O. No. : 6692-PP/CL/ADVT/1/2025-26, Date: 19-08-2025

**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము: సూర్యాపేట :: జిల్లా సూర్యాపేట**

నెం.వ్య,మా.క./సూ/ఎ/టెండర్/09/2025-26 టెండర్ నోటీసు తేది: 19.08.2025

సూర్యాపేట మార్కెట్ యార్డులో ఈ క్రింద తెలిపిన పనుల నిర్వాహణకు ఆసక్తి గల వారి నుండి టెండర్లు (తేది:01-09-2025 నుండి తేది: 31-08-2026 కాలపరిమితికి ఆహ్వానించనైనది.

| క్ర.సం. | పని పేరు | షెడ్యూల్ ధర రూ. | ధరావత్తు రూ. |
|---|---|---|---|
| 1. | పారిశుద్ధ్య నిర్వహణ (యార్డు క్లీనింగ్) | రూ. 2,000/- | రూ. 10,000/-లు |
| 2. | మరుగుదొడ్ల నిర్వహణ | రూ. 1,000/- | రూ. 5,000/-లు |
| 3. | క్యాంటీన్ నిర్వహణ | రూ. 500/- | రూ. 3,000/-లు |

**ధరావతు:-** డి.డి. రూపంలో 'సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, వ్యవసాయ మార్కెట్ కమిటి, సూర్యాపేట గారి పేరున సమర్పించగలరు.
**షెడ్యూళ్ళ అమ్మకం:** తేది: 21.08.2025 నుండి తేది: 28.08.2025 వరకు (టెండరు షెడ్యూల్ ధర మొత్తము రూపాయలు తిరిగి చెల్లించబడదు మరియు మరొకరి పేరున మార్చబడదు).
**టెండర్ షెడ్యూళ్లు సమర్పించుట:** తేది: 29.08.2025న ఉదయం. 10.30 ని.ల నుండి మధ్యాహ్నము 3.00గం.ల వరకు.
**టెండర్ షెడ్యూళ్లు తెరచుట:** తేది: 29.08.2025న సాయంత్రం గం.3.30 ని.లకు.
టెండర్ షెడ్యూళ్ళు మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పని దినములలో సంప్రదించగలరు. టెండరు అమోదించుటకు లేదా ఏ కారణము చూపకనే తిరస్కరించుటకు లేక వాయిదా/రద్దు వేయుటకు ఈ క్రింది సంతకము దారునకు అధికారం కలదు.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, సూర్యాపేట.

DIPR R.O. No. : 6700-PP/CL/ADVT/1/2025-26, Date: 19-08-2025

## సిఎంఆర్ బకాయిలు సెప్టెంబర్ 12 నాటికి పూర్తి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : 2024/25 ఖరీఫ్ సీజన్ సిఎంఆర్ బకాయిలను సెప్టెంబర్ 12 నాటికి మిల్లర్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్‌లో మిల్లర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ వడ్లను వేగవంతంగా మిల్లింగ్ చేసి ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లులను తనిఖీలు చేసి రోజువారీ నివేధికను అందించాలని కోరారు. ఈ సమావేశంలో డిఎస్‌ఓ మోహన్‌బాబు, ఏఎస్‌ఓ శ్రీనివాస్ రెడ్డి, డిటి రాజశేఖర్, ఆర్ఐలు శ్రీకాంత్, ప్రమోద్‌లు పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



ప్రజాపక్షం/గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మండలానికి ఒక గ్రామం కాకుండా మండలంలోని అన్ని గ్రామాలకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను గరిడేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో కలిసి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం లేని నిరుపేదలు మండలంలో చాలా మంది ఉన్నారని, వారందరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పోకల ఆంజనేయులు, షేక్ నభీసాహెబ్, పీర్ సాహెబ్, హిమాంబీ, పేరంబి పాల్గొన్నారు.



## ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం

ప్రజాపక్షం/ సూర్యాపేట (పెన్‌పహాడ్) : బాధిత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. మంగళవార్ పెన్‌పహాడ్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కవాతు సిబ్బంది సమన్వయాన్ని ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించడంతోపాటు సిబ్బంది పనితీరు, కేసుల పురోగతి వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రౌడీషీటర్స్, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలలో రాత్రివేళల్లో పెట్రోలింగ్, తనిఖీలు నిరంతరం చేయాలని సూచించారు. పెండింగ్‌లో కేసులు ఉండకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన మహిళలపట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు. సామాజిక కార్యక్రమాలు, అక్రమ రవాణా, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు మొదలగు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ వెంట డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ గోపికృష్ణ, డిసిఆర్‌బి ఎస్ఐ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులోకి అధునాతన ప్యాడీ క్లీనర్స్

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : రైతులకు శ్రమ లేకుండా చెత్తాచెదారం తాలు తీసివేసి ధాన్యం పరిశుభ్రం చేసేలా అధునాతన ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను ఐకెపి కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, అధికారుల సమక్షంలో ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్ల పనితీరు డెమో ద్వారా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అధునాతన ప్యాడీ క్లీనర్స్ ఏర్పాటు చేసేటట్లు చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలో 116 ఐకెపి సెంటర్లకు ప్రస్తుతం 300 ప్యాడీ క్లీనర్స్ పాతవి ఉన్నాయని వాటికి తోడుగా అధునాతన ప్యాడీ క్లీనర్స్‌ను 60 తెస్తున్నట్లు వివరించారు. పాత ప్యాడీ క్లీనర్స్ కూడా రూ.60వేల ఖర్చుతో అధునాతనంగా మార్చే అవకాశం ఉందని ఆ దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట డిఎస్‌ఓ మోహన్ బాబు, డిఎంఓ సంతోష్, మార్కెట్ సెక్రటరీ ఫసియొద్దిన్, యుడిసి ఖాసీం, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు బోనాల రవీందర్, కక్కిరేణి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు త్వరతగతిన పరిష్కారం




ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ : పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని,పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అన్నారు.ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతి అధికారికి సిసిటిఎన్ఎస్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఎస్‌పిమౌనిక ఐపీఎస్,అడిషనల్ ఎఎస్‌పి రమేష్,నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి కుమార్,సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీ నారాయణ, ఏ ఆర్ డిఎస్‌పిశ్రీనివాసులు,సిఐ లు,ఎస్ఐ లు పాల్గొన్నారు.

## వాస్తవికతను చూపించేదే ఛాయాచిత్రం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రజాపక్షం/నల్లగొండ( నకిరేకల్ ): భవిష్యత్ తరాలు గుర్తుపెట్టుకునే విధంగా చిత్రాలను పొందుపరచడంలో ఫోటోగ్రఫీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్స్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్ తీసిన ఫోటోలు ఎప్పటికీ మారవని ఒక ఫోటోగ్రాఫర్ తన కెమెరాతో చిత్రాన్ని ప్రపంచానికి చూపిస్తాడని పదాలను కూడా వివరించలేని విషయాలను వివరించే శక్తి ఒక ఛాయ చిత్రానికి ఉందన్నా రు. ఫోటోగ్రఫీ అనేది వాస్తవికతను చాలా సూక్ష్మంగా స్వీకరించే విషయం అది వాస్తవానికి వాస్తవికత కంటే మించినదిగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ మనోహర్ లింగయ్య, సునీల్, వేణు కుమార్, శీలం చందు,ముత్యాల శీను, శీలం పవన్ పాల్గొన్నారు.



# యూరియాను డంపు చేయొద్దు

ఎవరైనా ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరిక



ప్రజాపక్షం/నల్లగొండ : అవసరం లేని చోట ఎట్టి పరిస్థితులలో యూరియాను డంప్ చేయవద్దని చెప్పారు. ఎవరైనా వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు యూరియా వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు.మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని, గోదామును ఆకస్మీకంగా తనిఖీచేశారు.ఇప్పటి వరకు అమ్మిన యూరియా, ఇతర ఎరువుల వివరాలను, స్టాక్ రిజిస్టర్ ,ఆన్లైన్ లో పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరం ఉన్నంత మేరకే యూరియాను ఇవ్వాలని,ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ అధికారులు తహసిల్దారు కలిసి పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే యూరియాను కేటాయించాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే యూరియాను అమ్మాలని చెప్పారు. యూరియా, ఇతర ఎరువుల సక్రమ సరఫరాకు ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ తనిఖీలు చేయాలని,అలాగే వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి యూరియా దుర్వినియోగం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డిఓ వై .అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

**వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతా ఇవ్వాలి**

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతా ఇచ్చినప్పుడే వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలోని ఏఆర్ నగర్‌లో పర్యటించారు. గత సంవత్సరం ఇక్కడి నుండి ఎక్కువ డెంగ్యూ కేసులు నమోదైన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం పరిస్థితులను పరిశీలించేందుకు ఆమె ఏఆర్ నగర్ లో పర్యటించారు.అయితే ఈ సంవత్సరం ఏఆర్ నగర్ నుండి ఇలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదు. వార్డు లో పరిసరాలతో పాటు, మురికి కాలువలు, ఇండ్లను జిల్లా కలెక్టర్ తిరిగి పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న మందు లు, నమోదైన హై రిస్క్ కేసులు, ప్రసవ కేసుల నమోదు, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణీస్త్రీల ఈ డి డి కేసులు, క్యాలెండర్ ప్రకారం చికిత్స అందిస్తున్నది లేనిది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్, ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి ,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

## ప్రతి విద్యార్థికీ హెల్త్ ప్రొఫైల్

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రతి విద్యార్థినికి ఆర్‌బిఎస్‌కె డాక్టర్ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బేటి బచావో బేటి పడావో పథకంలో భాగంగా బాలిక చైతన్యం కార్యక్రమం ద్వారా కిశోర బాలికలకు విద్య, మానసిక స్థితి, ఆరోగ్యం, పోషణపై కెజిబివి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, వెల్ఫేర్ హాస్టల్స్‌లకు సంబంధించిన టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. బాలిక చైతన్యం కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో ప్రతి వారం ఒకరోజు ఒక శాఖ అధికారులచే అవగాహన కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలీసు వారిచే భద్రత, సైబర్ సెక్యూరిటి, వైద్య ఆరోగ్యశాఖ వారిచే వ్యక్తిగత పరిశుభ్రత, విద్యా శాఖ వారిచే కెరియర్ గైడెన్స్, మహిళా శిశు సంక్షేమ శాఖ వారిచే పిల్లలకి చట్టాలపై, పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటర్ తర్వాత నీట్, ఐఐటి, ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు విద్యార్థినిలను సిద్ధం చేయాలని వాటి కొరకు ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదుపరి సైకాలజిస్ట్ డాక్టర్ రిషికేష్ గిరిప్రసాద్, యూనిసెఫ్ సీనియర్ మేనేజర్ డేవిడ్ రాజ్ టీచర్లకు పిపిటి ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ పూలమ్మ, సిడిపిఓ కిరణ్మయి, మహిళా శిశు సంక్షేమ అధికారులు రవి, చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

**గామ పంచాయితీ కార్యదర్శి సస్పెన్షన్**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి లంచం డిమాండ్ చేసినందుకుగాను సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, జాన్‌పహాడ్ గ్రేడ్4 గ్రామ పంచాయితీ కార్యదర్శి ఇ వెంకయ్యను విధుల నుండి సస్పెండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. జాన్‌పహాడ్ గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి లంచం డిమాండ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల నుండి లంచం డిమాండ్ చేసి విధులపట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు వివరించారు.



## సాగర్ ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద

ప్రజాపక్షం/నందికొండ: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలం కు భారీగా ఇన్ ఫ్లో వస్తువు ఉండటంతో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ కు వరద పోటెత్తుతుంది. దీంతో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్ ఫ్లో గా 410186 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉండటంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. దీనితో ప్రాజెక్టు మొత్తం 26 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి 361322 క్యూసెక్కుల నీటిని స్పిల్ వే ద్వారా దిగువకు విడుదల. అయితే కుడి,ఎడమ కాలువలు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, స్పిల్ వే తో కలిపి మొత్తం అవుట్ ఫ్లో 410000 క్యూసెక్కులు. రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను మంగళవారం సాయంత్రానికి 584.60 అడుగులుగా ఉండి పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలకు 296.2810 టిఎంసీలుగా ఉన్నది. ఈ వరద ఉధృతి ఇంకా నాలుగు లక్షల దాటి పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 26 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి నీటిని విడుదల చేయటం ఈ సీజన్లో ఇదే మొదటిసారి.

## 15 బెస్‌మెంట్ లేవల్ ఇండ్లకు బిల్లులు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్క పేద ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో మొత్తం 16 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 15 బెస్‌మెంట్ లేవల్ వరకు పూర్తి అయిన ఇండ్లకు బిల్లులు మంజురయ్యాయని తెలిపారు. త్వరితగతిన లబ్ధిదారులు ఇండ్లను నిర్మించుకోవాలని ప్రతి ఒక్క లేవల్‌కు బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాలు రాష్ట్రంలోని ప్రతి పేదకు అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ కూడా నిరంతరం జరుగుతుందని ప్రతి పేదకు ఇండ్లు నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌ను పరిశీలించి స్టాక్ రిజిస్ట్రర్, బిల్లులు, యూరియా నిల్వలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా యూరియా కొరత లేదని రైతులు తమకు అవసరమైన మేర యూరియాను తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో దేవేందర్‌రావు, ఎంపివో సలీం, హౌజింగ్ ఏఈ కావ్యశ్రీ, పంచాయతీ సెక్రటరీ మునావర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## గంధమల్ల ప్రాజెక్టుకు అన్ని సర్వేలు పూర్తి

నిండుకుండలా గంధమల్ల చెరువు

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య


ప్రజాపక్షం/తుర్కపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని సర్వేలు పూర్తి అయ్యాయని, 1.4 సామర్థ్యంతో చేపట్టే గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణంతో ఆలేరు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గంధమల్ల చెరువు మత్తడి దూకుతుండటంతో మంగళవారం రోజున ఆయన మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చెరువు అలుగు వద్ద గంగమ్మకు చీరె, కనుము పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యడాది పొడుగునా గంధమల్ల చెరువు అలుగు దుంకి, పాడి పంటలతో రైతాంగం సుభిక్షంగా ఉండాలని గంగమ్మతల్లికి మొక్కినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, స్థానిక ఎమ్మార్వో దేశ్య, తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్, కాంగ్రెస్ నాయకులు, శంకర్ నాయక్, భాస్కర్ రెడ్డి, దేవరుప్పుల ఐలయ్య, బొత్తరాములు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉత్తరప్రదేశ్‌లో మరో 'బుద్ధవనం'..

సందర్శించిన ఉత్తరప్రదేశ్ టూరిజం ప్రతినిధులు

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్‌లో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బుద్ధవనాన్ని ఉత్తరప్రదేశ్ పర్యాటక రంగానికి చెందిన ప్రతినిధులు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఉత్తర ప్రదేశ్ కౌశాంభి జిల్లాలో ఉత్తరప్రదేశ్ టూరిజం నాగార్జునసాగర్ లోని బుద్ధవనం తరహాలో సుమారు 10 ఎకరాలలో బుద్ధుని జీవితాన్ని తెలిపే బుద్ధ థీమ్ పార్క్ పార్కును నిర్మించడానికి ప్రక్రియ ప్రారంభించనున్నది. దీనికై ఉత్తరప్రదేశ్ టూరిజం ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ ప్రాజెక్టుల కార్పోరేషన్ లిమిటెడ్ కంపెనీకి ఈ బాధ్యతలను అప్పజెప్పింది. ఈ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలేంద్ర సింగ్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం బుద్ధవనం సందర్శించి బుద్ధ వనంలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దీనిలో భాగంగా బుద్ధ వనంలో బుద్ధ చరిత వనము జాతకవనం ధ్యానవనం,స్తూపవనం మహా స్తూపం,ధ్యాన మందిరము,ఎంట్రన్స్ ప్లాజా మొదలగు విభాగాలను పరిశీలించి వాటి నిర్మాణ శైలిని తెలుసుకున్నారు. అంతకుముందు బుద్ధ వనం చేరుకున్న ఈ నిపుణుల బృందానికి బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవి చంద్రలు స్వాగతం పలికి బుద్ధవనం శాలువాలతో సత్కరించి మహా స్తూపం లోని బుద్ధ దాతువుల వద్ద బుద్ధ జ్యోతిని వెలిగింప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగార్జున సాగర్ లో ఉన్న బుద్ధమనం ప్రాజెక్టును మోడల్ గా తీసుకొని బుద్ధ చరిత వనం, జాతకవనం, స్తూప వనం,ధ్యానవనం,మహా స్తూపాన్ని, ఎంట్రన్స్ ప్లాజా ను ఆకర్షనీయంగా నిర్మించనున్నట్లుగా తెలిపారు. మొదటగా రూ. 80 కోట్లతో ఈ ప్రాజెక్టును ప్రారంభించి వచ్చే సంవత్సరం ఏప్రిల్ నెల వరకు పూర్తి చేసి బుద్ధ పూర్ణిమ నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. తనతోపాటు ఆర్కిటెక్చర్ రాహుల్, ఇంజనీర్ కళ్యాణ్ చంద్ర, స్తపతి గిరీష్ తివారిలు బుద్ధవనం పరిశీలనకు వచ్చామన్నారు. వీరితోపాటు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రజా పాలన...

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ప్రజాపక్షం/దేవరకొండ: అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రజా పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో జనహిత ఎంఎల్ఏ మార్నింగ్ వాక్ విత్ పీపుల్స్ కార్యక్రమంలో భాగంగా వివిధ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. రూ. 50లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ఎంఎల్ఏ బాలునాయక్ వివరించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ జెడ్పిటిసి అరుణసురేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ విద్యావతి వెంకట్‌రెడ్డి, ఎంపిడివో డానియల్, కృష్ణ, హరికృష్ణ, రాంసింగ్, కర్ణాకర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం :** భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పెండ్లిపాకల కేనాల్‌లో ముంపుకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం నుండి మంజూరైన నష్టపరిహారాన్ని అందజేశారు.

**విద్యార్థులకు అర్ధవంతంగా బోధించాలి :** మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎం, టిఎల్ఎం మేళా కార్యక్రమంలో దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలు నాయక్ పాల్గొని ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధన అభ్యాసన సామాగ్రి ఉపయోగించడం ద్వారా విద్యార్థులకు అర్ధవంతంగా బోధన అందుతుందన్నారు. ఉపాధ్యాయులు మేళాను నిర్వహించడం గొప్ప విషయమన్నారు.


## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చేపల వేటకు వెళ్లి ఇద్దరు, చెరువులో పడి మరొకరు

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : చేపల వేటకు వెళ్లి ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు దుర్మరణం చెందిన ఘటన భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. భువనగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాజ్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ జహంగీర్ (52) చేనేటి వాగులో చేపలు పట్టేందుకు తన స్నేహితుడు భువనగిరి పట్టణానికి చెందిన వెంకటేష్ (53)తో కలిసి చిన్నేటి వాగు వద్దకు వెళ్లారు. అక్కడ వల వేసి చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండగా వల చిక్కుకుంది. దాన్ని తీసే క్రమంలో ఒక వ్యక్తి వెళ్లగా ప్రమాదవశాత్తు చెక్ డ్యాం నుంచి కింద పడిపోయాడు. అతడిని కాపాడడానికి వెళ్లిన మరో వ్యక్తి సైతం అక్కడే చిక్కుకోగా ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాలను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ప్రజాపక్షం/బొమ్మలరామారం : మండలంలోని మర్యాల గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు కురుమనుకుంట చెరువులో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆ యువకుడు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నం దులాల్‌గా గుర్తించారు. గల్లంతైన యువకుడు కోసం స్థానిక ఎస్సై శ్రీశైలం ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## చైనా విదేశాంగ మంత్రితో ప్రధాని భేటీ..



**న్యూఢిల్లీ :** భారత్, చైనా మధ్య సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. గత ఏడాది రష్యాలోని కజాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తన భేటీ అనంతరం పరిస్థితుల్లో సానుకూల మార్పు వచ్చిందన్నారు. భారత పర్యటనలో ఉన్న చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్‌యీ మంగళవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ప్రధాని ఈ మేరకు ట్వీట్ చేశారు. వాంగ్‌యీని కలవడం ఆనందంగా ఉంది. గతేడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమైనప్పటినుంచి.. ఇరుదేశాల సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయి. పరస్పర ప్రయోజనాలు, సున్నిత అంశాలను గౌరవించడం ద్వారా ఇది సాధ్యమైంది.

# ఓట్ల తస్కరణకు బిజెపి, ఎన్నికల కమిషన్ మధ్య పొత్తు

### 'ఓటరు అధికార్ యాత్ర'లో రాహుల్‌గాంధీ



**నవాడ :** ఓట్ల తస్కరణకు బిజెపి, ఎన్నికల కమిషన్ మధ్య పొత్తు కుదిరిందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బిహార్‌లో ఒక ఓటును కూడా దొంగిలించడానికి మహాఘట్బంధన్ అనుమతించదని ఉద్ఘాటించారు. బిహార్‌లో చేపట్టిన ఓటరు అధికార్ యాత్ర మూడవ రోజు మంగళవారం నవాడలోని భగత్ సింగ్ చౌక్‌కు చేరింది. అక్కడ రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రజలకు ఓటు హక్కు సంక్రమించిందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కై ఓట హక్కును ప్రజల నుంచి లాగేసుకుంటున్నారని ఆరోపించారు. 'ఇది మీరు పోరాడిన రాజ్యాంగం ద్వారా మీకు ఇచ్చిన మీ హక్కు, మోడీ, షా ఎన్నికల కమిషనర్లు మీ నుంచి ఓటును లాక్కుంటున్నారు. తేజస్వీ, నేను ఇక్కడ నిలబడి ఉన్న ఇతర (మహాఘట్బంధన్) నాయకులు (బీహార్) ఒక్క ఓటును కూడా దొంగిలించనివ్వమని వారికి చెప్పాలనుకుంటున్నామని రాహుల్ అన్నారు. హర్యానా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ఎన్నికలను ఇసి, బిజెపి దొంగిలించిందని ఆయన ఆరోపించారు.

మహారాష్ట్రలో, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య మ్యాజిక్ ద్వారా సుమారు కోటి మంది ఓటర్లు చేర్చబడ్డారన్నారు. మెషిన్‌రీడబుల్ ఓటర్ల జాబితా సిసి టివి ఫుటేజ్‌లను అందించమని కాంగ్రెస్ ఇసిని కోరిందని, కానీ ఎన్నికల సంఘం అందుకు నిరాకరించిందన్నారు. ఇప్పుడు బిహార్‌లో కొత్త పద్ధతిలో 'ఓటు చోరీ' చేస్తున్నారని, మన కళ్ల ముందే ఈ పనిచేస్తున్నారని, అందుకు తాము అంగీకరించబోమన్నారు. ముందుగా మీ ఓటరు కార్డు పోతుంది, తర్వాత రేషన్ కార్డులు పోతాయి, ఆపై మీ భూమి అదానీ, అంబానీలకు అప్పగిస్తారని హెచ్చరించారు. ఈ దేశం రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, యువతకు చెందినది, అదానీ, అంబానీ వంటి కొంతమంది బిలియనీర్లకు కాదని ఆయన అన్నారు. అన్ని తప్పుడు చట్టాలు, జిఎస్‌టి, నోట్ల రద్దు కొంతమంది బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఉన్నాయని గాంధీ ఆరోపించారు. మీరు డబ్బు, వనరులు ఇస్తారు, కానీ ఈ దేశం మీకు ఉపాధి ఇవ్వదు, ఇది మారారని, అందుకే తాము ఈ ఓటరు అధికార్ యాత్రను ప్రారంభించామని ఆర్‌జెడి నేత తేజస్వీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన దీపాంకర్ భట్టాచార్యలతో కలిసి ప్రజలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు.

**రాహుల్‌ను ప్రధానిని చేయాలి :** తేజస్వీ యాదవ్ వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ బిహార్ ప్రజలను కోరారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రం నుండి ఎన్‌డిఎ సమూలంగా సాగనంపాలని యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త యాత్రను చేపట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాహుల్‌గాంధీని నిద్రలేని రాత్రులు ఇచ్చిన వ్యక్తిగా తేజస్వీ అభివర్ణించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో, గత 20 సంవత్సరాలుగా పాత కారు ('ఖతారా')తో సమానమైన ప్రభుత్వాన్ని నడుపుతున్న ఎన్‌డిఎను తాము సమూలంగా నిర్మూలిస్తామని, తదుపరి లోక్‌సభ ఎన్నికలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేస్తామని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. బేస్ బాల్ క్యాప్, టీషర్టు ధరించిన యాదవ్, సంప్రదాయం, ఆధునికత కలయికను తాను కోరుకుంటున్నానని నొక్కి చెప్పడానికి స్పష్టంగా తన మెడలో 'గాంచా' చుట్టుకున్నాడు. తమకు కొత్త బీహార్ కోసం ఒక దార్శనికత ఉంది అని మాజీ ఉప ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు.



సిపిఐ తమిళనాడు రాష్ట్ర మహాసభ ముగింపు పురస్కరించుకొని సేలంలో జరిగిన భారీ బహిరంగసభ దృశ్యం

# ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బిజెపి సర్కారు కుట్ర

### వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య




**న్యూఢిల్లీ :** తెలంగాణలో యూరియా కొరత సృష్టించడాన్ని నిరసిస్తూ.. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంపీలతో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆందోళన చేపట్టారు. 'మా వాటా మాకు ఇవ్వండి తెలంగాణ రైతుల్ని కాపాడండి అని రాసి ఉన్న ప్లకార్డు పట్టుకొని నినదించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజకీయ కుట్రలు చేస్తున్నదని వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆరోపించారు. ఇందులో భాగంగానే తెలంగాణకు యూరియాను రిలీజ్ చేయడం లేదని మండిపడ్డారు. తాము తెలంగాణ రాష్ట్రానికి అదనంగా యూరియా ఇవ్వాలని కోరడం లేదని, కేటాయించిన వాటానే రిలీజ్ చేయాలని అడుగుతున్నట్టు చెప్పారు. తెలంగాణకు మొత్తం 8.30 లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయిస్తే.. కేవలం 5.32 లక్షల టన్నులు మాత్రమే రిలీజ్ చేసినట్టు చెప్పారు. ప్రతి నెలా రావాల్సిన వాటా కన్నా తక్కువగా యూరియా సరఫరా చేసి... రాష్ట్రంలో కేంద్ర సర్కారు యూరియా కొరతను సృష్టించిందని అన్నారు. కేంద్ర సర్కారు కుట్రపూరిత చర్యలతో తెలంగాణ రాష్ట్ర రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జూన్ చివరి వారంలో కేంద్రమంత్రి నడ్డాను తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కలిసి జూలైలోనే మొత్తం యూరియాను కేటాయించాలని కోరారని గుర్తు చేసారు. ఏనాడూ రైతుల పక్షాన నిల్చొని బీజేపీ.. రైతు ద్రోహి అని ఫైర్ అయ్యారు. తెలంగాణకు కేటాయించిన యూరియాను తక్షణమే రిలీజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. రైతుల బాధలు రాష్ట్రంలోని బీజేపి మంత్రులు, ఎంపీలకు కనిపించడం లేదా? అని ఎంపీ మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాల ముగింపు వరకు యూరియా కోసం మకరద్వార్ ముందు ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

# నిర్దిష్టకాలపరిమితి విధింపుపై... రాష్ట్రపతి అభిప్రాయాన్ని కోరితే తప్పేమిటి?

### కేరళ, తమిళనాడు ప్రభుత్వం తరపు న్యాయవాదులను ప్రశ్నించిన 'సుప్రీం'
### సీనియర్ న్యాయవాదులు కె.వేణు గోపాల్, అభిషేక్ సింఘ్వీ విజ్ఞప్తులను వ్యతిరేకించిన అటార్నీ జనరల్



**న్యూఢిల్లీ :** రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై చర్య తీసుకోవడానికి గవర్నర్లు, రాష్ట్రపతిపై నిర్దిష్ట కాలపరిమితి విధించవచ్చా? అనే విషయమై సూచన ద్వారా రాష్ట్రపతి అభిప్రాయాన్ని కోరితే తప్పేమిటని సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. ప్రతిపక్షపాలిత తమిళనాడు, కేరళ రాష్ట్రాల తరపున వాదించిన న్యాయవాది ప్రశ్నించినప్పుడు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ విధంగా ప్రశ్నించింది. రాష్ట్రపతి సూచనను కొనసాగించగలమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పిఎస్.నరసింహ, జస్టిస్ ఏఎస్.చందుర్కర్ న్యాయమూర్తులు ఉన్నారు. 'రాష్ట్రపతి స్వయంగా రెఫరెన్స్ కోరుతున్నప్పుడు మీకు ఉన్న సమస్య ఏమిటి?. మీరు దీనిని నిజంగానే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారా' అని సూచనపై కీలకమైన విచారణను ప్రారంభిస్తూ న్యాయవాదులను ధర్మాసనం అడిగింది. 'మేం అడ్వైజరీ జ్యురీస్‌డిక్షన్‌లో ఉన్నామని చాలా స్పష్టంగానే ఉన్నది' అని ధర్మాసనం చెప్పింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మే నెలలో రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను పరిష్కరించేటప్పుడు, రాష్ట్రపతి విచక్షణను వినియోగించడానికి న్యాయపరమైన ఉత్తర్వులు నిర్దిష్ట కాలపరిమితిని విధించవచ్చో లేదో సుప్రీం కోర్టు నుంచి తెలుసుకోడానికి ఆర్టికల్ 143(1) కింద తనకున్న అధికారాలపై కసరత్తు చేశారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి చర్య తీసుకోవడం అంటే ప్రభుత్వానికి సంబంధించిన ఒక అంగం ద్వారా తనకు ఇవ్వబడని అధికారాలను స్వీకరించడం లాంటిది. అది' రాజ్యాంగం అపసవ్యతకు' దారితీస్తుంది' అని కేంద్రం తన లిఖితపూర్వక సమర్పణలో పేర్కొంది. కేరళ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కెకె.వేణుగోపాల్ తన వాదన వినిపిస్తూ గవర్నర్లు వీలైనంత త్వరగా రాష్ట్ర బిల్లులను అమలుచేయాల్సిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 గురించి ఇలాంటి ప్రశ్నలను పంజాబ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు సంబంధించిన కేసుల్లో సుప్రీంకోర్టు ఇప్పటికే వివరించిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పలు సుప్రీంకోర్టు తీర్పులను ప్రస్తావించారు. ఆర్టికల్ 200కింద ఉన్న అధికారాలను సుప్రీంకోర్టు పదేపదే వివరించింది. తమిళనాడు (స్టేట్ వర్సెస్ గవర్నర్) కేసులో మొదటిసారిగా అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల ఆమోదానికి గడువు నిర్ణయించబడింది. భారత ప్రభుత్వం రాష్ట్రపతి సూచన కోసం ఆర్టికల్ 143ను అమలుచేయడానికి బదులుగా అధికారిక సమీక్షను కోరాల్సిందని ఆయన అన్నారు. ఆర్టికల్ 74 ప్రకారం మంత్రి మండలి సహాయం, సలహాలకు రాష్ట్రపతి కట్టుబడి ఉంటారని, విచక్షణకు తక్కువ స్థానం ఉందని వేణుగోపాల్ ధర్మాసనానికి తెలిపారు. ఆర్టికల్ 143కింద రెఫరెన్స్ దాఖలు చేయడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇంట్రా కోర్టు అప్పీల్ చేయలేమని తమిళనాడు ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనం ముందు తన వాదన వినిపించారు. 'రెండు వేర్వేరు పార్టీల మధ్య తీర్పులను, ఉప అంశాన్ని మార్చమని ఈ కోర్టును అడుగుతున్నారు. ఇది సంస్థాగత సమగ్రతను దెబ్బతీయడం. మీరు దీనిని ఎంత చక్కగా మభ్యపెట్టినా ఇది ఒక విజ్ఞప్తి' అని అభిషేక్ సింఘ్వీ ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదించారు. జస్టిస్ నరసింహ మాట్లాడుతూ 'న్యాయనిర్ణయాత్మక నిర్ణయం సలహా ఆధారంగా కాకుండా పూర్తి ప్రాతిపదికన ఉంది. తీర్పు చెల్లదు అనే ఒక తీర్పును డివిజన్ బెంచ్‌లో ఎక్కడున్నదో మాకు చూపించండి. తమిళనాడు కరెక్ట్‌గా ఉందా లేదా అనే అంశాన్ని మేం నిర్ణయించడం లేదు' అని ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ అడిగారు. ప్రారంభంలో, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం సూచనను కొనసాగించడంపై అభ్యంతరాలను ధర్మాసనం మొదట పరిశీలిస్తుందని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. కాగా, వేణుగోపాల్, అభిషేక్ సింఘ్వీ విజ్ఞప్తులను అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వ్యతిరేకించారు. విచారణ జరుగుతోంది. జులై 22న రాష్ట్రపతి సూచన అంశాలు దేశం మొత్తాన్ని ప్రభావితం చేస్తాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.తమిళనాడు ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను ఎలా పరిష్కరించాలనే విషయమై ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. గవర్నర్ పరిశీలన కోసం రిజర్వ్ చేసిన బిల్లులపై రాష్ట్రపతి సూచన అందిన తేదీ నుంచి మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని తీర్పు మొదటిసారిగా నిర్దేశించింది. ఈ విషయమై ఐదు పేజీల సూచనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీం కోర్టుకు 14 ప్రశ్నలను సంధించి, ఆర్టికల్ 200, ఆర్టికల్ 201 ప్రకారం గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై దాని అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి రాష్ట్రపతి ప్రయత్నించిన విషయం తెలిసిందే.

# సాగని కార్యకలాపాలు

### ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చకు విపక్షాల పట్టు

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఉభయ సభల్లోనూ కార్యకాలాపాలు ముందుకు సాగడం లేదు. బిహార్‌లో ఇసి చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చ చేపట్టాల్సిందేనంటూ ప్రతిపక్షాలు పట్టువీడకుండా నిరసన తెలియజేస్తున్నాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభల్లో వాయిదా పర్వం కొనసాగుతోంది. మంగళవారం భోజన విరామ సమయం నాటికి లోక్‌సభ రెండుసార్లు, రాజ్యసభ ఒకసారి వాయిదా పడింది. మంగళవారం ఉదయం 11 గంటలకు సభలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపిలు ఎస్‌ఐఆర్‌పై, ఈ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై చర్చ చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపిలు వెల్‌లో దూసుకెళ్లారు. కాగా లోక్ సభలో తొలుత 12 గంటలకు వాయిదా పడగా, సభ తిరిగి ప్రారంభం కాగానే ట్రెజరీ బెంచ్ సభ్యులు ఎజెండాను ప్రవేశపెట్టారు. లోక్‌సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహించిన కృష్ణ ప్రసాద్ టెన్నెటి నిరసన తెలుపుతున్న సభ్యులను తిరిగి తమ సీట్లకు వెళ్లి సభను నడపడంలో సహకరించాలని కోరారు. ఆయన మాటలు పట్టించుకోకుండా ప్రతిపక్ష సభ్యులు ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దిగడంతో, టెన్నెటి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, స్పీకర్ ఓం బిర్లా రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ కింద ఉన్న 22 భాషలలో సభ్యులకు సభ కార్యకలాపాల అనువాదం అందుబాటులో ఉండటం సంతోషకరమైన విషయమని ప్రకటించారు. ఇప్పటివరకు 19 భాషలలో కార్యకలాపాలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు జాబితాలో మరో మూడు భాషలు చేర్చబడ్డాయని ఆయన అన్నారు. మూడు భాషలు కశ్మీరీ, కొంకణి, సంతాలి కొత్తగా చేర్చారు. మన పార్లమెంటు గురించి మనం గర్వపడాలని, భారత ప్రజాస్వామ్యం గురించి గర్వపడాలన్నారు. ఈ సంతోషకరమైన సందర్భంలో సభను సజావుగా నడపడానికి సభ్యులు సహకరిస్తారని ఆశిస్తున్నానన్నారు. బిర్లా ప్రకటన ముగించిన వెంటనే, కాంగ్రెస్ ఎంపిలు సహా ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడి, నినాదాలు చేస్తూ, ఎస్‌ఐఆర్‌పై చర్చ కోసం తమ డిమాండ్‌తో ప్లకార్డులు ప్రదర్శించారు. వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలకు సంబంధించిన మూడు ప్రశ్నలు అడగడానికి సభ్యులను అనుమతించడం ద్వారా స్పీకర్ సభ ప్రశ్నోత్తరాల సమయం కార్యకలాపాలను కొనసాగించడానికి ప్రయత్నించారు. అయితే, ప్రతిపక్షాల స్వర నిరసనలు కొనసాగాయి. దాదాపు 20 నిమిషాల కార్యకలాపాలు ముగిసిన తర్వాత, బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

**రాజ్యసభలోనూ ప్రతిష్టంభన**

మరోవైపు ఎస్‌ఐఆర్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేశారు. దీంతో సభ ప్రారంభమైన నిమిషాల్లోనే మధ్యాహ్నానికి వాయిదా పడింది. సభలో ఎజెండాను ప్రవేశపెట్టిన వెంటనే, ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేస్తూ వెల్‌లోకి వెళ్లి ఎస్‌ఐఆర్ అంశాన్ని లేవనెత్తారు. ఫలితంగా మధ్యాహ్నం 2గంటల వరకు కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. ఉపాధ్యక్షుడు హరివంశ్, నిబంధన 267 ప్రకారం 20 నోటీసులను తిరస్కరించారు.

**ఇసిపై ప్రతిపక్షాల ముమ్మరదాడి**

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై మంగళవారం ప్రతిపక్ష నాయకులు ఎన్నికల కమిషన్‌పై దాడిని తీవ్రతరం చేశారు. నిరసన తెలిపే ఎంపిలు ఎన్నికల కమిషనర్ల చిత్రాలను కలిగి ఉన్న భారీ బ్యానర్‌ను పట్టుకుని, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఇసి జ్ఞానేష్ కుమార్, పోల్ ప్యానెల్‌లోని ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్, వివేక్ జోషిల చిత్రాలతో పాటు 'ఓట్ చోర్', 'సైలెంట్ ఇన్విజిబుల్ రిగ్గింగ్' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో జరిగిన నిరసనకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వం వహించారు. ఆయనతో పాటు అఖిలేష్ యాదవ్, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా ప్రముఖ ప్రతిపక్ష నాయకులు, ఎంపిలు కూడా ఉన్నారు. ఖర్గే తరువాత ఎక్స్ పోస్ట్‌లో పార్లమెంటులో వారి నిరసన వీడియోను పంచుకున్నారు. ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగ బాధ్యత నుండి పారిపోదన్నారు. ఇండియా కూటమి స్వేచ్ఛా, న్యాయమైన ఎన్నికలపై ఆధారాలతో తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తిందని, ఎన్నికల కమిషన్ దర్యాప్తు ద్వారా సమాధానం చెప్పాలని, ప్రతిపక్షాలను బెదిరించడం ద్వారా కాదు అని ఖర్గే హిందీలో పోస్టు చేశారు. ఓటు హక్కు కోసం వీధుల నుండి పార్లమెంటు వరకు పోరాటం కొనసాగుతోందన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో 'ఓటర్ల ఓటు హక్కును తొలగించడం' లక్ష్యంగా ఇసి ఈ కసరత్తు చేస్తోందని ఆరోపిస్తూ, ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై రెండు సభలలో చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి.




# ముంబయిలో భారీ వర్షాలు

### 200కుపైగా విమాన సర్వీసులపై ప్రభావం

**ముంబయి :** భారీ వర్షాలు ముంబయిని అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు రోజులు కురుస్తున్న భారీ వర్షాలకు వీధులు జలమయమయ్యాయి. రోడ్డు, రైలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది, విమాన సేవలపై కూడా ప్రభావం చూపిందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే పరిస్థితిని సమీక్షించి, కేవలం ఆరు గంటల్లో నగరంలో దాదాపు 200 మి.మీ వర్షపాతం నమోదైందని పౌర సరఫరాల అధిపతి తనకు చెప్పారని చెప్పారు. కుండపోత వర్షాల తర్వాత నగరం గుండా ప్రవహించే మిథి నది ఉప్పొంగడంతో కుర్లా ప్రాంతం నుండి దాదాపు 350 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. బొంబాయి హైకోర్టు మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పనిచేసింది. భారీ వర్షాలు సాధారణ జీవనాన్ని స్తంభింపజేశాయి. ఇక్కడి విమానాశ్రయంలో కనీసం ఎనిమిది విమానాలను దారి మళ్లించారు. చాలా విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఎడతెరిపిలేని వర్షం కారణంగా విమానాల ఆలస్యం గురించి విమానయాన సంస్థలు ప్రయాణికులకు సమాచారం ఇచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఆరు విమానాలు, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియాకు చెందిన ఒక్కొక్క విమానాన్ని సూరత్, అహ్మదాబాద్, హైదరాబాద్‌తో సహా సమీపంలోని విమానాశ్రయాలకు మళ్లించినట్లు వర్గాలు తెలిపాయి. అవసరమైతే మాత్రమే ఇళ్ల నుండి బయటకు రావాలని ముంబయి పోలీసులు, పౌర అధికారులు నివాసితులకు విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ రంగాన్ని ఇంటి నుండి పని చేయడానికి అనుమతించాలని కూడా కోరారు. ముంబయి, థానే, రాయ్‌గఢ రత్నగిరి, పాల్ఘర్ జిల్లాలు, మధ్య మహారాష్ట్రను ఆనుకుని ఉన్న ఘాట్ ప్రాంతాలతో సహా కొంకణ్ ప్రాంతానికి భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం వరకు అతి భారీ వర్షపాతం ఉంటుందని హెచ్చరించింది. కొంకణ్, మధ్య మహారాష్ట్రలోని ఘాట్ ప్రాంతాలలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అనేక చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి తెలిపింది. భారీ వర్షాల తర్వాత ఒక విభాగంలో పట్టాలు మునిగిపోవడంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సిఎస్ఎంటి), కుర్లా స్టేషన్ల మధ్య హార్బర్ లైన్‌లో స్థానిక రైలు సేవలను సెంట్రల్ రైల్వే నిలిపివేసిందని అధికారులు తెలిపారు. ముంబయికి వెళ్లే స్థానిక, దూరప్రాంత రైళ్లు రెండూ థానే స్టేషన్‌లో తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. మిథి నది పొంగిపొర్లుతున్నందున ట్రాక్‌లు నీటిలో మునిగిపోవడంతో థానే–సిఎస్ఎంటి, మంఖుర్ద్–సిఎస్ఎంటి మధ్య ఎటువంటి రైళ్లు నడపలేదని సెంట్రల్ రైల్వే తెలిపింది.

కుర్లాలోని క్రాంతి నగర్‌లో ఐదు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను మోహరించి సహాయక చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా నగరంలోని పాఠశాలలు, కళాశాలలు కూడా మూసివేయబడ్డాయి. మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలోని అన్ని సీనియర్ కళాశాలలకు ఉన్నత విద్యా డైరెక్టరేట్ సెలవు ప్రకటించింది. ఈ ఉత్తర్వు పాల్ఘర్, థానే, రాయ్‌గఢ రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాల్లోని కళాశాలలకు వర్తిస్తుంది.




అవసరమైతే మాత్రమే నివాసితులు ఇళ్ల నుండి బయటకు రావాలని ప్రజలు ముంబయి పోలీసులు విజ్ఞప్తి చేశారు. బోరివలి, అంధేరి, సియోన్, దాదర్, చెంబూర్‌తో సహా నగరంలోని అనేక ప్రాంతాలలో రాత్రిపూట భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం కూడా వర్షం కొనసాగింది. ఫలితంగా గాంధీ మార్కెట్‌తో సహా లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. మంగళవారం ఉదయం 4 గంటల నుండి 11 గంటల వరకు సగటున 150 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. శివారు ప్రాంతాలలో ఇంకా ఎక్కువ మొత్తంలో వర్షపాతం నమోదైంది. మిథి నది నీటి మట్టం 3.9 మీటర్లకు పెరిగింది. కుర్లా క్రాంతినగర్ నుండి 350 మంది నివాసితులను సురక్షిత ప్రదేశాలకు తరలించారని సిఎంఒ ఎక్స్‌లో తెలిపింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. అధిక వర్షాల కారణంగా, ముందు జాగ్రత్త చర్యగా బిఎంసి అధికారులు దాదాపు 300 మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారని, డిప్యూటీ సీఎం షిండే విలేకరులకు తెలిపారు. ఆరు గంటల్లో ముంబైలో దాదాపు 200 మి.మీ వర్షపాతం నమోదైందంది. 24 గంటల్లో 300 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రజాపక్షం
బుధవారం, 20 ఆగస్టు

# శాంతి దిశగా వేగంగా అడుగులు

ఉక్రేన్–రష్యా యుద్ధం ముగిసి శాంతి నెలకొనే దిశగా పరిణామాలు వేగవంతమైనాయి. గత సోమవారం నాడు అలస్కాలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లదీమిర్ పుతిన్ మధ్య ఉక్రేన్ యుద్ధ పరిసమాప్తిపై చర్చల్లో కుదిరిన సుహృద్భావ అవగాహనను ట్రంప్ ముందుకు తీసుకెళుతూ ఈ సోమవారంనాడు తన ఓవల్ కార్యాలయంలో ఉక్రేన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీతో చర్చలు కొనసాగించారు. ఉక్రేన్‌కు మద్దతుగా నిలబడిన యూరోపియన్ నాయకుల్లో కొందరు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా జెలెన్స్కీ, పుతిన్ ముఖాముఖి చర్చల్లో పరిష్కారాలు అన్వేషించాక, ఆ తదుపరి తనతో కలిసి త్రిపక్ష సమావేశంలో తుది ఒప్పందం జరుగుతుందని ట్రంప్ జెలెన్స్కీకి, యూరప్ నాయకులకు చెప్పారు. పుతిన్‌తో చర్చల వెనువెంటనే ట్రంప్ జెలెన్స్కీతో పాటు యూరప్ నాయకులకు చర్చల సారాంశాన్ని వివరించారు. అయితే ఉక్రేన్‌కు యూరప్ భద్రతను ఒప్పందంలో భాగం చేసే విషయంపై ఒత్తిడి చేసేందుకు ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, ఇటలీ, ఫిన్‌లాండ్ ప్రభుత్వ నేతలు, యూరోపియన్ యూనియన్ కమిషన్ అధ్యక్షురాలు, నాటో అధిపతి వాషింగ్టన్ వచ్చారు. ఉక్రేన్ భద్రతకు యూరప్ గ్యారెంటీలకు తాము అండగా ఉంటామని ట్రంప్ వారికి హామీ ఇవ్వడంతో వారంతా ట్రంప్‌ను ప్రశంసలతో ముంచెత్తారు.

ఉక్రేన్–రష్యా మధ్య మూడున్నర సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధాన్ని ముగించే అవకాశాలు ఈ వైట్‌హౌస్ సమావేశంతో ఎంతో మెరుగైనాయి. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి రెండు విషయాలు ట్రంప్ స్పష్టం చేశారు. 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియా ప్రాంతం ఉక్రేన్‌కు తిరిగిరాదు. రెండు, నాటోలో సభ్యత్వ ఆకాంక్షను ఉక్రేన్ వదులుకోవాలి. ప్రస్తుతం యుద్ధంలో రష్యా ఆక్రమించుకున్న భూభాగాలు మార్పిడి చేసుకునే విషయాన్ని జెలెన్స్కీ, పుతిన్ ముఖాముఖి చర్చల్లో నిర్ణయించుకోవాలి. అయితే ఉక్రేన్‌కు యూరప్ భద్రత హామీల విషయంపైనే వివాదం కొనసాగవచ్చు. రష్యా తమ భద్రతకు యూరప్ నుంచి హామీలు కోరవచ్చు. ఉక్రేన్ నాటోలో చేరకపోయినా, ''నాటో తరహా'' భద్రత పొందుతుందని ట్రంప్ అన్నారు. ఉక్రేన్‌లో యూరప్ సైన్యాలు ఉండటాన్ని అనుమతించాలని యూరప్ నేతలు పట్టుబడుతుండగా రష్యా అందుకు ససేమిరా అంటోంది. ఉక్రేన్ సైన్యానికి ఆధునిక శిక్షణ, అధునాతన ఆయుధాలు సమకూర్చటానికి ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎంతైనా వ్యాపారి కదా! ఫిబ్రవరిలో జెలెన్స్కీని బెదరగొట్టిన తొలి చర్చల అనంతరం అమెరికాకు అప్పులను చూపి మార్చి/ఏప్రిల్‌లో 500బిలియన్ డాలర్ల విలువ చేసే అరుదైన భూగర్భ నిక్షేపాలను అమెరికాకు తరలించుకుపోయే ఒప్పందం సాధించారు. ఇప్పుడేమో తమ ఆయుధ పరిశ్రమకు పుష్కలంగా ఆర్డర్లు సంపాదించే విధంగా ఉక్రేన్ నుంచి 90 బిలియన్ డాలర్ల ఆయుధాల కొనుగోలు అంగీకారం సాధించారు. ఇవాళ ప్రపంచమంతా వాణిజ్యం చుట్టూ తిరుగుతున్నందున వచ్చిన అవకాశాన్ని ట్రంప్ వదులుకుంటారా?

జెలెన్స్కీ –పుతిన్ సమావేశం కొద్దిరోజుల్లోనే మూడవ దేశంలో జరుగుతుందని భావించబడుతున్నది. ''మనం ఈ సమస్యను పరిష్కరించగలుగుతామా లేక ఈ భయంకరమైన పోరాటం కొనసాగుతుందా'' అనేది కొద్దికాలంలోనే, ఎంతో దూరంలో కాదు, ఒకట్రెండు వారాల్లోనే మనం చూస్తాం అని అన్నారు ట్రంప్. జెలెన్స్కీ కోరుకుంటే యుద్ధం ఆగిపోతుంది, లేకపోతే కొనసాగుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. జెలెన్స్కీ కూడా ఆదివారం రాత్రి పెట్టిన పోస్టులో, ''ఈ యుద్ధాన్ని సత్వరం, విశ్వసనీయంగా ముగించాలన్న బలమైన కోరిక మా అందరిలో ఉంది. శాంతి చిరస్థాయిగా ఉండాలి'' అన్నారు జెలెన్స్కీ. శాంతి నెలకొనాలని యావత్ ప్రపంచం కోరుకుంటోంది. అదిరించి, బెదిరించి వాణిజ్య ఒప్పందాలే కాదు, శాంతి ఒప్పందాలు కూడా సాధించగల దిట్టగా చరిత్రపుటల్లోకి ఎక్కాలని, సాధ్యమైతే ఈ సంవత్సరం నోబెల్ శాంతి బహుమతి దక్కించుకోవాలని ట్రంప్ ఆశిస్తున్నారు. గాజాలో కూడా 60 రోజుల కాల్పుల విరమణ ఇప్పుడే అమలులోకి రావడం ఆహ్వానించదగింది.

# ఎన్నికల కమిషన్ సంక్లిష్టతలోకి ఎందుకు దిగింది?

భారతీయ ఎన్నికల కమిషన్ ఏర్పడి సరిగ్గా 75 ఏళ్ళు పూర్తి అవుతుంది. మన రాజ్యాంగంలోని 324అధికరణ ప్రకారం స్వాతంత్ర్య అనంతరం మన స్వతంత్ర ఎన్నికల సంఘం 1950లో వ్యవస్థీకృతం అయ్యింది. అంటే, ఒకరకంగా ఎన్నికల సంఘం గోల్డెన్ జూబ్లీ జరుపుకోవాలసిన సమయం. ఇలాంటి సమయంలో సుప్రీం కోర్టు ఆదేశాలు చెంపపెట్టు, బీహార్ రాష్ట్రంలో తొలగించిన 65లక్షల ఓట్లు ప్రచురించాలని కోరడం ఎన్నికల చరిత్రలో ఇదో కొత్త అధ్యాయమే? అంతేకాదు, వివరణ పేరుతో ప్రతిపక్షాన్ని బుకాయించడం కూడా ఎన్నికల కమిషన్ కట్టు తప్పిన లెక్కనే బహిర్గతం చేస్తుంది? ఇది ఎన్నికల సంఘంకు మాత్రమే కాదు, స్వతంత్ర సంస్థలను భ్రష్టు పట్టించాలని చూసే రాజకీయ పక్షాలకు సరైన గుణపాఠమే! ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల సంఘం చిత్రంగా, తన స్వతంత్రశైలికి భిన్నంగా తొలిసారి ప్రతిపక్షాలు, మేధావి వర్గం నుండి విమర్శలు ఎదుర్కోవాల్సి రావడం ఇబ్బందికర పరిణామమే. రాజకీయ పక్షాలు ఎన్ని ఆరోపణలు చేసుకున్నా ఎన్నికల సంఘం నిష్పాక్షిత విషయంలో పాలక, ప్రతిపక్షాలు చిన్న చిన్న ఆరోపణలు, అసంతృప్తి తప్ప! ఇంతవరకు విధానపరమైన విమర్శలు చేయలేదు? తొలిసారి ఎన్నికల సంఘం ప్రతిపక్షాల విమర్శలకు నోరు విప్పవలసిన స్థితి ఒకటి ఏర్పడింది. ఆధునిక ప్రపంచంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ ఎన్నికలే! ప్రజలు తమ ఓటు అనే ఇటుకలు పేర్చి అధికార పీఠంను నిర్మిస్తారు. అలాంటి అధికార పీఠం నిర్మించడంలో కీలక పాత్ర నిర్వహించే ఎన్నికల సంఘం స్వతంత్రతకు భిన్నంగా తనుకూర్చున్న కొమ్మను తానే నరుకున్న ఆలోచనలు తాజాగా ఎందుకు చేసింది? మన ఎన్నికల విధానం ఇప్పటి వరకు సరళీకరణ దిశగా, ఎక్కువ మంది వయోజనులు ఓటుహక్కు వినియోగం దిశగా ఉండగా, బీహార్ శాసనసభ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం ఆలోచనా సరళిలో సంక్లిష్టత ఎలా చోటు చేసుకుంది? బిహార్ ఎన్నికల ముందు సహజసిద్ధంగా జరగాల్సిన ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక శ్రద్ధ ఎన్నికల సంఘం పెట్టడంలో ఆంతర్యం ఏమిటి? బిహార్ ఓటర్ల జాబితా సవరణలో స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేయాల్సిన ప్రత్యేక ఆలోచన వెనుక ఉన్న శక్తులు, తాత్విక భూమిక అనుమానాలకు దారితీసింది. దేశంలో మునుపెన్నడూ లేని విధంగా సిటిజన్ షిప్ వెరిఫికేషన్ యాప్‌ను ఉపయోగించడం అనేది. అనేక అనుమానాలు, అభ్యంతరాలకు దారితీసింది. ఒకేసారి 65లక్షల ఓట్లు తొలగించడం మామూలు విషయం కాదు? సుప్రీం కోర్టు తీర్పు కూడా దానినే ప్రశ్నించింది. బీహార్ వెనుకబడిన రాష్ట్రంతో పాటు, భవన నిర్మాణ రంగంలో పనిచేయడం కోసం ప్రజలు దేశ వ్యాప్తంగా కొన్ని నెలల పాటు ఇతర రాష్ట్రాలకు పనుల నిమిత్తం తాత్కాలిక వలస వెళ్తారు. ఇండ్ల వద్ద వృద్ధులు, పిల్లలు మాత్రమే ఉంటారు. స్పెషల్ డ్రైవ్‌లో అట్లాంటి వారి ఓట్లు తొలగించడం అంటే దరిదాపు శ్రామిక వర్గం ఓట్లు గంపగుత్తగా ఉద్దేశ్యపూర్వకంగానే తొలగించడం అవుతుంది. అంతే కాదు! బిహార్ ఓటర్లను ఉన్నపళంగా సిటిజన్‌షిప్ నిరూపించుకోవాలనడంలో కూడా అర్థం లేదు? ఎందుకంటే, విదేశాలకు వెళ్ళి నివసించే వారికి తప్ప, ఈ దేశంలో పుట్టిపెరిగిన వారెవరూ సిటిజెన్‌షిప్ పత్రాలు దగ్గర పెట్టుకోరు. అవిఏమిటో కూడా సామాన్య ప్రజలకు అర్థంకాని విషయం.

తన స్వతంత్రతను కాపాడుకోవాల్సిన ఎన్నికలసంఘం చర్యలకు నిరసనగా స్థానిక ప్రతిపక్షాలు ఎన్నికల బహిష్కరణ నినాదం వరకు వెళ్ళింది. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం ఈ విషయంలో సిటిజన్‌షిప్ అవసరం లేదు? ఆధార్‌కార్డు ప్రాతిపదిక తీసుకొని వెరిఫికేషన్ చేయవచ్చని స్పష్టంగా ప్రకటించింది. అంటే ఏస్థాయిలో ఎన్నికల సంఘం పప్పులో కాలు వేసిందో అర్థం అవుతుంది. ఈమధ్య కాలంలో సంఘ్ పరివార్




ఎజెండాను భుజానికి ఎత్తుకున్న బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రమే సిటిజన్ షిప్ వివాదాన్ని తరచు వివిధ రంగాల్లో అమలు కొరకు ప్రయత్నాలు చేస్తుంది. వివాదాస్పదం చేస్తుంది. స్వతంత్ర్య వ్యవస్థగా కొనసాగాల్సిన ఎన్నికల సంఘం విధానాల్లోకి రాజకీయ పరమైన ఎత్తుగడలు ప్రవేశించడమే వ్యవస్థీకృత పతనానికి నాందిగా చెప్పుకోవచ్చును. ప్రధాన ఎన్నికల కమీషనర్‌గా తనదైన ముద్ర వేసిన టియన్ శేషన్ లాంటి ముక్కుసూటి, నిక్కచ్చి నిబంధనలు అమలుపరిచిన, స్వతంత్ర ఆలోచనలు ముందుకు తీసుకెళ్ళిన ఎన్నికల సంఘం ఇదేనా అన్న సంశయం కూడా ఒక్కోసారి మనకు కలుగుతుంది.

నిరంతరం ఎన్నికల సరళీకరణ, ఎక్కువ మంది వయోజనులు ఓటు వేసే విధంగా ప్రచారం చేస్తూ వచ్చిన ఎన్నికల సంఘం విధానాలు రూపకల్పన పేరుతో ఎందరో వయోజనుల ఓట్లు తొలగించే సంక్లిష్టత వైపు హఠాత్తుగా మళ్ళడం అనేది దేనికి సంకేతం? మన భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ కాదా? విభిన్న బాషా, ప్రాంతీయ, కుల, మత వైరుధ్యాలు ఉన్న మన వ్యవస్థలో ప్రజాస్వామ్య మూలస్థంభం మన ఎన్నికల విధానమే. మన ఆలోచన ధోరణికి ప్రతిబింబంగానే మారిన ఎన్నికల సంస్కరణలు కనిపిస్తాయి.

గత డెబ్బది ఐదేళ్ల కాలం, అంతకు ముందు నుండి మనం ఎన్నికల సరళీకరణ, పరిణామక్రమం ఒకసారి గుర్తు చేసుకుంటే, అనేక అడ్డంకులను, వివక్షతను మన ఎన్నికల విధానం అధిగమిస్తూ వచ్చింది. ఓటు హక్కును ప్రజల చెంతకు చేర్చడంలో, ప్రాధాన్యత గుర్తింపు చేయడంలో సఫలం అయ్యింది. ప్రజాస్వామ్య వ్యవస్థ మూలం ఓటు హక్కు! ఒకనాడున్న వివక్షరూపం నుండి ఓటింగ్ వ్యవస్థ మారుతూ వచ్చింది. సమాజంలో సగభాగం ఉన్న స్త్రీలకు చాలా కాలం ఓటుహక్కు లేదు. బ్రిటీష్ పరిపాలనా కాలంలో మనదేశంలో జరిగిన ఎన్నికల్లో కూడా ఆస్తులు కలిగి ఉన్న ధనికులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు, కొన్ని ప్రత్యేక నిభందనలతో సిక్కులు, ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మాత్రమే 21 సంవత్సరాలు నిండిన వయోజనులందరికీ, పేద, ధనిక, స్త్రీ, పురుష బేధం లేకుండా ఓటుహక్కు కల్పించుకున్నాం. 1951–52 తొలిసాధారణ ఎన్నికల నాటికి పోటీ చేసిన అభ్యర్థులు అందరికీ తలో బ్యాలెట్ బాక్స్ ప్రతి ఓటింగ్ సెంటర్లో ఉండేది. ద్విసభ్య నియోజకవర్గం ఉనికిలో ఉంది. అటుతర్వాత 1969లో మన ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు రూపుదిద్దుకొన్నది. 1970–80 దశకానికి మన ఎన్నికల విధానంలో సమగ్రత, పారదర్శకత చోటుచేసుకుంది. 1988 ఏడాదిలో 61వరాజ్యాంగ సవరణ ద్వారా మన వయోజన ఓటు హక్కును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించుకున్నాము. 1993లో దొంగ ఓట్లు అరికట్టడానికి ఓటర్ ఐడి కార్డులు రూపకల్పన చేసుకున్నాము. 2004నాటికి మన బ్యాలెట్‌లో నోటా వచ్చి చేరింది. అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోన్ ఆఫ్ ఎబోవ్‌కు ఓటు వేసే సంస్కరణ తెచ్చుకున్నాం. 2010 నుండి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్‌లు ఎన్నికల నిర్వహణలో పూర్తిగా వాడుతూ వచ్చాము. దీనితో కోట్లాది రూపాయల బ్యాలెట్ పేపర్ ముద్రణ ఖర్చు తగ్గించడంతోపాటు, పర్యావరణ పరిరక్షణ కాన్సెప్ట్ కూడా తెచ్చుకున్నాం. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విశ్వసనీయత కోసం 2017లో వివిపాట్ స్లిప్పు వాడుకలోనికి వచ్చింది. 2018లో ఎన్నికల నిధులు పారదర్శకత పేరుతో బిజెపి తెచ్చిన ఎలెక్టోరల్ బాండ్లు అనే సంస్కరణ సుప్రీంకోర్టు తప్పు పట్టే వరకు అందులో ఏం జరుగుతుందో అర్థం కాలేదు. వివిధపార్టీలకు సమకూరిన నిధులు, వేలకోట్లు బాండ్లు కొనుగోలు చేసిన కార్పోరేట్ సంస్థలు తీరు చూస్తే, మీకిది, మాకిది అన్న రీతిగా వ్యవహారం మారింది. చట్టబద్ధమైన అవినీతి రూపమే ఎలక్ట్రానిక్ బాండ్లు అనే విషయం బహిర్గతం అయ్యింది. 2018లో ఎన్నికల సంఘం సువిధ పోర్టల్ రూపొందించడం, 2024 నాటికి 85ఏళ్ళు నిండిన సీనియర్ సిటిజన్స్‌కు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం కల్పించడం లాంటి అనేక సంస్కరణలు సరళీకరణ విధానాలు ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. ఒకనాడు సంక్లిష్ట దశలో ఉన్న ఓటుహక్కును, నిబంధనలు మారుతున్న కాలమానం ప్రకారం ప్రజాస్వామ్యంకు దగ్గరగా మెజారిటీ ఓటర్లు ఓటింగ్ ప్రక్రియలో పాలుపంచుకునేలా చూసిన, పౌర సమాజంలో ప్రచారం చేసిన ఎన్నికల సంఘం తాజాగా బిహార్ ఎన్నికల్లో సంక్లిష్టత వైపు ప్రయాణం చేయడంలో అంతర్యం ఏమిటి? మెజారిటీ ప్రజలు ఓటు వేసేలా ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చూడాల్సిన ఎన్నికల సంఘం సిటిజన్‌షిప్ అనే సంక్లిష్టత నెత్తికెత్తుకోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? సరళీకరణ వైపు నుండి సంక్లిష్టత వైపు, కొందరు శ్రామిక వర్గం ఓట్లు తొలగించే వైపు ఎన్నికల సంఘం ప్రయాణించడం అనేక విమర్శలకు దారితీసింది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఎన్నికల కమీషనర్ నియామక ప్రక్రియలో సమతౌల్యం తొలగించబడింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీ నుండి తొలగించి మరో మంత్రిని నామినేషన్‌లో భాగస్వామ్యం చేయడం ద్వారా రాజకీయ ఆధిపత్యానికి ఎన్నికల కమిషనర్ నియామకంలో పెద్దపీట వేయడం జరిగింది. ఫలితంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియ స్వతంత్రతనే అన్యాపదేశంగా ప్రశ్నార్థకంగా మారింది? ఇప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయాలు సైతం వివాదాస్పదం అవుతున్నాయి. ప్రజలందరూ ఓటు వేయాలనే బావన ప్రజాస్వామ్య భావన. కనుక ఇప్పటికైనా ఎన్నికల సంఘం రాజ్యాంగం ప్రసాదించిన తన స్వాతంత్ర్యంతోపాటు, ప్రత్యేకత నిలబెట్టుకోవలసిన అవసరం ఉంది. మన ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడడం అనేది ఎన్నికల సంఘం సర్వస్వతంత్రతపైనే ప్రధానంగా ఆధారపడి ఉంది. మన ఎన్నికల విధానం ఎల్లప్పుడూ సరళీకరణ వైపేకాని, సంక్లిష్టత వైపు లేనేలేదు? మనది ఎప్పుడూ ఓటర్ల పక్షాన నిలబడే సర్వ స్వతంత్ర ఎన్నికల విధానమే దాన్ని కాపాడుకోవాలి.

– ఎన్.తిర్మల్
9441864514

# గవర్నర్‌పై నినదించిన ధిక్కారస్వరం

ఇటీవలి కాలంలో విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేదికలలో చోటుచేసుకుంటున్న నిరసనలు ప్రజాస్వామిక గళాలను సమున్నతంగా ఎత్తిపడుతున్నాయి. అమెరికాలోని ప్రతిష్టాత్మక మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో అభ్యసించిన భారత సంతతి విద్యార్థిని మేఘా వేమూరి మే నెల 29 నాడు 'గ్రాడ్యుయేషన్ డే' సందర్భంగా ప్రసంగిస్తూ ప్రధానంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధ చర్యలను 'నరమేధం'గా పేర్కొనడం తద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించి స్వేచ్ఛా పాలస్తీనా కోసం సంఘీభావాన్ని ప్రకటించారు. తాజాగా అదే కోవలోనే ఈనెల 13న తిరునల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ యూనివర్సిటీ (ఎం.ఎస్.యు) 32వ స్నాతకోత్సవ కార్యక్రమంలో నాగర్‌కోయిల్ ప్రాంతానికి చెంది న పిహెచ్.డి స్కాలర్ జీన్ జోసెఫ్ తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి నుంచి తన డాక్టరేట్ పట్టాను స్వీకరించడానికి నిరాకరించి ఉద్దేశపూర్వకంగా వైస్ ఛాన్సలర్ నుంచి డాక్టరేట్ పట్టాను స్వీకరించి స్నాతకోత్సవ వేదికగా ధిక్కారస్వరంతో నినదించడం విశిష్ట ప్రాధాన్యాన్ని చేకూర్చింది. జీన్ జోసెఫ్ ఎంబిఎ పట్టా పొందిన తర్వాత పిహెచ్‌డి కార్యక్రమంలో భాగంగా 'మైక్రో ఫైనాన్స్'పై పరిశోధన చేశారు. నేను




ద్రవిడ నమూనాను నమ్ముతాను. నేను తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి గురించి అనేకంగా శోధించాను. ఆయన తమిళనాడు సంస్కృతి పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. అలాగే ఆయన తమిళులకు మరియు తమిళనాడుకు ఏమీ చేయకపోగా రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా మరియు తమిళ భాషకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. అందువలన తమిళనాడు గవర్నర్‌గా ఆయన తమిళం మరియు తమిళనాడుకు పెద్దగా ఏమి చేయలేదు. ఆ విధంగా ఏమి చేయని ఆ గవర్నర్ నుండి నేను డాక్టరేట్ పట్టాను తీసుకోకూడదు అని బలంగా నిర్ణయించుకున్నాను. అందువలన గవర్నర్ నుండి డాక్టరేట్ పట్టాను స్వీకరించడానికి నా మనసు ఇష్టపడలేదు' అని ఆమె చాలా స్పష్టంగా వ్యాఖ్యానించడం గమనార్హం. గవర్నర్ ఆర్.ఎన్. రవి అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఆమె ఆ వేదికగా ద్వారా బాహాటంగానే ఎత్తిచూపారు' అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. ద్రవిడ నమూనా ప్రభుత్వ విధానాలపై గవర్నర్ ఆర్.ఎన్.రవి వ్యతిరేకతను కొనసాగిస్తున్న తరుణంలోను ఆయన నుండి జీన్ జోసెఫ్ పిహెచ్‌డి పట్టాను నిరాకరించిన సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు చేయడం సంచలనం సృష్టించడమే కాకుండా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ చాలా మంచి పనులు చేశారు. అందువలన వైస్ ఛాన్సలర్ నుండి డాక్టరేట్ పట్టాని స్వీకరించాలని నేను ముందే నిర్ణయించుకున్నాను. నేను స్నాతకోత్సవ వేదిక నుండి నా సీటుకు తిరిగి వచ్చినప్పుడు నా చుట్టూ ఉన్న కొంతమంది నాతోటి అభ్యర్థులు గవర్నర్‌ను పట్టించుకోకుండా వైస్ ఛాన్సలర్ నుండి డాక్టరేట్ పట్టాను స్వీకరించిన నా నిర్ణయాన్ని అభినందించారు అని ఆమె పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించాలి.

జె.జె.సి.పి.బాబూరావు
9493319690

# మేల్కొనకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదం!

'ఫాసిజం అనేది ఒక్క రాత్రిలో రాదు. మెల్లమెల్లగా దేశంలోకి చొచ్చుకు వస్తుంది. వ్యవస్థలను క్రమంగా బలహీనపరుస్తుంది. ఆ తర్వాత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా సమాధి చేస్తుంది..' జర్మనీలో నాజీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది చరిత్రకారులు, రచయితలు చేసిన వ్యాఖ్యలివి.. ప్రస్తుతం భారతదేశం అటువైపే ప్రయాణిస్తున్నదా? అనే తీవ్రమైన ఆందోళన ప్రజాస్వామ్య వాదులను కలచివేస్తున్నది. ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తున్న తీరును ఇటీవల రాహుల్ గాంధీ బయటపెట్టాక.. ఈ ఆందోళన మరింత పెరిగింది. ఇండియాలో కూడా అలాంటి సిద్దాంతాలను అనుసరిస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ అనుమానం.. వాస్తవరూపం దాల్చే దారిలో అడుగులు పడక ముందే.. ప్రజలు, ముఖ్యంగా యువత మేల్కొనాల్సిన అవసరముంది. లేకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమా దం ఏర్పడి.. ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

### అనేక సారూప్యతలు..

దేశంలో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు.. ఆనాటి జర్మనీలో నాజీల పాలనా లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయని విమర్శకులు, మేధావులు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాజీ పాలనలో హిట్లర్ ఒక్కడినే దేశరక్షకుడిగా చిత్రీకరించారు. అప్పుడు జర్మనీలో జాతీయతను ఒక ఆయుధంగా మలిచి.. ప్రశ్నించే, విమర్శించే వారిని దేశద్రోహులుగా ముద్రవేసేవారు. ఇప్పుడు ఇండియాలోనూ భారత్ మాతాకీ జై వంటి నినాదాలను జాతీయతకు, తమ రాజకీయ ఎజెండాకు ఒక సాధనంగా మలుచుకుంటున్నారు. భారత్‌లో విపక్ష పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యులపై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా వారిని బలహీనపర్చే కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నేతలు, మేధావులు, సామాజిక కార్యకర్తలపై దేశద్రోహం ముద్ర వేసి అనేక సంవత్సరాలుగా జైళ్లలో ఉంచుతున్నారు. మైనార్టీలైన ముస్లింలు, క్రైస్తవుల పట్ల వివక్ష పెరిగేలా కుట్రలు పన్ని అమలు చేస్తున్నారు. సీఏఏ, ఎన్ఆర్సీ వంటి చట్టాలు ఇందులో భాగమే అనే అభిప్రాయాలున్నాయి. గోరక్షకుల దాడులు, మతమార్పిడి ఆరోపణలతో దాడులు, మణిపూర్‌లో జాతి హింస వంటివి ఈ వివక్షను స్పష్టంగా సూచిస్తున్నాయి.

### వ్యవస్థలను బలహీనం చేసి..

ముఖ్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్‌పై వస్తున్న తీవ్రమైన ఆరోపణలు ఇందుకు నిదర్శనం. అయితే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఈసీ సరైన జవాబు ఇవ్వకపోవడం ఈ అనుమానాలను మరింత బలోపేతం చేస్తున్నది. కొన్నేళ్లుగా వెలువడుతున్న తీర్పులను చూస్తే న్యాయవ్యవస్థపైనా ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా గతంలో బీజేపీ ప్రతినిధిగా పని చేసిన ఒక నాయకురాలిని బాంబే హైకోర్టు జడ్జిగా ప్రతిపాదించడం కూడా ఇందులో భాగమేననే చర్చ జరుగుతున్నది. 'ఎలాంటి నేరం చేయకున్నా దేశంలోని అనేక మంది కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు జైళ్ల లో మగ్గుతున్నారు.. కానీ బహిరంగంగా మారణహోమానికి పిలుపునిచ్చేవారికి మాత్రం బెయిల్ దొరుకుతున్నది' అని అరుంధతి రాయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. విమర్శనాత్మక ఆలోచనలను అణచివేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విమర్శలు చేసినందుకు జేఎన్ యూ వంటి వర్సిటీల్లో విద్యార్థులు, ప్రొఫెసర్లు దాడులకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇదీ జర్మనీలో నాజీల విధానాన్ని గుర్తుకు తెస్తున్నాయన్నారు. జోసెఫ్ గోబెల్స్ నాయకత్వంలోని ప్రచార మంత్రిత్వ శాఖ జర్మనీలో మీడియాను పూర్తిగా నియంత్రించింది. ఇప్పుడు భారతదేశంలో మీడియా స్వేచ్ఛ క్రమంగా క్షీణిస్తున్నదని రిపోర్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ వంటి సంస్థలు గుర్తించాయి, 2025 వరల్డ్ ఫ్రీడమ్ ఇండెక్స్ ప్రకారం 180 దేశాల్లో మీడియా స్వేచ్ఛలో ఇండియా 151వ స్థానంలో ఉన్నది. అంతేకాకుండా ప్రతి సంవత్సరం వివి ధ కారణాలతో వందలాది మంది జర్నలిస్టులను అరెస్ట్ చేస్తున్నారు. జర్నలిస్టుల హత్యలు సైతం జరుగుతున్నాయి. నాజీల పాలనలో మీడియా అంతా ప్రభుత్వ అనుకూల వార్తలను మాత్రమే ప్రసారం చేసేది. భారత్ లోనూ ప్రస్తుతం మీడియా ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు చోటివ్వకుండా ప్రభుత్వ భజననే చేస్తున్నది. భారత దేశ ప్రధాన ప్రతిపక్ష నేత లేవనెత్తిన సందేహాలను దేశవ్యాప్తంగా అనేక పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా కవర్ చేయకపోవడం, అప్రధాన వార్తగా ప్రచురించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, సోషల్ మీడియా కంటెంట్‌ను బ్లాక్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు.

### ఏకమైతేనే ప్రజాస్వామ్య పరిరక్షణ..


ప్రస్తుతం దేశపాలకులు అనుసరిస్తున్న విధానాలు ప్రజ ల్లో ఒకరకమైన అనుమానం, భయాన్ని సృష్టిస్తున్నాయి. చరిత్ర చెప్పిన పాఠాల నుంచి ప్రజలు ఇప్పటికైనా నేర్చుకోవాలి. అందరూ ఏకమవ్వాలి. భారతదేశం ఫాసిజం వైపు జారకుండా కాపాడుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు కదలాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడీ బాధ్యత అని గుర్తించాలి.

– ఫిరోజ్‌ఖాన్
9640466464

# సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తత అవసరం

నిత్యం మనం వాడే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, చార్జింగ్ కేబుల్ డివైజ్ ఏదైనా సరే వానిని ఏమార్చి కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రతిచోటా మాటు వేసి ఉంటున్నారు. వీరు చేసే మోసాల గురించి అవగాహన కలిగి ఉండటం, తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారానే వారికి అడ్డుకట్ట వేయగలమని సంబంధిత శాఖ అధికారులు, ఆయా బ్యాంక్ అధికారులు అంటున్నారు. నేటి ఆధునిక కాలంలో ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ డబ్బు చెల్లింపులు అతి సర్వ సాధారణం అయినాయి. జేబులో డబ్బులు అవసరం లేకుండానే మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ఏ విధమైన చెల్లింపులైనా చేసే అవకాశం ఉంది. అతి తెలివిగా కేటుగాళ్లు(హ్యాకర్లు) మనం మన మొబైల్ వాడకంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డబ్బులు కొల్లగొట్టేస్తారు. పాస్‌వర్డ్‌లు సరిగ్గా పెట్టుకోకపోయినా, వారి మాయమాటలకు పడిపోయినా ఖాతా ల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. ప్రతీ రోజు ఏదో ఒక చోట సైబర్ క్రైమ్ జరుగుతూ వుంది. మన అలసత్వం, అమాయకత్వాన్నే ఆసరాగా చేసుకొని కూర్చున్నచోటి నుంచే కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు సైబర్ నేరగాళ్లు. వీరి బారి నుంచి కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు సూచిస్తూ ఆర్బీఐ కొన్ని సూచనలు చేసింది.

**ఆర్‌బిఐ సూచనలు :** ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు సెక్యూర్ పేమెంట్ గేట్‌వేస్‌ను ఎంచుకోవాలి. లేదంటే మన సమాచారం మూడో వ్యక్తికి చేరే ప్రమాదం ఉన్నట్లే. మీ పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు, క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు, సీవీవీ నంబర్లు భద్రంగా ఉంచుకోవాలి. మీ బ్యాంకు ఖాతాల వివరాలు.. క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు సహా ఇతర వివరాలు ఎప్పుడూ మీ ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్స్, వెబ్‌సైట్స్‌లో సేవ్ చేసి పెట్టుకోవద్దు. మీకు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే ఈ మెయిల్స్‌లోని అటాచ్‌మెంట్లు, ఫైళ్లపై ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వాటితో మీ కంప్యూటర్‌లోకి ఫిషింగ్ లింక్‌లు వచ్చే ప్రమాదం ఉంది. కొత్తవారితో మీ చెక్‌బుక్ కాపీలు, కేవైసీ డాక్యుమెంట్లు షేర్ చేయవద్దు.



### డివైజ్ లేదా కంప్యూటర్ సెక్యూరిటీ ఇలా..

తరచూ మీ పాస్‌వర్డ్‌లు మారుస్తూ ఉండాలి.మీ డివైజ్‌ల్లో మంచి యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవడంతోపాటు తరచూ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలి. మీ కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లకు తప్పక పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. మనకు తెలియని సోర్స్‌ల నుంచి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు. మనం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తించిన వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా 24 గంటలపాటు పనిచేసే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 155260కు ఫిర్యాదు చేయవచ్చు. మన తెలుగు రాష్ట్రాలతో సహా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ హెల్ప్‌లైన్ సేవలు ఉంటాయి. మనం కాల్ చేసిన వెంటనే పోలీసులు మన బ్యాంక్ ఖాతాను స్థంభింపజేస్తారు. దీని వల్ల మరింత సొమ్ము మనఖాతా నుంచి పోకుండా కాపాడుకోవచ్చు. తర్వాత కేసు దర్యాప్తు ఉంటుంది.

### ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో కింది జాగ్రత్తలు

ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేస్తున్నప్పుడు ఎల్లప్పుడు వర్చువల్ కీబోర్డు (కంప్యూటర్ స్క్రీన్‌పైన కీబోర్డు కనిపిస్తుంది)ను వాడాలి. సాధారణ కీబోర్డుపై మనం ఏయే నంబర్లు నొక్కామన్నది ఇతరులు తెలుసుకునే అవకాశం ఉంటుంది.. ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాగిన్ చేసిన వెంటనే లాగ్‌అవుట్ కావాలి. తరచూ మీ పాస్‌వర్డ్‌ను మారుస్తూ ఉండాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు.. మీ ఈమెయిల్‌కు ఒకే పాస్‌వర్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లో పెట్టకోవద్దు. సైబర్ కేఫ్‌లు, ఇతర పబ్లిక్ కంప్యూటర్లలో ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేయకపోవడం ఉత్తమం. మీ పాస్‌వర్డ్ మీ ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు, సోషల్ మీడియా ఖాతాలకు తాళం వంటిది. ఇది పక్కాగా ఉండేలా చూసుకోవాలి. అవకాశం ఉన్న ప్రతి చోటా టూ ఫ్యాక్టర్ (రెండంచెల సెక్యూరిటీ) అథెంటికేషన్ పెట్టుకోవాలి.

### ఫోన్ హ్యాకింగ్ మార్గాలివే.. ఫేక్ యాప్స్‌తో జాగ్రత్త

సైబర్ క్రిమినల్స్, హ్యాకర్లు స్పైవేర్‌ను టార్గెట్ చేసిన ఫోన్లలో ప్రవేశపెట్టేందుకు చాలా ఈజీ మార్గం ఫేక్ యాప్స్. మామూలుగా స్మార్ట్‌ఫోన్ల యూజర్లకు అవసరమైన యాప్స్‌ను పోలినట్టుగానే ఉండే నకిలీ యాప్స్ ప్లే స్టోర్‌లో పెడతారు. వాటిలో వాస్తవానికి అసలైన యాప్ ఉండదు. మనం తెలియక ఆ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేశామంటే ఆటోమేటిక్‌గా ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సోషల్ మీడియాలో, కొన్ని రకాల వెబ్‌సైట్లలో, పోర్న్ సైట్లలో కూడా ఈ ఫేక్ యాప్స్‌కు సంబంధించిన లింక్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. పొరబాటున కూడా వాటిని క్లిక్ చేయకూడదు. అలాగే కొత్త యాప్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది.

### వాట్సాప్, ఈ-మెయిల్, ఎస్ఎంఎస్

వాట్సాప్, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ ద్వారా కూడా హ్యాకర్లు స్పైవేర్ లింకులు పంపుతారు. లోన్లు ఇస్తామని, జాబ్ ఆఫర్ అని, సర్‌ప్రైజ్ గిఫ్ట్ అని, లక్కీ డిప్ అని, ఫోన్‌కు కొత్త ఫీచర్స్ అని ఇలా రకరకాల ఫేక్ లింక్స్ క్రియేట్ చేసి వాట్సాప్, ఈమెయిల్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపి, మీ ఫోన్‌ను హ్యాక్ చేసే ముప్పు ఉంటుంది. పొరబాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే ఫోన్‌లో హ్యాకర్ పంపిన వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో అది మన డేటాను మొత్తం హ్యాకర్‌కు పంపేస్తుంది. ఫోన్ ఆ హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. అందుకే అనవసరంగా పనికిరాని లింక్‌లు ఓపెన్ చేయకుండా ఉంటే బెటర్.

### సిమ్ కార్డ్ స్వాప్

మన పర్సనల్ డేటా పొరబాటున హ్యాకర్లకు దొరికితే హ్యాకర్లు సిమ్ కార్డు స్వాప్ టెక్నిక్ వాడుతారు. ఆ డేటా సాయంతో హ్యాకర్లు టెలికాం ఆపరేటర్‌కు కాల్ చేసి సిమ్ రిప్లేస్‌మెంట్ కోసం డిమాండ్ చేస్తారు. ఒకవేళ సిమ్ ఇష్యూ అయితే మన ఫోన్‌లో ఉన్న పాత సిమ్ డీయాక్టివేట్ అవుతుంది. దీంతో ఇక హ్యాకర్‌కు మన ఫోన్ నంబర్ ఫుల్ యాక్సిస్ వచ్చేస్తుంది. దీంతో మన బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు అన్నీ ఆ ఫోన్‌కే వెళ్తాయి. అయితే ప్రస్తుతం సిమ్ తీసుకోవాలంటే ఆధార్ లింక్, బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో ఈ ప్రమాదం కొంత వరకు తగ్గుతుంది. కానీ సిమ్ క్లోనింగ్ అనే మరో ప్రక్రియ ద్వారా మన సిమ్ యాక్టివ్‌లో ఉండగానే, మన నంబర్‌తోనే ఇంకో సిమ్ క్రియేట్ చేసే టెక్నాలజీ కూడా వచ్చింది. ఇది ఇంకా ప్రమాదకరం. అందుకే ఆధార్ నంబర్ లాంటి మన పర్సనల్ డేటాను లీక్ కాకుండా చూసుకోవాలి. బ్లూటూత్ సహాయంతో కూడా హ్యాకర్లు ఒక నిర్ణీత దూరంలో ఉన్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసే చాన్స్ ఉంది. ఇందుకోసం హ్యాకర్లు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. ఈ హ్యాకింగ్ ఎక్కువగా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతుంది. పబ్లిక్ వైఫైని వాడే వాళ్లు హ్యాకర్లకు ఈజీ టార్గెట్ అవుతారు. అందుకే పబ్లిక్ వైఫైని వాడకపోవడం మంచిది. అలాగే మీ వైఫైని ఓపెన్‌గా వదిలేయకుండా ఉండాలి. కచ్చితంగా స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. సైబర్ నేరాల గురించి సరైన అవగాహన పెంచుకుని ఎవరికి వారు రక్షించు కోవాల్సిన ఆవశ్యకత ఉంది.

– కామిడి సతీష్ రెడ్డి
9848445134

## నేడు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పర్యటన

### వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించేందుకు జిల్లాకు రానున్నారు. ముందుగా రెబ్బెన మండలంలోని గోలేటి పెట్రోల్ పంప్ సమీపంలో వరద ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ఎన్టీఆర్ కాలనీ సందర్శించనున్నారు. అక్కడి నుండి దహెగాం మండలం పెసరకుంట గ్రామాన్ని సందర్శించనున్నారు. అక్కడి నుండి కాగజ్‌నగర్ పట్టణంలోని శిథిలమైన నివాసాలను పరిశీలించనున్నారు. ఆ తర్వాత ఆసిఫాబాద్ మండలం రాజూర గ్రామంలో తెగిపోయిన కల్వర్టు సందర్శించాక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించనున్నారు.

## ముధోల్‌కు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ముధోల్ :** ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. 45 కోట్ల రూపాయల నిధులతో టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నార న్నారు.దీంతో స్థానిక యువతకు ఆయా రంగాలైన సాఫ్ట్ వేర్,మెకానికల్,ఎలక్ట్రికల్ తో పాటు పలు రంగాల్లో శిక్షణ పొందడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు.ఆధునిక టెక్నాలజీ తో కూడిన ఈ సెంటర్ ఏర్పాటు అవడం ముధోల్ యువతకు మంచి శుభ వార్తనని వెల్లడించారు.గతంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో అసెంబ్లీ లో విన్నవించగా స్పందించిన వారు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 46 కేంద్రాలలో ముధోల్‌లో ఏర్పాటుకు కృషి చేయడం హర్షించదగిందన్నారు.




## ఎమ్మెల్యే హరీష్‌బాబు నిరవధిక నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 49ను రద్దు చేసి పోడు రైతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సమస్యలు పరిష్కరించేత వరకు దీక్ష విరమించబోమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రత్వం జారీ చేసిన జిఒ నం.49ని రద్దు చేయాలని, పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని శాసనసభ స్పీకర్‌కు లేఖ రాసినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే దీక్షకు బిజెపి నాయకులు, రైతులు సంఘీభావం తెలిపారు. రెండవ రోజు కొనసాగుతున్న ఈ దీక్షకు మద్దతుగా పద్మశాలీ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.



## భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు

### ఆందోళనలో రైతులు

**ప్రజాపక్షం/మందమర్రి :** గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలు పొన్నారం పరిసర గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. ముఖ్యంగా రైతులు వేసుకున్న పత్తి, వరి పంటలు నీట మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొన్నారం గ్రామానికి చెందిన రైతులు బాబు, జాడి చంద్రయ్య, పెంచాల రాజన్న సహా మరెందరో రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు నష్టపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కష్టపడి విత్తనాలు వేసినా ఎరువులు వేసినా ఒక్క వర్షంతోనే పంటలు నీటిపాలు అయ్యాయి. ఇప్పుడు అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ప్రభుత్వం వెంటనే పంటనష్టంపై అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించాలంటూ విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందడుగు వేయాలని కోరుతున్నారు.



## మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమీక్షా సమావేశాలు

**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి సంస్థ సిఅండ్ఎండి బలరాం ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు జరగున్నాయి. ఈ క్రమంలో మందమర్రి ఏరియాలో జనరల్ మేనేజర్ కార్యాలయం, కెకె 5 గనిలో సమావేశాలు నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలు, గనుల యంత్రాల వినియోగం, సంక్షేమ, ఫైనాన్షియల్ అంశాలు, భవిష్యత్ ప్రణాళికలు, సవాళ్లపై చర్చించారు. ఉద్యోగుల సూచనలు పాటించడం ద్వారా ఉద్పాదకత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెకెగ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎఐటియుసి అసిస్టెంట బ్రాంచ్ సెక్రటరి కంది శ్రీనివాస్, డిజిఎం ఆర్‌విస్ఆర్‌కే ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాసుందర్ పటేల్, ఉద్యోగులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## వర్షాకాల సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/బోధన్ :** వర్షాల కారణంగా పట్టణంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలపై వారు దృష్టి సారించారు. బోధన్ పట్టణంలోని 38 వార్డులలోని ప్రజలు వర్షాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా 35, 12వ వార్డులలో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లోని రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించాలని బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కమీషనర్ ను కోరారు. మురుగు నీటి నిల్వ వల్ల దోమలు పెరిగి, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా రాబోయే వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినాయక మండపాల వద్ద, ర్యాలీలు జరిగే ప్రాంతాలలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మండపాల వద్ద దుమ్ము, బురద లేకుండా మొరం వేయాలని, డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈ పండుగలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని నాయకులు కమీషనర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెరక రామకృష్ణ, బిఆర్ఎస్, కార్మిక విభాగం అధ్యక్షులు నాగుల రవి శంకర్‌గౌడ్, శంకర్, అబ్దుల్ రహీం, అత్తారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమీషనర్‌ని బిఆర్ఎస్ నాయకులు సన్మానించారు.

# భారీ వర్షాలు.. జరభద్రం

### తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి జూపల్లి ఆదేశాలు




**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లాలో కురుస్తున్న నిరంతర భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షపాతం కారణంగా కడెం, స్వర్ణ, గడ్డన్న వాగు ప్రాజెక్టుల నుండి నీటిని దిగువకు విడుదల చేయడం జరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలకు ముందుగానే సమాచారం ఇచ్చి రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని గ్రామాల వారీగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, నివాస గృహాలు దెబ్బతిన్న రహదారులు, వంతెనల మరమ్మతులను నాణ్యతతో పునర్నిర్మించేలా అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే వరదల కారణంగా నీట మునిగిన వరి, మొక్కజొన్న, పత్తి కూరగాయల పంటలను తక్షణమే సర్వే చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య శాఖ అధికారులు తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఫీవర్ సర్వే చేపట్టి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మండలాల వారీగా, శాఖల వారీగా భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఫొటో ఎగ్జిబిషన్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండె విట్టల్, ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## 'కడెం'ను పరిశీలించిన మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/కడెం :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ఇన్ఫ్లో, అవుట్ ఫ్లోపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే 9 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులు పూర్తి చేశామని వెల్లడించారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణ సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వరదల కారణంగా పంట పొలాలు,నివాస గృహాలు,రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని,అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అంజేస్తామని హామీ ఇచ్చారు. వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని,ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు. కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సమాచారం అందించాలని,అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాగులు, నదులు, ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,జిల్లా ఎస్పీ జానకి షర్మిల,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,అదనపు కలెక్టర్లు ఫైజాన్అహ్మద్,కిషోర్ కుమార్, ఆర్డీఒ రత్నాకళ్యాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాం సాగర్ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పోచంపహాడ్ శ్రీరాంసాగర్ జలాశయాన్ని పర్యాటక,సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను ఇరిగేషన్ అధికారలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతుందని, ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసం లేదన్నారు. మంత్రి వెంట మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, తదితరులు ఉన్నారు.



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై మంత్రి జూపల్లికి వినతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు మంగళవారం రోజు వినతి పత్రం సమర్పించారు.పట్టణంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని,అలాగే ఇందిరమ్మ పథకంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని ప్రెస క్లబ్ ప్రతినిధులు ఈ సందర్భంగా కోరారు.దీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న ఈ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు,బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ విషయంపై వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని,అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని వారు తెలిపారు.ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 8 నుండి జిల్లాల్లో బస్సుయాత్రలు

### ఉద్యోగుల సదస్సులు

### అక్టోబర్ 12న చలో హైదరాబాద్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సెప్టెంబర్ 8 నుంచి తెలంగాణ జిల్లాలకు బస్సు యాత్రలు, ఉద్యోగుల సదస్సులు, అక్టోబర్ 12న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మారం జగదీశ్వర్ ఏలూర్ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం తెలంగాణ ఉద్యోగుల జెఎసి విస్తృతస్థాయి సమావేశం హైదరాబాద్‌లోని నాంపల్లి టిఎన్‌జిఒ భవన్‌లో 206 భాగస్వామ్య సంఘాలతో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా చైర్మన్ టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, జాయింట్ సెక్రటరీ జాఫర్ హుస్సేన్, ఆర్మూర్ యూనిట్ అధ్యక్షులు శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా చైర్మన్, టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న పాత పెన్షన్ సాధన సదస్సు హైదరాబాద్‌లో తెలుగు లలిత కళాతోరణం, పబ్లిక్ గార్డెన్స్‌లో సాయంత్రం 3 ఒంటల నుంచి వేలాది మంది ఉద్యోగుల భాగస్వామ్యంతో పోరాట సదస్సు నిర్వహణతో పాటు 33 జిల్లాల కేంద్రాలలో ఐడిఒసిలో నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటన, ఉద్యోగుల చైతన్యం కోసం బస్సు యాత్ర నిర్వహణ ఉంటుందని, 11న జిల్లాకు బస్సు యాత్ర రానుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు నోటితో పలకరించి నొసటితో వెక్కిరించినట్లుగా ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరమున్నరకాలంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ఇదిగో తీరుస్తాం అదిగో తీరుస్తామని కమిటీలు వేస్తూ కాలం గడపడమే తప్ప సమస్యల పరిష్కారం చేయటం లేదన్నారు. 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన కార్యక్రమాలు జిల్లా కేంద్రాలలో జరుపుతామన్నారు.

## డా.యోగిరాజ్ వైద్యకు గ్లోబల్ ఐకాన్ యూత్ అవార్డు ప్రదానం

**ప్రజాపక్షం/బోధన్ :** తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం ముగింపు ఉత్సవాలు హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వతపరిషత్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కౌన్సిల్ నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన డా.యోగిరాజ్ వైద్య 2025సంవత్సరానికి గాను గ్లోబల్ ఐకాన్ యూత్ అవార్డును అందుకున్నారు. జ్యోతిష్య శాస్త్ర నిపుణులు, కృష్ణ సరస్వతి ఆస్ట్రో సెల్యూషన్ వ్యవస్థాపకుడిగా ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ లెజిస్టేటివ్ కౌన్సిల్ వ్యవస్థాపకులు డా.రాజ్ నారాయణ తదితర ప్రముఖులు హాజరయ్యారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన యువకులకు అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, యువ ప్రతినిధులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** రైతులకు ఎరువులు, మందులను అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లోని శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్ షాప్‌ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, ఈ పాస్ యంత్రం, ధరల పట్టిక, స్టాకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అడిగిన మందులను నిర్ణీత ధరలకు మాత్రమే విక్రయించాలని, అదనంగా మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు చేసిన అంశాలకు సంబంధించి రైతులకు నగదు రసీదులు రైతులకు అందించాలని తెలిపారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రైతులు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు పాటిస్తూ , పంట మెలకువలు తెలుసుకుని, యూరియా, ఇతర మందులను మోతాదు ప్రకారం పిచికారి చేయాలని, అధిక దిగుబడి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎడిఎ మిలింద్ కుమార్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సారంగాపూర్ మండలం జాంగ్రామ సమీపంలో గల కల్వర్టు ను బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కల్వర్టులు వరద నీటి ఉధృతికి దెబ్బతిన్నాయని, తిరిగి త్వరితగతిన వాటికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం మండలంలోని స్వర్ణ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు.ప్రాజెక్ట్ ఇన్ ఫ్లోఔట్ ఫ్లో సంబంధిత వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్‌తో పాటు జిల్లా,మండల,పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటో భవనలో 186 వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు పసుల వెంకటస్వామి ఫోటోగ్రఫీ పితామహుడు జెండా ఆవిష్కరించి కేక్‌కట్ చేశారు. అనంతరం సింగరేణి మనో విసాక పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లు వైద్య రవి, సోమ బాలాజీ, కల్లాటి రాజు, జయశంకర్‌లను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ కనకయ్య గౌడ్, బద్రి సతీష్, వలస మణిరాజ్, నక్క పవన్, తాళ్లపల్లి రమేష్, కామెర గణేష్ సహా సభ్యులు పాల్గొన్నారు.

### ఫొటో గ్రాఫర్ల ర్యాలీ

**కాగజ్‌నగర్ :** ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ గాంధీ చౌరస్తా నుండి ప్రారంభమైన ర్యాలీ, మార్కెట్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగింది. అనంతరం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఫోటోగ్రఫి పితామహుడు లూయిస్ మండే డాగ్యురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా యూనియన్ సభ్యులు కేక్ కట్ చేసి వడేకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం కుప్టీ, కుమారి, తర్ణం, కడెం నది పరివాహక ప్రాంతం ముప్పునకు గురై నష్టపోయిన పత్తి సోయా రైతుల పంటలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించిన మండల వ్యవసాయ అధికారిణి కృష్ణవేణి, అనంతరం ఆమె మాట్లాడుతూ సూమారుగా 400 ఎకరాలలో రైతులు పంటలను నష్టపోయారని అన్నారు. ఇంకా పూర్తిస్థాయి పరిశీలిస్తే పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు.

## రైతులకు అందుబాటులో యూరియా

సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథనిలో 900 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పిఏసిఎస్ మంథనిలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా బస్తాల కోసం వచ్చే రైతులు తమ వెంట పట్టా దారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్ ప్రతులు తమ వెంట తీసుకురావాలని కోరారు. ఐటి, పరిశ్రమలు, శాసన సభవ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరిపడా యూరియా బస్తాలు అందుబాటులో ఉంచుతున్నామని, రైతులు ఏ మాత్రం అధైర్య పడవద్దని, రైతులకు యూరియా కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అలాగే వ్యవసాయ శాఖ ఎడిఏ, ఏఓ, ఎఇఓల సహకారంతో యూరియా కొరత లేకుండా తగు చర్యలు చేపడుతున్నారని, రైతులు తమ అవసరాల మేరకే యూరియా తీసుకొని వాడుకోవాలని కోరారు.

## యూరియా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో యూరియా అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే హెచ్చరించారు. మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లో సిబ్బంది 24/7 నిరంతరం పగడ్బందీగా అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తూ యూరియా అక్రమ రవాణా చేసేవారిని పట్టుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా యూరియా పంపిణీ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యూరియా ఎరువులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## సాగునీరు అందించాలి: రమణ



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** నాడు శాసన మండలి సభలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ రోళ్లవాగు ప్రాజెక్టుకు 90శాతం పూర్తయినప్పటికి షెటర్స్ బిగించకపోవడంతో ఆలస్యం వహించడం సరికాదని వెంటనే షట్టర్లు బిగించి నీరు వృథా కాకుండా రైతన్నలను ఆదుకునే విధంగా రైతులకు సాగునీరు అందించి పంటలు పండించుకునే విధంగా చూడాలని ఎమ్మెల్సీఎల్ రమణ నాడు శాసనమండలి సభలో ప్రభుత్వాన్ని కోరారు . అయినా ఇప్పటివరకు రోళ్లవాగు ప్రాజెక్టుకు షట్టర్లు బిగించకపోవడంతో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో రైతులు ఉపయోగపడే నీరు వృథా కావడం చాలా బాధాకరమని ఎల్ రమణ తెలిపారు.

## కేంద్రం వివక్ష తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపిస్తుంది: జీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల:** కేంద్రం తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపిస్తుందని మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని బోర్నపల్లి వరద తీవ్రతను రైతులు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రులు తెలంగాణ రాష్ట్ర ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తారని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలలో ఒక్క ఇల్లు మంజూర్ ఇవ్వలేదని హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందన్నారు. గత ప్రభుత్వం రూ.3 లక్షల ఇంటి సహాయానికి అనిపత్రం ఇచ్చిన అది అమలు చేయలేదని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తదుపరి రూ.5 లక్షల మంజూర్‌తో మొదటి విడతలో నియోజకవర్గానికి 3500ఇండ్లుమంజూర్ చేయడం జరుగుతుందని అన్నారు.

## ప్రచార రథాన్ని ప్రారంభించిన డిఎస్‌పి రఘుచందర్



**ప్రజాపక్ష/జగిత్యాల:** జగిత్యాల పట్టణంలోని పురాణీపేట శ్రీ లోకమాత(గాజుల) పోచమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ ప్రచార రథాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి పోచమ్మ తల్లిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం 63వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం నుండి శనివారం వరకు జరుగు ఉత్సవ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, గాజోజి రాజగోపాల్‌చారి, రాఘవచారి, జనగామ గంగాధర్, అయిలా చంద్రప్రకాశ్, మునిధర్, వద్లూరి హరికృష్ణ, సత్యజిత్, ప్రవీణ్, ఆలయ పూజారి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సన్నిదిలో కెసిఆర్ సతీమణి



**ప్రజాపక్షం/ వేములవాడ:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సతీమణి శోభమ్మ, మనువడు హిమాన్షులతో కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఘనంగా స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజన్న చిత్రపటాన్ని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, పట్టణ, మండల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి సిరిసిల్ల చేనేత కళాకారుడి ప్రత్యేక చీర సమర్పణ



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి సిరిసిల్ల సాయి నగర్‌కు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ ఒక అపూర్వమైన అగ్గిపెట్టెలో ఇమిడే పరిమళించే పట్టుచీరను మంగళవారం సమర్పించారు. ఈ ప్రత్యేక చీరను ఆయన ఆలయ కార్య నిర్వహణ అధికారి రాధాబాయి కి అందజేశారు. ఈ చీర ప్రత్యేకతలు పొడవు 5.5 మీటర్లు, వెడల్పు48 ఇంచులు, బరువు 250 గ్రాములు తయారీ విధానం: పూర్తిగా పట్టు దారాలతో, బంగారు జారి సహా 21 రకాల సుగంధ ద్రవ్యాలతో తయారు చేయబడింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు, ఈవో రాధాబాయి నల్ల విజయ్‌కి శేషవస్త్రం కప్పి, ప్రసాదం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ హాజరయ్యారు.

# సాగుకు సరిపడా యూరియా నిల్వలు

రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. జిల్లాలో పంటల సాగు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో సాగు విస్తీర్ణం, ఎరువుల నిలువలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో ఆయా పంటల సాగుకు అణుగుణంగా ఎప్పటికప్పుడు యూరియా స్టాక్ తెప్పిస్తున్నామని స్పష్టం చేశారు. యూ రియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమంతంగా ఉండాలని తమ మండలాలకు వచ్చే ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు సరఫరా చేయాలని ఆదేశించారు.రైతులు తమకు అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.. ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు.యాజమాన్య పద్ధతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి ఎరువులు వినియోగించేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం ఏడీఏలు ఏవోలు ఎఇఒలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మెనూ పాటించాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం చింతకుంట పరిధి శాంతినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు తిరుగుతూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, బోధన మెటీరియల్, రీడింగ్ కార్నర్‌ను పరిశీలించారు. పాఠశాలలో టివి పని చేస్తుందా? ఉపాధ్యాయులు ఏం చెబుతున్నారని విధ్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అదనపు తరగతి గదుల కోసం భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వారి వెంట ఎంఈవో ఆనందం, హెచ్‌ఎం గౌస్ ఖాన్ తదితరులున్నారు.

## ఉద్రిక్తత మధ్య యూరియా పంపిణీ



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండలంలోని కరీంపేట గ్రామంలో ఉద్రిక్తత నడుమ సహకార సంఘం అధికారులు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. శంకరపట్నం మండలం తాడికల్ సహకార సంఘం పరిధిలో తాడికల్, కరీంపేట గ్రామాలలో రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. తాడికల్ గోదాంకు 450 యూరియా బస్తాలు రాగా, కరీంపేట గ్రామానికి 230 యూరియా బస్తాలు వచ్చాయి. రైతులు యూరియా కోసం వరుసలో నిలిచి ఉండగా కరీంపేట గ్రామంలో సోమవారం ఆధార్ కార్డు జిరాక్స్‌లను ఇచ్చిన రైతులతో పాటు మరి కొంత మంది రైతులు కరీంపేట గ్రామంలో యూరియా నిల్వ చేసిన దుకాణం ముందు కొంతమంది రైతులు చెప్పులు క్యూలో పెట్టారు. ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చిన రైతులకు పంపిణీ చేయాలని గొడవ జరగడంతో తాడికల్ సహకార సంఘం సీఈవో వీరస్వామి కరీంపేట గ్రామానికి చేరుకోగా ఆయనతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు పహారా మధ్య ఒక్కో రైతుకు యూరియా బస్తాలను అందించారు. తాడికల్ గ్రామంలో ఏడిఏ శ్రీధర్, ఎఒ వెంకటేష్ పర్యవేక్షణలో రైతులకు యూరియా పంపిణీ జరిగింది. రైతులకు ఆధార్ జిరాక్స్‌లు తీసుకుని వారందరికీ మలోదులో అందిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

# 5 లోపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ

మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** పెండింగ్‌లోఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సెప్టెంబర్ 5వ తేదీలోగా క్రమబద్ధీకరించేలా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. దరఖాస్తుదారులు మీ వద్దకువస్తే వెంటనే స్పందించి.. సమస్య పరిష్కరించేలా చూడాలన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, నిటేసన్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ, మున్సిపల్ ల్యాండ్ జియో ట్యాగింగ్, కోర్టు కేసులు,డిలాబరేటెడ్ కండీషన్ నివాస గృహాలు, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, కమ్యూనిటీ భవనాలు, అనాథరైజ్డ్ కన్ స్ట్రక్షన్స్, అనాథరైజ్డ్ హోర్డింగ్స్,రోడ్లు, ఫుట్ పాత్ ఆక్రమణలు,డెబ్రిస్ లిఫ్టింగ్, డీఆర్‌సీసీ నిర్వహణ,ఓపెన్ గార్బేజ్ పాయింట్స్,ఫైన్స్ కలెక్షన్స్, బయోగ్యాస్ ప్లాంట్ ప్రపోజల్స్, పారిశుద్ధ్యం తదితర అంశాల పై సుదీర్ఘంగా చర్చించారు. సంబంధిత అంశాలపై సూచనలు చేస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చే నెల 5 వ తేదిలోపు ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించేలా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ టెక్నికల్ సమస్యలు పరిష్కరించి ఫీజులు చెల్లించిన దరఖాస్తులను క్రమబద్ధీకరించాలన్నారు. నగరంలోని ఓపెన్ స్థలాలకు సంబంధించిన వివరాలను అందించాలని, మున్సిపల్ ల్యాండ్స్ ఏమున్నా గుర్తించి డీమార్కింగ్ చేయాలన్నారు. ఆక్రమణలకు గురికాకుండా మున్సిపల్ స్థలాలు, భవనాలకు ఫెన్సింగ్, వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ ల్యాండ్స్, భవనాలకు, జియోట్యాగింగ్ ఆన్ లైన్ చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులు పెండింగ్ లేకుండా చూడాలని, కోర్టు కేసుకు సంబంధించి ముందస్తు సమాచారమందించాలని కోరారు. కంటెంట్ కేసులు ఏ మున్నా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. డిటిఎఫ్ పెండింగ్ కేసుల వివరాలను అందించాలన్నారు. నగరంలో వర్షాల నేపథ్యంలో డిలాబరేటెడ్ కండీషన్‌లో ఉన్న నివాసాలను గుర్తించి నోటిసులు జారీ చేసి డీమాలిష్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఫుట్ పాత్ రోడ్డు ఎన్‌క్రోచ్ మెంట్లను నిరంతర ప్రక్రియగా తొలగించాలని ఆదేశించారు. డీమార్టు, పద్మానగర్ తదితర ప్రాంతాల్లో ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారం చేసే వారిని తొలగించాలని ఆదేశించారు. నగరంలో ఉన్న భవణ నిర్మాణా వ్యర్థాలను డివిజన్‌ల వారిగా గుర్తించి వివరాలు అందివ్వాలన్నారు. ప్రతి రోజు డెబ్రిలను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అనాథరైజ్డ్ హోర్డింగ్స్ గుర్తించి వివరాలు అందించడంతో పాటు ప్రకటనల పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. నగరంలో పారిశద్ధ్యంను మంరింత మెరుగు పర్చాలని గార్బేజ్ పాయింట్లలో చెత్త కనపడకుండా పరిశుభ్రంగా ఉంచాలని, గార్బేజ్ పాయింట్లలో చెత్తవేస్తే జరిమానాలు విధించాలన్నారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రపోజల్స్ తయారు చేయాలని, డిఆర్‌సిసిల నిర్వహణపై దృష్టి పెట్టాలని, కమ్యూనిటీ భవనాలను నగరపాలక ఆధీనంలోకి తెచ్చి వార్డు ఆఫీసులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిలు వేణుమాదవ్, ఖాద్ మోహియుద్దీన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

# యూరియా అధికంగా వాడటంతో పంటలకు నష్టం

పెద్దపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** యూరియా అధికంగా వాడటం ప్రమాదకరమని, యూరియా నిల్వ ఉంచరాదని, ప్రస్తుత అవసరం మేరకు మాత్రమే రైతులకు కొనుగోలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలోతెలిపారు. యూరియా బస్తాలను ముందస్తుగా కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకుంటే ఎరువు గాలిలో కలసిపోయే స్వభావం వలన దానిలో గల నత్రజని పోషకం అవిరైపోతుందని అట్టి బస్తాలను వాడినప్పుడు మొక్కకు నత్రజని పోషకం సరిగా అందక దిగుబడులు తగ్గిపోతాయని అన్నారు. 45 కిలోల యూరియా బస్తాలో 20 కిలోల నత్రజని, పోషకం ఉంటుందని,బస్తాలు ముందస్తుగా కొన్ని నిల్వ చేసుకుంటే ఈ 20 కిలోలు నత్రజని పోషకం ఆవిరి అయిపోతాయని అన్నారు.యూరియా బస్తాలు ఇండ్లలో నిల్వ చేసుకుంటే గాల్లో కలిసి పోతున్నప్పుడు,ఘాటైన ప్రమాదకరమైన విషవాయువు విడుదలవుతుందని,దీని వలన ముక్కుమంట, జలు బు, దగ్గు, గొంతు నొప్పి ఇతర శ్వాసకోశ వ్యాధులు వస్తాయని అన్నారు.ప్రస్తుత డోసు ఎంత అవసరం ఉందో అంత మేరకే యూరియా కొనుగోలు చేసి వాడుకోవాలని, ముందస్తుగా కొని నిల్వ చేసు కొని డబ్బులు వృథా,మీ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని అన్నారు.యూరియాను ఒకేసారి పెద్ద మొత్తంలో అంటే ఎకరానికి ఒక బస్తా చొప్పున ఒకేసారి వేస్తే, మొక్క విపరీతంగా ముదిరాకు పచ్చలోకి వచ్చి,చీడ పీడలను ఆకర్షిస్తుందని, పంట కాలం, సాగు ఖర్చు పెరిగిపోతుందని, పూత ఖాతా,పంట దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. వరి పొలంలో యూరియా వేసినప్పుడల్లా 15 లేదా 20 కిలోల యూరియాను పొడి ఇసుకలో కలిపి పంటకు సమంగా వేసుకోవాలి.అట్లా 15 రోజులకు ఓసారి చెప్పున 4 దఫాలు వేసుకోవాలని,చివరి దశలో యూరియా తో పాటు ఒక 20 కిలోల పొటాష్ కలిపి వేసుకుంటే సరిపోతుందని అన్నారు.యూరియా పంటకు ఎంత మంచి చేస్తుందో అధికంగా వాడితే అంతకంటే ప్రమాదకరమైందని రైతులు తెలుసు కోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

## రోడ్డు వెడల్పు పనులు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా కూల్చివేసిన ఇళ్ల మట్టి వ్యర్థాలను తొలగించే ప్రక్రియను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ నుంచి మూల వాగు వంతెన వరకు ప్రధాన రహదారి 47 కోట్లతో వెడల్పు పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మట్టి వ్యర్థాలు తొలగింపు పూర్తి కాగానే వేములవాడ పట్టణ ప్రజలు రాజన్న భక్తుల ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రోడ్డు పనులు పూర్తి అవుతాయని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు.

## పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** నగరంలో పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేయాలని, డంపర్ బిన్స్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరంలో మంగళవారం సానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. బస్టాండ్ వెనుక స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ స్మార్ట్ బిన్స్‌ను తనిఖీ చేసి పరిశీలించారు. మరో వైపు నగరంలో పలు చోట్ల పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. అంబేద్కర్ స్టేడియంలోని స్పోర్ట్స్ కాంప్లె క్స్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దే శాయ్ మాట్లాడుతూ చెత్త కలెక్షన్ పాయింట్ల వద్ద చెత్త పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరవ్యాప్తంగా ఎక్కడ చెత్త కనబడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## దేవస్థానం దుకాణాల వేలం పాటలు

**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంకు సంబంధించి ఇటీవలే నిర్మించిన కెవిఎస్ఆర్ కాంప్లెక్స్ లోని 8 దుకాణాలకు మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. స్థానిక మార్కెట్ రోడ్డులోని కాంప్లెక్స్ దుకాణాలు కోసం దేవస్థానం కార్య నిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షకులు రాజమౌళి సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. 1 నుండి 8 దుకాణాలను మూడు సంవత్సరాల కాల పరిమితికి అనగా 1 సెప్టెంబర్ 2025 నుండి 31 అగస్టు 2028 వరకు కిరాయి ఇచ్చుటకు వేలం పాటలు నిర్వహించారు.ఈ వేలంపాట ద్వారా దేవస్థానానికి నెలకు రూ.80,800 చొప్పున ఏడాదికి రూ.9,69,600 ఆదాయం సమకూరనుంది. ముందగా ప్రకటించిన టెండర్ ప్రకారం బహిరంగ వేలం పాట కం సీల్డు కొటేషన్ టెండర్ నిర్వహణలో భాగంగా వేలం పాటలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్. ధర్మకర్తలు స్తంభంకాడి గణేష్, రాపర్తి సాయికిరణ్,పోచయ్య,పవన్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.


# వేధింపులు భరించలేక హమాలీ ఆత్మహత్య



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో చోటు చేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కృష్ణానగర్ గ్రామానికి చెందిన తంగెళ్ల శ్రీనివాస్(44) అవసరాల నిమిత్తం గ్రామానికి చెందిన చింతపండు నాగరాజు అనే వ్యక్తి వద్ద నుంచి నాలుగు లక్షలు అప్పుగా తీసుకుని పలు దఫాలుగా పదిహేను లక్షలు చెల్లించినప్పటికీ నాగరాజు మరో ఇరవై ఏడు లక్షల అరవై వేలు కడితేనే బాకీ మొత్తం ముడుతుందని వకీల్ ద్వారా నోటీసులు పంపిస్తూ వేదింపులకు గురి చేశాడని, తనవద్ద డబ్బులు లేవని చెప్పగా తనపేరు గల భూమిని రిజిస్ట్రేషన్ చేయమని నాగరాజు మరో వ్యక్తి బట్టు రాజేందర్‌తో కలిసి మృతుడు శ్రీనివాస్‌ను తీవ్ర వేదింపులకు గురిచేశారు. వేదింపులు భరించలేక మృతుడు శ్రీనివాస్ తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి పది గంటలకు ఇంటి నుంచి ఫోన్ తీసుకుని బయటకు వచ్చి ఇంటి వెనుక గల మామిడి చెట్టుకు ప్లాస్టిక్ త్రాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కొడుకు తంగెళ్ల హర్షిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపారు.

# మూల మలుపులు..రోడ్డు పక్కనే బావులు..

- తక్షణమే హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ఆదేశం



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** వాహనదారులకు ప్రయాణం ప్రాణసంకటం.. ఒక వైపు మృత్యు మలుపులతో స్వాగతిస్తున్న రహదారులు.. మరోవైపు రోడ్డు పక్కనే రక్షణ గోడ లేని బావులు దర్శనమిస్తున్న తీరు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ పరిధిలో చోటుచేసుకుంది. డివిజన్ పరిధిలోని ప్రధాన రోడ్డుతో పాటు పలు గ్రామాలకు వెళ్ళే మార్గాల్లో ప్రమాదకర మూల మలుపులతో పాటు రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు,హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని ప్రజాపక్షం క్షేత్ర స్థాయి పరిశీలన చేయగా అధికారుల నిర్లక్ష్యవైఖరితో పలువురు మృత్యువాత పడిన ఘటనలు వెలుగుచూశాయి..నేటికి చికిత్సపొందుతున్న బాధితులు తమ గోడు వెల్లబోసుకున్న తీరు ఆవేదన కల్గిస్తుంది. ఈ విషయమై సోమవారం రోజున ప్రజాపక్షం దినపత్రిక స్టేట్ మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన 'మూల మలుపులు.. రోడ్డు పక్కన బావులు ..ప్రమాదాలకు నిలయాలు' అన్న శీర్షికన ప్రజాపక్షం అక్కన్నపేట ప్రతినిధి నారదాసు ఈశ్వర్ అందించిన ప్రత్యేక కథనంతో అధికార యంత్రాంగం స్పందించారు.సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్పందించిన హుస్నాబాద్ ఏసీపీ సొడారం సదానందం మాట్లాడుతూ .. డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూరు, చేర్యాల,కొమురవెళ్ళి పరిధిలో గల ప్రధాన రహదారులతో పాటు పలు గ్రామాలకు వెళ్ళే మార్గాల్లో ప్రమాదకర మూల మలుపులతో పాటు రోడ్డు పక్కన ఉన్న బావులను గుర్తించి వాటి వద్ద రక్షణ గోడలతో పాటు హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తమ పోలీసు యంత్రాంగాన్నీ ఆదేశించినట్లు తెలిపారు.ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.వాహనదారులు మూల మలుపులు, ప్రమాదకర బావుల వద్ద గమనించి నిర్దేశిత వేగంతో ప్రయాణించాలని కోరారు. డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ప్రధాన మూల మలుపులతో పాటు రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు,హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసేలా స్థానిక పోలీసు వారి సమన్వయంతో పంచాయతీ కార్యదర్శులు రక్షణ చర్యలు చేపట్టేలా మండల ఎంపిడివోలను ఆదేశించినట్లు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు వెల్లడించారు. ప్రజలు తమ గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే త్వరతగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# క్రీడ

## కెప్టెన్‌గా సూర్య, వైస్ కెప్టెన్‌గా గిల్

### ఆసియా కప్ జట్టును ప్రకటించిన బిసిసిఐ



ఆసియాకప్‌లో ఆడే భారత జట్టును బిసిసిఐ ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆ టోర్నీకి శుభమన్ గిల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. మంగళవారం ముంబైలో సమావేశం అయిన బిసిసిఐ సెలెక్టర్ల బృందం భారత జట్టును ప్రకటించింది. మొత్తం 15 మంది ప్లేయర్ల బృందాన్ని వెల్లడించారు. అయ్యర్, జైస్వాల్‌కు చోటు దక్కలేదు.

స్టాండ్ బై ప్లేయర్ల జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేదు. ఈ టోర్నీ కోసం అయిదుగురు రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించారు. ప్రసిద్ధ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్.. రిజర్వ్ లిస్టులో ఉన్నారు. అయితే ఆ జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేకపోవడం గమనార్హం.

సెప్టెంబర్ పదో తేదీన యుఏఈతో ఇండియా ఫస్ట్ మ్యాచ్ ఆడనున్నది. దుబాయ్ వేదికగానే సెప్టెంబర్ 14వ తేదీన పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్ జరగనున్నది. ఇక 19వ తేదీన ఒమన్‌తో చివరి రౌండ్ మ్యాచ్ ఆడనున్నది.

**భారత జట్టు..**

సూర్యకుమార్ యాదవ్, గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, బుమ్రా, హర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్, హర్షిత్ రాణా, రింకూ సింగ్.

## తెలుగమ్మాయికి వరల్డ్ కప్ ఛాన్స్..



### మంధానకు జోడీగా ప్రతీకా..!


ఏడాది తర్వాత టీ20ల్లో పునరాగమనం చేసి అదరగొట్టిన షఫాలీ వర్మకు మహిళల వన్డే ప్రపంచ కప్ స్క్వాడ్‌లో చోటు దక్కలేదు. ఇంగ్లాండ్ పర్యటనలో అద్భుతంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీచరణి తొలిసారి ప్రపంచ కప్ బెర్తు దక్కించుకుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ పోటీలకు మరో నలభై రోజులు ఉంది. టోర్నీ సన్నద్ధతను దృష్టిలో ఉంచుకొని మంగళవారం సెలెక్టర్లు 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. సొంతగడ్డపై జరుగుబోయే వరల్డ్ కప్‌లో టైటిల్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది భారత జట్టు. అందుకు తగ్గట్టుగా జట్టు కూర్పు ఉండాలని పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. కాబట్టి.. కొన్నిరోజులుగా వన్డేల్లో నిలకడగా రాణిస్తున్న వాళ్లనే స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ఇంగ్లండ గడ్డపై ఒక్క మ్యాచ్‌లో మెరిసి.. తాజాగా ఇండియా ఏ తరఫున విఫలైమన షఫాలీకి సెలెక్టర్లు షాకిచ్చారు. ఓపెనర్‌గా ఆమెను టీ20లకే పరిమితం చేస్తూ యువకెరటం ప్రతీకా రావల్‌కు తీసుకున్నారు. ఈమధ్యే మంధానకు జోడీగా దంచేసిన ప్రతీకా.. వరల్డ్ కప్‌లోనూ ఇన్నింగ్స్ ఆరంభించనుంది. వికెట్ కీపర్లుగా రీచా ఘోష్, యస్తికా భాటియాలు చోటు దక్కించుకోగా ఆల్‌రౌండర్లుగా దీప్తి శర్మ, రాధా యాదవ్, స్నేహ్ రానా, అమన్‌జోత్ కౌర్‌లు ఎంపికయ్యారు. బౌలింగ్ యూనిట్‌లో రేణుకా సింగ్, శ్రీచరణి, క్రాంతి గౌడ అరుంధతి రెడ్డిలు ఉన్నారు. సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే వరల్డ్ కప్ షురూ కానుంది.

**వరల్డ్ కప్ స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రానా, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్ అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్.

**స్టాండ్ బై :** తేజల్ హస్నబిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా ఛెత్రీ, మిన్ను మణి, సయాలీ సథ్గారే.

## సఫారీల బోణీ..

### ఛాంపియన్‌కు షాకిచ్చిన మహరాజ్..




పొట్టి సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌లో అదిరే బోణీ కొట్టింది. సమిష్టిగా రాణించి డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై రికార్డు విజయం సాధించింది. కైరన్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో ఆసీస్‌కు వణుకుపుట్టించింది బవుమా సేన. మొదట ఏడెన్ మర్క్‌రమ్ (82), కెప్టెన్ తెంబ బవుమా(65)లు అర్ధ శతకాలతో భారీస్కోర్ చేసిన ప్రొటీస్ టీమ్.. అనంతరం ఆసీస్ బ్యాటర్లకు కళ్లెం వేసింది. పేసర్లు ఆదిలోనే బ్రేకివ్వగా.. కేశవ్ మహరాజ్ (533) ప్రధాన ఆటగాళ్లను వరుసగా పెవిలియన్ చేర్చాడు. దాంతో.. సఫారీ టీమ్ ఏకంగా 98 పరుగుల తేడాతో ఓడించింది.

ఆస్ట్రేలియాను వాళ్ల సొంతగడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. సమిష్టిగా రాణిస్తే తప్ప గెలుపు గడప తొక్కలేం. ఇప్పుడు వైట్ బాల్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా అదే వ్యూహాన్ని అనుసరిస్తోంది. పొట్టి సిరీస్‌లో అద్భుతంగా ఆడిన విజేతగా నిలవని సఫారీ జట్టు వన్డే ట్రోఫీలో బోణీ కొట్టింది. మైదానంలో ఎడెన్ మర్క్‌రమ్(82), తెంబా బవుమా(65), బ్రీట్జ్(57)లు అర్ధ శతకాలతో చెలరేగి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. అనంతరం ఛేదనలో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ తడబడుతూ సాగింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (27), మిచెల్ మార్ష్ (88)లు అరవై రన్స్ జోడించి శుభారంభం ఇచ్చారు. వీళ్లిద్దరి మెరుపులతో ఆసీస్ ఈజీగా గెలుస్తుందనిపించింది.

కానీ, సుబ్రయణ్ తొలి దెబ్బ కొట్టగా.. ఆ తర్వాత కేశవ్ మహరాజ్(533) వికెట్ల వేటతో కంగారూలను వణికించాడు. మార్నస్ లబూషేన్(1), కామెరూన్ గ్రీన్(3), డేంజరస్ జోష్ ఇంగ్లిస్(5).. అలెక్స్ క్యారీ(0)లను డగౌట్ చేర్చి మ్యాచ్‌ను సఫారీల వైపు తిప్పాడు. ఆఖర్లో బెన్ ద్వారుషి (33), నాథన్ ఎల్లిస్(14)లు కాసేపు పోరాడినా ఎంగిడి లోయర్ ఆర్డర్ కథ ముగించాడు. ఆడం జంపాను బౌల్డ్ చేయగా బవుమా బ్యాచ్ 98 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఐదు వికెట్లు తీసి ఆసీస్ నడ్డివిరిచిన మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆగస్టు 22 శుక్రవారం రెండో వన్డే జరుగనుంది.


# ఫోకస్ మహిళ

## సింగిల్ వర్కింగ్ ఉమెన్స్ పట్ల పౌర సమాజం చిన్నచూపు!



సింగిల్ వర్కింగ్ వుమెన్స్ చేస్తున్న కృషి, నమోదు చేసుకుంటున్న విజయాలు, బలాలు, ఎపిక్, సృజన, ధైర్యం, ఆత్మవిశ్వాసం లాంటివి గుర్తించకుండా లింగ వివక్ష చీరడం సోచనీయం..

వృత్తిలో నిబద్ధత, కుటుంబ భారం మోయడం, వ్యక్తిగత జీవితాన్ని గడపడంలో సమతుల్యతను చూపడం ఒక ప్రశంసనీయ అనుభవం..



మహిళలు అంటేనే మగ మహారాజులకు చులకన. పురుషాధిక్య సమాజంలో మహిళ నేటికీ ద్వితీయ శ్రేణి పౌరురాలే. బాలికలు, యువతులు, మహిళల పట్ల మృగాళ్ల చూపులు నేటికీ ముళ్ల వలె గుచ్చుకుంటున్నాయి. లైంగిక హింసలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ ఉద్యోగ ఉపాధులు, పలు రకాల పనులు చేసుకుంటున్న మహిళలకు భద్రత కరువు అవుతున్నది. పని ప్రదేశంలో వివక్ష కోరలు విప్పుతున్నారు. కాలక్రమంలో క్రమంగా సమాజ దృక్కోణం మారుతోంది. నేటి విద్యాధికులైన మహిళలకు కొంత ఆదరణ పెరుగుతోంది. నేటి డిజిటల్ యుగంలో వర్కింగ్ వూమెన్స్ లేదా పని చేస్తున్న మహిళలు పలు రకాల సమస్యలకు లోనవుతున్నారని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తమ తమ ఉద్యోగ ఉపాధుల్లో ఉన్న సింగిల్ వర్కింగ్ మహిళల వేదనలు వర్ణనాతీతం. పురుషులు లేదా వివాహిత మహిళలతో ధీటుగా లేదా మెరుగైన సేవలు చేస్తున్న ఒంటరి మహిళల సమస్యలు మరింత జటిలంగా ఉన్నాయి.

వివాహం కాని లేదా చేసుకోని మహిళలు, వితంతువులు పనుల చేసుకుంటున్న వారిని సింగిల్ వర్కింగ్ వుమెన్స్ లేదా పనులు చేసుకుంటున్న ఒంటరి మహిళలు అని పిలుస్తున్నాం. పలు వర్కింగ్ నూనెని తమ కుటుంబ భారాలను వృత్తిలో సహితం రాణిస్తున్నారు. ఇలాంటి సింగిల్ వర్కింగ్ వూమెన్స్ పట్ల సమాజం పలు అపోహలను కలిగి వారిని కించపరచడం జరుగుతోంది.

సింగిల్ వర్కింగ్ వుమెన్స్ చేస్తున్న కృషి, నమోదు చేసుకుంటున్న విజయాలు, బలాలు, ఎపిక్, సృజన, ధైర్యం, ఆత్మవిశ్వాసం లాంటివి గుర్తించకుండా లింగ వివక్ష చీరడం సోచనీయం. వృత్తిలో నిబద్ధత, కుటుంబ భారం మోయడం, వ్యక్తిగత జీవితాన్ని గడపడంలో సమతుల్యతను చూపడం ఒక ప్రశంసనీయ అనుభవం.

సింగిల్ వర్కింగ్ వుమెన్స్ సమస్యలు భారతంలో అధికంగానే ఉన్నాయి. సామాజిక దురభిప్రాయాలు, భద్రత చిక్కులు, వృత్తితో పాటు కుటుంబ వ్యక్తిగత పనుల మధ్య సమతుల్యత లోపించడం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, చిన్నచూపు చూడడం, అతి తక్కువ వేతనాలు ఇవ్వడం, వివాహం కాలేదని ఎగతాళిగా చూడటం, ఆర్థిక అభద్రత, విజేతలైన సింగిల్ వర్కింగ్ వుమెన్స్‌కు తగిన గుర్తింపు ఇవ్వకపోవడం, సమాజ నిరాదరణకు గురవడం, పనిలో పదోన్నతులు కల్పించకపోవడం లాంటి పలు సమాళ్లను నేటి భారత ఒంటరి మహిళలు ఎదుర్కొంటున్నారు. ఈ విధమైన వివక్షలను ఎదుర్కొంటున్న సింగిల్ వర్కింగ్ వుమెన్స్ మానసిక ఒత్తిడి, ఆందోళన లాంటి అనారోగ్యాలకు దగ్గర అవుతున్నారు.

వ్యక్తిగత విషయాలు, కుటుంబ సభ్యుల సమస్యలు, వృత్తిలో వేధింపులు లాంటివి పెరగడంతో సింగిల్ వర్కింగ్ వుమెన్స్ బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. ఇలాంటి సింగిల్ వర్కింగ్ వుమెన్స్ పట్ల పౌర సమాజం తగిన విధంగా ఆదరించడం, వారి సేవలను కొనియాడడం, వారికి అవసర చేయూతను ఇవ్వడం జరగాలి. సింగిల్ వర్కింగ్ వుమెన్స్ పిల్లలకు తగిన అవకాశాలు కల్పించడం కొనసాగాలి. సింగిల్ వర్కింగ్ వుమెన్స్ పట్ల మానవ దృక్కోణం మారాలి, వారికి అండగా పౌర సమాజం నిలవాలి.

## చిరస్మరణీయ న్యూస్ రీడర్లు



మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి

వార్తా పత్రికలను కొద్ది మంది మాత్రమే తెప్పించుకునే 1969, 1970 దశకాల్లో, రేడియో ఒక్కటే ప్రధాన మాధ్యమంగా ఉండేది. ఢిల్లీ నుంచి ఆకాశవాణి వార్తలు ప్రసారమయ్యేవి. రోజూ ఉదయం 7.05 గంటలకు వచ్చే తెలుగు వార్తల కోసం లక్షలాది మంది రేడియోల ముందు కూర్చొని ఎదురుచూసే వాళ్లనడంలో అతిశయోక్తి లేదు. కందుకూరి సూర్యనారాయణ, అద్దంకి మన్నార్, ఏడిన గోపాలరావు వంటి ఎంతో మంది వార్తలకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టారు. వారితో పోటీపడుతూ, మహిళలు కూడా వార్తలు చదవడంలో రాణించగలరని నిరూపించిన వాళ్లలో మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, జోలెపాళెం మంగమ్మ తర్వాతే ఇతరుల పేర్లను ప్రస్తావించుకోవాలి. అంతటి ముద్ర వేసిన ఈ న్యూస్‌రీడర్లను గుర్తుచేసుకోవడం ఓ ఆటవిడుపు.



జోలెపాళెం మంగమ్మ

## సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ప్రతి యేటా సీజనల్ వ్యాధుల బారీనపడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఇప్పటికే కొణిజర్ల మండలంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. వ్యాధులు ప్రబలుతున్న గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో తగినన్ని మందులు సరఫరా చేయడంతో పాటు సిబ్బందిని నియమించాలని అవసరమైతే అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం కావాలని సురేష్ కోరారు. పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి సహా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆసుపత్రి భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని కాంట్రాక్టర్ అప్పగించినా ప్రారంభించడం లేదని శిథిల భవనాల్లో వైద్య సేవలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. తక్షణం భవనాలను ప్రారంభించాలని ఆయన కోరారు. ఎడ తెగని వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా మెట్ట పంటలు దెబ్బతిన్నాయని నదులు, వాగులు, ఏర్ల పరివాహక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగాయని నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలను రక్షించుకునేందుకు ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు అందజేయాలని ఆయన కోరారు.

## మధ్య, చిన్నతరహా పరిశ్రమలను ఆదుకోవాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని వివిధ పార్టీల నేతలు, గ్రానైట్ పరిశ్రమ యజమానుల సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఉపాధి కల్పించే మధ్య, చిన్నతరహా పరిశ్రమలను ఆదుకోవాలని, పెంచిన రాయల్టిని, పర్మిట్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబ్ల్ సమావేశం స్థానిక హరిత గార్డెన్స్‌లో గ్రానైట్ అసోసియేషన్ బాధ్యులు తమ్మినేని కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పలువురు మాట్లాడుతూ 12 ఏళ్లుగా రావాల్సిన రూ. 20 కోట్ల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన 40 శాతం సబ్సిడీని పునరుద్ధరించాలని, గ్రానైట్ ఉత్పత్తులపై ప్రస్తుతం 18 శాతం జిఎస్టి ఉందని దానిని ఐదు శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐదు హెక్టార్ల లోపు క్వారీలకు షరతులు లేకుండా పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. గ్రానైట్ సంక్షోభం లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి సమస్యగా చూడాలని కోరారు. మధ్య, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించక పోతే దేశమే ప్రమాదంలో పడుతుందని గ్రానైట్ సంక్షోభాన్ని దీర్ఘకాలిక దృష్టితో చూడాలన్నారు. గ్రానైట్ పరిశ్రమను ఆదాయ మార్గంగా కాకుండా ఉపాధిగా చూడాలని పలువురు సూచించరు.సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్, సిపిఎం జిల్లా నాయకులు శింగు నర్సింహారావు, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

### ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/పాల్వంచ:** రాష్ట్రానికి 9.80 లక్షల యూరియా కేటాయిస్తే ఇప్పటి వరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చిందని యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఏఐకేఎస్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ఆరోపించారు. స్థానిక చండ్రా రాజేశ్వరరావు భవన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సంధర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు ఆరుగురు ఎంపిలు ఉండి కూడా రాష్ట్ర రైతులకు ఒనగూరింది ఏమీలేదన్నారు. రైతులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నా ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. మతం, కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం తప్ప కేంద్ర మంత్రులు, ఎంపిలు ఏమి సాధించలేరన్నారు.కేంద్ర మంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు దమ్ముంటే రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం రాష్ట్రానికి రావలసిన యూరియా కోసం ప్రధానమంత్రిని నిలదీయాలని, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. కానీ రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం పట్టని ఎనమిది మంది బిజేపి ఎంపీలు నోరుమూసుకొని ఉన్నారని దుయ్యబట్టారు. రైతుల సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం ఉందని గొప్పలు చెప్పుకునే మోడీ ప్రభుత్వం తాము పాలిస్తున్న రాష్ట్రాలకు ఒక విధానం, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై మరో విధానాన్ని అవలంభిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మరంగా వర్షాలు పడుతున్నాయని దీనితో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్షకు తావులేకుండా తక్షణమే రాష్ట్రానికి రావాల్సిన యూరియాను సరఫరా చేయాలన్నారు. లేని యెడల రైతలను సమీక్షించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, రైతు సంఘం నాయకులు బివి. సత్య నారాయణ, రాము, జకరయ్య, రామాచారి, శ్రీను, వెంకటేశ్వర్లు, కొంగర అప్పారావు, బానోత్ రంజిత్, సర్వయ్య, అల్లి వెంకటేశ్వర్లు, క్రిష్ణ, సత్యనారాయణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సిపిఐది నిరంతర పోరాటం

### కర్నాటి బానుప్రసాద్





**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రజా సమస్యలు పై నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెరువుమాధరం గ్రామానికి చెందిన కట్టే బోయిన కాశయ్య నివాసం వద్ద పాలకూర్తి తిరపతిరావు అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బానుప్రసాద్, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వారరావు వివిధ పార్టీలకు చెందిన 15మందిని పార్టీ కండువా కప్పి సిపిఐ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడారు. రత కమ్యూనిస్ట్ పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. వందేళ్లు చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లు, లిస్ట్ లతో సంబంధం లేకుండా అధికారులు నిజామైనా అర్హులకు ఇవ్వాలని అన్నారు. అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తూనే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తామని తెలిపారు. మండలం సహాయ కార్యదర్శి మాలోతు ఆయోధ్య, సిపిఐ సీనియర్ నాయకులు భాగంనరసింహారావు,కార్యవర్గసభ్యులు రాయల మాధవ్ రావు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

## పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలి

### నాగర్‌కర్నూలు జిల్లా ఆశవర్కర్ల ప్రధానకార్యదర్శి చెన్నమ్మ



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న ఆశవర్కర్లకు పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు వెంటనే చెల్లించాలని ఆశవర్కర్లకు 18వేల వేతనం చెల్లించాలని తెలంగాణ ఆశవర్కర్స్‌యూనియన్‌రాష్ట్రకమిటి పిలుపుమేరకు మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్‌కు జిల్లా ఆశవర్కర్ల ప్రధానకార్యదర్శి చెన్నమ్మ వినతిపత్రం అందజేశారు. అనంతరం ధర్నా నిర్వహించి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రవ్యాప్తంగా జూలై నెలలో ఇవ్వాల్సిన పారితోషికాలు ఇవ్వకుండా ఆశవర్కర్లతో పని చేయించుకుంటున్నారని పారితోషికం అడిగితే డబ్బులు లేవని కుంటిసాకులు చెబుతున్నారని అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాకముందు అధికారంలోకి వస్తే ప్రతినెల వేతనాలు చెల్లిస్తామని ఆశవర్కర్లకు ఉద్యోగభద్రత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19నెలలు అవుతున్న నేటివరకు ఆశవర్కర్ల సమస్యలపై అసెంబ్లీ, శాసనమండలిలో ఎక్కడ చర్చించిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు వెంటనే చెల్లించాలని, ఫిక్స్‌డ్‌వేతనం 18వేలు చెల్లించాలన్నారు. పైసమస్యల పరిష్కారంకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమంలోభాగంగా ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి ఆశవర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణవేణి, అలివేల, భాగ్యమ్మ, వెంకటమ్మ, సుకన్య లక్ష్మి, మానస, పద్మ పాల్గొన్నారు.

## స్మశాన వాటిక స్థలంపై ఫలించిన సిపిఐ పోరాటం

### నిజాం చెరువు స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించిన కమిషనర్, డిఇ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** నిజాం చెరువు వద్ద ఉన్న స్మశాన వాటిక స్థలంలో పక్కా నిర్మాణం చేపట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులువెలుగు శ్రావణ్ కుమార్ అధ్యక్షతన ఇటీవలే మున్సిపల్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. అందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని నాడు చెప్పారు. ఇచ్చిన మాట మేరకు నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుకు సంబంధించిన , భూ సేకరణ, పంచనామా వివరాలు కమిషనర్, డిఇకి అందించారు. వాటిని పరిశీలించిన అధికారులు సమస్యను పూర్తిగా అర్థం చేసుకొని వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేశపల్లి నవీన్ మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బురదమయంగా ఉన్న రోడ్డులో సైతం వచ్చి ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేసిన కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేదాస్ రమేష్, జలగం ప్రవీణ్ కుమార్, గుడి బోయిన వెంకటేశ్వర్లు, పుచ్చ బాలకృష్ణ,ఆబోతు అశోక్ కుమార్, జూలకంటి వేణు, తదితరులు పాల్గొన్నారు.




# స్థానికం REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సిఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం రద్దు



**ప్రజాపక్షం/చండ్రుగొండ:** ఈనెల 21న మండల పరిధిలోని బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ భారీ బహిరంగ సభకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రావాల్సి ఉండగా పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వ విజయబాబు అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపరాష్ట్రపతి నామినేషన్ కారణంగా పర్యటన వాయి దా వేయడం జరిగిందన్నారు. త్వరలో పర్యటన వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని, తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు, భోజ్యా నాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, ఫజల్ బక్ష, బొర్రా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపాలకు అనుమతులు తప్పనిసరి : డిఎస్‌పి చంద్రభాను



**ప్రజాపక్షం/ఇల్లందు:** వినాయక చవితి సందర్భంగా ఇల్లందు పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇల్లందు డిఎస్పి చంద్రబాను అన్నారు. మంగళవారం ఇల్లందు పోలీస్ స్టేషన్లో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు పెట్టేవారు పోలీస్ స్టేషన్లో కచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజె లు పెట్టకూడదని సూచించారు. రాత్రి వేళ్లలో గుంపులుగా ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. విద్యుత్ వైర్ల కింద మండపాలు విగ్రహాలను పెట్టకూడదన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై హసీనా, సూర్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పువ్వాడ జయశ్రీకి పితృవియోగం

### బొందలపాటి కృష్ణయ్య మృతి, పలువురి నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మమత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తండ్రి బొందలపాటి కృష్ణయ్య (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత కొంత కాలంగా కృష్ణయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కృష్ణయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కృష్ణయ్య మృతివార్త తెలిసిన వెంటనే పలువురు ఖమ్మంలోని ఆయన స్వగృహంకు చేరుకుని నివాళులర్పించారు. మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పగడాల నాగరాజు, బిఆర్ఎస్ పక్ష నాయకులు కర్నాటి కృష్ణ, మమత డైరెక్టర్ పువ్వాడ నరేన్, ప్రముఖ వైద్యులు వైవి రావు, బాగం కిషన్‌రావు, శ్రీకాంత్, బండారుపల్లి నవీన్, పొన్నం వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖ వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల శ్రీనివాసరావు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు భాగం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని రేలగాయలపల్లి, చీమలపాడు, బాజీ మల్లయ్య, గూడెం పాటిమీద గుంపు గ్రామాల్లో నష్టపోయిన పంటలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, ఇప్పటికే పెట్టుబడుల రూపంలో రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించారని ఈ అకాల నష్టంతో రైతు కోలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు నష్టపోయిన పంట పొలాలను సందర్శించి నష్టపరిహారం అంచనా వేయాలని కోరారు.

## ఆసుపత్రుల విభజన ప్రక్రియ పూర్తి




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రాథమికోన్నత ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కల్లూరు ఆసుపత్రులు విభజన ప్రక్రియ మంగళవారం పూర్తయింది. ఈ మేరకు మందులు, ఫర్నిచర్లతో పాటు తదుపరి సామాగ్రి పంపిణీ ప్రక్రియ పూర్తయింది. కల్లూరు ప్రాథమికోన్నత ఆసుపత్రి, ఖాన్ ఖాన్ పేట లోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న పల్లెదవ ఖానా కు మార్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు వైద్యులు నవ్య కాంత్ తెలిపారు. జిల్లాలోని తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, వైరా, కల్లూరులలో ప్రాథమికోన్నత ఆరోగ్య కేంద్రం ప్రాంతీయ వైద్యశాలలో ఉన్న వైద్య సిబ్బంది విడివిడిగా సేవలందించాలని ఆదేశాలతో ఈ ప్రక్రియ పూర్తయినట్లు వైద్యులు తెలిపారు.

## పంటల ఉత్పత్తులపై మద్దతు ధర పెంపు : అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత ప్రభుత్వం ఖరీఫ్ 2025–26 సీజన్‌కు పంట ఉత్పత్తులపై కనీస మద్దతు ధర పెంచడం జరిగిందని, నిర్దేశించిన మద్దతు ధరకు రైతులు తమ పంటను విక్రయించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. క్వింటాకు వరి కామన్ గ్రేడ్ రూ. 2369, గ్రేడ్ ఎ రూ. 2389, జొన్నలు హైబ్రిడ్ రూ. 3699, మాల్దండి రూ.3749, సజ్జలు రూ. 2775, రాగులు రూ.4886, మొక్కజొన్న రూ. 2400, కందులు రూ.8000, పెసర్లు రూ. 8768, మినుములు రూ. 7800, పల్లికాయ రూ. 7263, పొద్దుతిరుగుడు గింజలు రూ. 7721, సోయాబీన్ ఎల్లో రూ.5328, నువ్వులు రూ. 9486, నైజర్ సీడ్ రూ. 9537, పత్తి పొడగాటి మధ్య రకం రూ. 8110, మధ్యరకం రూ. 7710, మద్దతు ధరగా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. మద్దతు ధర అంశాన్ని గమనించి ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని తెలిపారు.

# పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు తప్పనిసరి

### అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఇందిరా మహిళా డెయిరీ గ్రౌం డింగ్‌పై సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ గ్రౌండింగ్‌లో భాగంగా ఒక్కో లబ్ధిదారుకు రెండు పాడి పశువుల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుందని, పాడి పశువుల కొనుగోలు కోసం కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాడి పశువుల కొనుగోలు, రవాణా, బీమా సౌకర్యం కల్పన తదితర అంశాలలో పాటించాల్సిన విధానాలపై చర్చించి పలు సూచనలు చేశారు. పాడి పశువుల పంపిణీతో పాటు అవసరం, అవకాశం ఉన్న చోట ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించుకుంటూ పశువుల షెడ్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మన జిల్లాలో ఉన్న వాతావరణంకు అలవాటు పడే పశువులను కొనుగోలు చేయాలని, పాడి పశువులు కొనుగోలులో నిర్దేశిత నిబంధనలను అధికారులు తూచ తప్పకుండా పాటించాలన్నారు. రవాణా కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల వారీగా లబ్ధిదారుల కేటాయింపు, జాయింట్ ఖాతా ప్రారంభం నిర్దేశిత లక్ష్యం ప్రకారం పూర్తి కావాలన్నారు. పశువుల కొనుగోలు పూర్తయిన తర్వాత బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపులు చేయాలన్నారు. ప్రతి మండలంలో లబ్ధిదారులకు ఎక్కడి నుంచి పాడి పశువులు కొనుగోలు చేయాలనే అంశంపై ఫైనల్ చేయాలన్నారు. పాడి పశువుల కొనుగోలు రెండు నుంచి మూడు రోజులు పట్టే అవకాశం ఉన్నందున అక్కడ వసతి సౌకర్యాలను ముందస్తుగానే ప్లాన్ చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి పాడి పశువుకు జియోట్యాగ్ వేయాలన్నారు. ఎటువంటి అక్రమాలకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి పాడి పశువు ఆరోగ్య స్థితిగతులను వెటర్నరీ వైద్యుడు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఎస్సి, గిరిజన సంక్షేమ శాఖాధికారులు , ఎంపిడివోలు, బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు కట్టుదిట్టంగా చేయాలి

**ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు కట్టుదిట్టంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు నమోదుపై విద్యాశాఖాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలల వారీగా పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలన్నారు. భవిత కేంద్రాల మరమ్మతు, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకుని ఫాలోఅప్ చేస్తూ విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేవిధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులకు సెలవు మంజూరు అంశంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. టీచర్లు విద్యార్థుల హాజరు అంశం అత్యంత ప్రాధాన్యతగా పరిగణించడం జరుగుతుందన్నారు. ప్రతి వారం తక్కువ ఎఫ్ఆర్ఎస్ ఉన్న ఐదు మండలాల కాంప్లెక్స్ పరిధిలో ఎఫ్ఆర్ఎస్ అమలు, పాఠశాల నిర్వహణ పట్ల సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. యుడిఐఎస్‌ఈ పోర్టల్‌లో పాఠశాలకు సంబంధించిన వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, హెడ్ మాస్టర్లతో సమన్వయం చేసుకుంటూ వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆగస్టు చివరి నాటికి అపార్ నెంబర్ జనరేట్ చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి నాగపద్మజ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీత దుగ్గినేని మృతి

### పెన్షనర్స్ ఎస్టియు సంఘాల నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్రపతి డా॥ శంకర్‌దయాళ్‌శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రముఖ ఉపాధ్యాయ నేత దుగ్గినేని సత్యనారాయణరావు (94) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు.ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మధిర మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన దుగ్గినేని 1955లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. మధిర ఉన్నత పాఠశాలలోనూ, ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలోనూ పని చేశారు. ఖమ్మం జిల్లాలోని పలు పాఠశాలల్లో పని చేసిన దుగ్గినేని ఎందరినో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది తల్లిదండ్రుల ప్రశంసలు పొందారు. ఉపాధ్యాయ ఉద్యమంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన దుగ్గినేని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా, రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 56 రోజుల పాటు జరిగిన సమ్మెకు దుగ్గినేని నేతృత్వం వహించారు. చివరకు డిఏ పెంపును సాధించారు. ఖమ్మం జిల్లాలో ఎస్టియు బలోపేతానికి కృషి చేయడంతో పాటు సంఘ కార్యాలయాన్ని నిర్మించడంలో కీలక భూమిక పోషించారు. 1984లో 29 ఏళ్ల పాటు పనిచేసిన అనంతరం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత శాసన మండలికి పోటీ చేసి ఓటమి చెందారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన దుగ్గినేని అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పాటు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన శీలం సిద్ధారెడ్డి, జలగం వెంగళరావు లతో సన్నిహితంగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. దుగ్గినేని చేకూరి కాశయ్యతో కలిసి గురుదక్షిణ ఫౌండేషన్ స్థాపనకు కృషి చేశారు. దుగ్గినేని మృతి పట్ల పలువురు సంతాపాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఎస్టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డా వరప్రసాదరావు, ఎస్‌కె కరీం, గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షులు శంకరయ్య, సెక్రటరీ చావా శ్రీనివాసరావు, విశ్రాంత మండల విద్యాధికారి దుగ్గినేని శ్రీనివాసరావు తదితరులు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థపై దృష్టి సారించాలి

### ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ప్రజాపక్షం/ఇల్లందు:** అల్పపీడనప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ పై దృష్టిసారించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్ష ప్రభావం వలన గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రోడ్లను, బీటీ రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయని చిన్నపిల్లలను అటువైపు వెళ్ళకుండా చూడాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి నిర్విరామంగా కొనసాగాలని ప్రజలని ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వ డాక్టర్లు నర్సులు ఏఎన్ఎంలు అందరూ అందుబాటులో ఉండాలని ప్రజలను చైతన్య పరచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడ మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలలో, పురాతన కాలపు ఇళ్లలో నివసించే వారికి గుర్తించాలని, దోమల బెడద కలిగే అవకాశం ఉన్నందున నిల్వ నీరు లేకుండా చూడాలని బ్లీచింగ్ దోమల, స్ప్రేయింగ్ జరిపించాలని కోరారు. మండలంలో ఉన్న ప్రభుత్వ హాస్టల్లో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు సక్రమంగా మెనూ అందించాలని, తప్పు జరిగితే ఉపేక్షించే అవకాశం ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ రాంబాబు, ఎంపీడీవో ధన్ సింగ్, డీఎస్పీ చంద్రబాను, అగ్రికల్చర్ ఏవో సతీష్, కొమరారం పి హెచ్ సి డాక్టర్ లోహిత, ఆర్ఐ కామేశ్వరరావు, ఏ ఈ బాలాజీ, హర్షిని, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

### రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తుపాన్‌కు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తెలిపారు. ఎడతెగని వర్షాల కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఎకరాకు రూ. 50వేల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారని వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెట్ట పంటలు తీవ్రంగా నష్టపోయాయని ముఖ్యంగా పెసర, మినుము, ఇతర అపరాల పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని దొండపాటి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందని పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందుతుందని ఆయన తెలిపారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణం పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు స్వర్ణ రమేష్, తండు సోమయ్య, సీతారాములు, కొమ్మినేని వెంకయ్య, తుప్పర్తి వెంకటేశ్వర్లు, వెంకట్రాది, వజీర్, బండారు కిషన్ తదితరులు ఉన్నారు.

## ఎరువుల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

### పిఏసిఎస్ డైరెక్టర్, టిడిపి కన్వీనర్ బొంతు శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు కావస్తున్న నేటికీ రైతులకు సరిపడా ఎరువులు అందించుటలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పిఏసిఎస్ డైరెక్టర్, టిడిపి పార్టీ కన్వీనర్ బొంతు శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరి యా కొరతతో కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ లైన్లలో పడిగాపులు కాస్తున్నారన్నారు. గంటల తరబడి నిలబడలేక చెప్పులు, సెల్ ఫోన్లు, ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్ లు క్యూ లైన్ లోపెట్టి వేచి చూడవలసిన పరిస్థితి ఏర్పండిందని దీనికి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమన్నారు. ఒక్కొక్క కొనుగోలు కేంద్రం వద్ద ఆరు వందల మందికి పైగా రైతులు గంటల తరబడి పడిగాపులు కాసినా పట్టు మనీ 200 బస్తాలు కూడా దొరకటం లేదన్నారు. ఆ అరకొర బస్తాల కోసం ఒక్కసారిగా రైతులు గుమ్మి గూడటంతో తొక్కి సలాటలు జరిగి అన్నదాతలు అస్వస్థకు గురై, దవాఖానాల పాలవుతున్నారని మండిపడ్డారు. వారం పది రోజులకు ఒక్కో రైతుకు కేవలం ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తామని అధికారులు చెప్తున్నారని,ఆచరణలో మాత్రం ఒక్కొక్క రైతుకు ఒక బస్తా యూరియా కూడా ఇవ్వటంలేదన్నారు. ప్రభుత్వం తమ అసమర్థతను దళారులపై నెట్టివేస్తూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని, ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్న రైతుల అవసరాల మేరకు సరిపడా యూరియా ముందు చూపుతో నిలువ చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రైతులకు సరిపడా ఎరువులు అందక పోవటంతో రైతన్నల దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులకు సరిపడా ఎరువులు అందించాలని, జోనల్ వైజ్‌గా పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయ కళాశాల క్షేత్రంలో సంకరజాతి, నూతన వంగడాలు ఉత్పత్తి చేయాలని, నకిలీ పురుగు మందులు, విత్తనాలు అరికట్టి దళారీ వ్యవస్థను నిలువరించాలనీ, సకాలంలో రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేసి అన్నదాతను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆరోగ్య సేవలో గ్రామీణ వైద్యుల పాత్ర అపూర్వం

### తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని, బోయినపల్లి

**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించడంలో గ్రామీణ వైద్యుల పాత్ర మరువలేనిదని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాసరావులు అన్నారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో శిక్షణ సమావేశాన్ని యంగల గౌతమ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామీణ వైద్యులకు వైజ్ఞానిక శిక్షణ ఇచ్చి అధికారిక సర్టిఫికెట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు ప్రాథమిక స్థాయిలో వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులైన ఆర్ఎంపిలు, పిఎంపిల సేవలను మెరుగుపర్చాలన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన 429జివోను అమలు చేసి ఆర్ఎంపిలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేసి ప్రజలందరికీ వైద్యం అందే విధంగా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందన్నారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం చేస్తున్న ఆర్ఎంపిలపై కేసులు బనాయించడం, అరెస్టు చేయడం అనేది ఈ సమస్యకు పరిష్కారం కాదన్నారు. వైద్య వృత్తికి దూరంగా ఉండకుండా ప్రాథమిక చికిత్స అందిస్తూ జాగ్రత్తలు పాటించాలని, సంఘ సభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు షేక్ హసన్, జెడిమూర్తి, షేక్ ఖాసీం, మండల కార్యదర్శి బాలు, నాయకులు కర్ణమ్, శ్రీరాములు, ముజీ, శ్రీహరి, అక్కినపల్లి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## డిజె శబ్దాల నిషేధం

### ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు



**ప్రజాపక్షం/వైరా:** పజలకు ఇబ్బంది కలిగించే శబ్దాలు నిషేధించడం జరిగిందని ఎవరైనా నిబంధనలను అతిక్రమించి డిజెలు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని వైరా సిఐ నునావత్ సాగర్ అన్నారు. మంగళవారం వైరా పోలీస్‌స్టేషన్‌లో సిఐ సగర్, ఎస్సై పుప్పాల రామారావుతో కలిసి డిజె నిర్వాహకులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపతి నవరాత్రులు జరుగుతున్న నేపద్యంలో దృష్టిలో కౌన్సిలింగ్ నిర్వహించారు. శుభకార్యాలతో మతపరమైన ఊరేగింపుల్లో మైకులు మినహా శబ్ద కాలుష్య వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. నిబంధనలు ఎవరు అతిక్రమించవద్దని అన్నారు.

## పెసర, అపరాల పంటలకు భారీ నష్టం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెట్ట పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పత్తి, అపరాలు ఇతర పునాస పంటలను వర్షాలు దెబ్బతీశాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చేతికందిన పెసర పంట పూర్తిగా దెబ్బ తిన్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. పూత కాత దశలో వర్షాలు రావడంతో పెసర దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంట పత్తి. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు పత్తి పంట వేశారు. తర్వాత వచ్చిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి అంతగా ఎదగ లేదు. ఆ తర్వాత ఇప్పుడు ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పత్తి చేలలో నీరు నిలిచాయి. వాగులు, నదులు, మున్నేరు, వైరా నది, కట్టలేరు తదితర నదుల పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. గతేడాది సెప్టెంబర్‌లో కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు ఇప్పటికీ కోలుకోలేదు. కొన్ని భూములు వ్యవసాయ యోగ్యానికి కూడా పనికి రాకుండా పోయాయి. మళ్లీ ఈ ఏడాది కూడా కొద్ది రోజులు వర్షాభావ పరిస్థితి ఇప్పుడు జోరు వర్షాల కారణంగా రైతులు దెబ్బతిన్నారు. పంట నష్టాలను అంచనా వేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కెజిబివి పాఠశాల తనిఖీ

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**మండలకేంద్రం లోనికెజిబివిపాఠశాలను మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా పాఠశాల హజరు పట్టికను పరిశీలించారు అనంతరం పాఠశాల పరిసరాలు,స్టోర్ రూంతో పాటు టాయిలెట్స్,వాష్ రూం లను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం తనిఖీలు నిర్వహిస్తున్నామని,వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.శుభ్రత,నాణ్యతలో ఎలాంటి అజాగ్రత వహించినా చర్యలు తప్పవని అన్నారు.చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.ఈ క్యాక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు,విద్యార్థులు పాల్గొన్నారు.



## గవర్నర్ చేతుల మీదుగా పిహెచ్‌డి పట్టా అందుకున్న వేముల రమేష్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఉస్మానియా యూనివర్సిటీ 84 వ స్నాతకోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ లో పీహెచ్డీ పూర్తి చేసిన వేముల రమేష్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చేతుల మీదుగా పిహెచ్డి పట్టా అందుకున్నారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఉస్మానియా యూనివర్సిటీ 84 వ స్నాతకోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పిహెచ్డి పూర్తి చేసిన వేముల రమేష్ కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్.వి.నారాయణన్ లు పిహెచ్డి పట్టా అందించారు. అనంతరం వేముల రమేష్ మాట్లాడుతూ తను ఈ పట్టా అందుకునేందుకు సహకరించిన గైడ్ డాక్టర్ జీ. శ్రీనివాస్ రావు, తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులకు,మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పరిస్థితులు పర్యవేక్షించాలి: రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/కాటారం ;**వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉం డా లని అధికారులు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.మంగళవారం మహాముత్తారం మండలంలోని ముత్తారం,యామన్‌పల్లి,కేశవాపూర్,పెగడపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పెద్ద వాగు ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,సంబందిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పొంగుతున్న వాగులపై ప్రయాణాలు,చేయకుండా ట్రాక్టర్లతో బారికేటింగ్ ఏర్పాటుతో పాటు రెవెన్యూ,పోలీస్,పంచాయితీ శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు యంత్రాంగం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగుల్లో చేపలు పట్టేందుకు వెళ్లవద్దని సూచించారు.ఆజం నగర్ మీదుగా ప్రజలు రవాణా సాగిస్తున్నారని ఎలాం టి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపిడిఒ శ్రీనివాస రావు,ఆర్అండ్‌బి ఇఇ రవిందర్,పిఆర్‌డిఇ రవిందర్,ఎంఇఒ రవిందర్ రెడ్డి,వ్యవసాయ శాఖ ఎఒ అనూష,పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు




**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల కేంద్రంలోని పలు వీధులు అస్తవ్యవస్థంగా ఉంటున్నాయని, అంతర్గత రోడ్లు, మురికి కాలువల పారిశుద్ధ్యం ఘోరంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కాట సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఒకటో వార్డు, రెండు, మూడు, ఐదు, ఏడు వార్డులలో సిపిఎంపార్టీ జఫర్‌గడ్ టౌన్ శాఖ ఆధ్వర్యంలో పలు వార్డులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ వారు వెంటనే అంతర్గత రోడ్లను బాగు చేయాలన్నారు. అంతర్గత రోడ్లు బురదమయంగా ఉన్నాయని నడవలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. ప్రతి వాడకు సీసీరోడ్లు, కాలువలను నిర్మించాలన్నారు. అస్తవ్యవస్థంగా ఉన్న పారిశుద్ధ్యం వల్ల ప్రజలకు సీజనల్ వ్యాధులు వచ్చే ఆస్కారం ఉందని కావున వెంటనే పంచాయితి కార్మికులు ప్రత్యేక దృష్టి సారించి శుభ్రం చేయాలన్నారు.మండల నాయకులు శ్రీను, టౌన్ కార్యదర్శి నరసింగం, పార్టీ సభ్యులు సుధాకర్, బాబు, దుర్గయ్య, బిక్షపతి, అనిల్, రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల రికార్డులను తనిఖీ చేశారు. మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాల వారీగా నిర్వహించిన సదస్సులలో భూ సమస్యల కోసం వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారిగా త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలోతహసీల్దార్ సదానందం, నాయబ్ తహసీల్దార్ సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు..

## భవనానికి మరమ్మతులు

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :**ఇటీవల కురిసిన వర్షాలకు బల్దియా ప్రధాన కార్యాలయం లో పెచ్చులుడిన ప్రమాదకరం గా ఉన్న వివిధ విభాగాల్లోని పైకప్పు (సీలింగ్) లకు వెంటనే మరమత్తులు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ పురాతన భవనం తోపాటు మేయర్ ఛాంబర్ పై భాగంలో గల పై అంతస్తు ను కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి ఇట్టి భవన స్థితి గతులను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు హెల్త్ విభాగం లోని ఛాంబర్ లో పై కప్పు లో నీరు చేరి సీలింగ్ కూలి కంప్యూటర్ పైన పడిన నేపథ్యం లో అప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించి మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత అతి ముఖ్యం అని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టనున్నట్టు, కూలిన సీలింగ్ తో పాటు ప్రమాదకర స్థితి లో ఉన్న సీలింగ్ లకు మరమత్తులు చేయించాలని అన్నారు. హెల్త్ విభాగం తో పాటు, బర్త్ డెత్ విభాగాలలో మరమత్తులు పూర్తయ్యే వరకు ఇట్టి విభాగాలను తాత్కాలికం గా మేయర్ ఛాంబర్ ఉన్న మొదటి అంతస్తులోకి తరలించాలని, పురాతన భవనం లో ప్రమాదకర స్థితి లో ఉన్న ఇతర విభాగాలను గుర్తించి వాటికి కూడా మరమత్తులు చేపట్టాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా॥ రాజారెడ్డి, ఇంచార్జ్ ఎస్ఈ మహేందర్, ఏంహెచ్ఓ డా॥ రాజేష్ పర్యవేక్షకులు ఆనంద్ పాల్గొన్నారు.

## సాండ్ బజార్‌తో ఇందిరమ్మ ఇండ్ల

# లబ్ధిదారులకెంతో ప్రయోజనం



### సాండ్ బజార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో సాండ్ బజార్ ను ఏర్పాటు చేసిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, టిజిఎండిసి అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసిఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సాండ్ బజార్ లో నాణ్యమైన ఇసుక ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాండ్ బజార్ లో అందుబాటులో ఉన్న నాణ్యమైన ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీజీఎండిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాండ్ బజార్ లో వినియోగదారులకు సరిపడే విధంగా ఇసుక నిల్వలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఇసుక కోసం వచ్చే లబ్ధిదారులకు సిబ్బంది ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. సాండ్ బజార్ లో లభించే ఇసుకను తీసుకోవడానికి ఆన్లైన్లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, ఆన్లైన్లో బుక్ చేసుకోవడం రాని వారికి సిబ్బందినే ఆన్లైన్లో ఇసుక బుకింగ్ చేసి అందించాలన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నందున ఆయా గ్రామాలలో ఇసుక అవసరాలను గుర్తించి ఆయా గ్రామాల వద్దకే ఇసుకను తీసుకెళ్లడానికి ఉన్న మార్గాలను చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో 80% ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ అయిందని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఇది అత్యధికమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు తక్కువ ధరలో లబ్ధిదారులకు ఇసుక అందించడమే లక్ష్యంగా సాండ్ బజార్ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ రేట్ లో సాండ్ బజార్ లో ఇసుక లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన ఇసుకను అందించే సాండ్ బజార్ ఏర్పాటుతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఉనికిచర్ల వద్ద రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండిసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాండ్ బజార్లో నాణ్యమైన ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉంటుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీజీఎండిసి అధికారులు మాట్లాడుతూ టిజిఎండిసి పోర్టల్ ద్వారా, లేదా మీసేవ కేంద్రాల ద్వారా, ఆన్లైన్లో ఇసుకను బుకింగ్ చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో టిజిఎండిసి నోడల్ అధికారి శ్రీనివాస్, పిడి హౌసింగ్ సిద్ధార్థ నాయక్, హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి ప్రాజెక్ట్ అధికారులు విష్ణువర్ధన్, వినయ్, రాజు, స్థానిక తహసీల్దార్ సదానందం, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## నర్మెటలోఎరువుల దుకాణాలను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/జనగామ :**ఎరువుల విక్రయాలు సక్రమంగా నిర్వయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఫర్టిలైజర్ వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం నర్మెట మండల కేంద్రంలోని పిఎసిఎస్, ఆగ్రోస్, ఓపిసిఎంఎస్ కేంద్రాలను సందర్శించి విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొనుగోలు రైతులతో మాట్లాడారు. ఎరువుల గురించి ఆందోళన చెందరాదని, సంవృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి రైతులకు ఒకటి,రెండు బస్తాలు అవసరాన్ని బట్టి ఇవ్వాలన్నారు. యూరియాను కొనుగోలు చేసేటప్పుడు రైతులు భూమి వివరాలు, ఆదార్ కార్డును పరిశీలించి ఇవ్వాలని వ్యాపారులను ఆదేశించారు.మండలంలో ఇప్పటి వరు 850 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి డాక్టర్స్‌తో మాట్లాడారు. సాదారణ కాన్పుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూంను సందర్శించి నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. వైద్యులు అందుబాటులో ఉండానలి, సీజనల్‌వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, మండల వ్యవసాయ శాఖ అధికారి కరుణాకర్, డాక్టర్లు ఉన్నారు.

## ఎరువుల కోసం రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** వ్యవసాయ సాగులో కావాల్సిన విత్తనాలు, యూరియా సహా ఇతర ఎరువులు, పురుగు మందుల కోసం పిఏసిఎస్, గ్రోమోర్ కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువులు పురుగు మందులు విత్తనాల గోదాం, మన గ్రోమోర్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద యూరియా, ఇతర ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ ప్రక్రియను కలెక్టర్ దాదాపు నలభై నిమిషాల పాటు అక్కడే ఉండి పరిశీలించారు. పలు ఆధారాలతో యూరియాతోపాటు ఇతర ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం వచ్చిన రైతుల వివరాలను బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. పిఏసిఎస్, మన గ్రోమోర్ కేంద్రాలలో సరిపోను యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలు ఉన్నాయా లేదా అని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానంలో రైతుల వివరాలను త్వరగా నమోదు చేసి రైతులకు కావలసిన యూరియా సహా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను అందించాలన్నారు. బయోమెట్రిక్ సిగ్నల్స్ లేవనే కారణంగా రైతులకు ఇబ్బందులు రానీయవద్దని, బయోమెట్రిక్ సిగ్నల్స్ బాగుండే విధంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. యూరియా సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. యూరియా సరఫరా సక్రమంగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా కొరత రానీయకుండా వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు కలెక్టర్ తో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, తహసిల్దార్ సదానందం, మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యూరియా కోసం బారులు తీరిన రైతులు



**ప్రజాపక్షం/వేలేరు:**ఏండ్లతరబడి రైతన్నల ఎదురుచూపులే కానీ రైతన్నల బాధలు తీరేవి కాదని ఆవేదన చెందుతునారు.సోమవారం వేలేరు మం డలంలోని రైతులకు సరిపడా యూరియా దొకకపోవడంతో వేలేరు మండలంలోని పీచర,వేలేరు గ్రామాలలో రైతన్నలు వర్షాలను సైతం లెక్క చేయకుండా ఆగ్రోస్ కేంద్రాల వద్ద రైతులు ఆడ, మగ తేడాలేకుండా బారులు తీరారు ఈసంధర్భంగా రైతులు మాట్లాడుతూ ఏప్రభుత్వం వచ్చి నా మాబాధలు తీరడంలేదని ఆవేధన చెందుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వమైనా రైతుల కు అనుకూలంగా ఉండీ రైతులకు సరిపడా యూ రియాను సరఫరా చేస్తదేమోనని ఆశిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం రైతులకు ఎకరాని ఒక యూరియా బస్త మాత్రమే ఇస్తున్నారని అదికూడా ఎన్ని ఎకరాలు ఉన్నాకూడా రెండు మాత్రమే ఇవ్వడం జ రుగుతోందని రెండు యూరియా బస్తాలను ఎన్నికరాలలో చల్లితే పంట లధికముగా వస్తాయో తె లుపాలని తెలుపుతూ అధికారులు తక్షణమే స్పందించి వ్యవసాయానికి సరిపడా ఎరువులను ఇచ్చి రైతుల పంటలను ఆదుకోవాలని కోరారు లే నియెడల రాబోయే ఎన్నికలలో రైతుల తడాఖాచూపిస్తామని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**మండలవ్యవసాయ అధికారి కవిత వివరాల ప్రకారం...**

వేలేరు మండలవ్యవసాయశాఖఅధికారి కవిత వి వరాల ప్రకారం వేలేరు మండలంలోని పీచ ర,వేలేరు గ్రామాలకు దాదాపుగా ఎనిమిది వం దల యూరియా బ్యాగులు వచ్చాయని ప్రస్తుతం ఒకరైతుకు రెండు యూరియా బ్యాగులను మాత్రమే ఇవ్వడం జరుగుతోందని తదుపరి పదిహే ను రోజుల అనంతరం మరోదఫా యూరియా రా గానే మళ్లీయూరియా బ్యాగులను రైతులకు ఇవ్వ డం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సి న అవసరం లేదని ప్రస్తు నానో యూరియా పట్ల ప్రతిఒక్కరైతు అవగాహన కలిగి ఉంటే పెట్టుబడి ఖర్చుల తగ్గడమేకాకుండా దిగిమతులు కూడా పెరుగుతాయని తెలిపారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫర్టిలైజర్ షాపుల్లో, కలెక్టర్ అద్వైత్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మహబూబాబాద్;**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మంగళవారం డోర్నకల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాల, ఫర్టిలైజర్ షాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పిల్లలకి నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ క్లాసుల ద్వారా తరగతుల నిర్వహించాలని, ప్రతి సబ్జెక్టు వారీగా పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యా బోధనలు అందించాలన్నారు, ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని, పాఠశాల పరిసరాలు డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ మరుగుదొడ్లు తదితర ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం నిత్యం సానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో యూరియా కృత్రిమ కొరత సృష్టించద్దని, అధిక ధరలకు అమ్మ వద్దని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియాను అమ్మకాలు జరపాలని, రైతులకు అందుబాటు సమయాలలో సంబంధిత ఫర్టిలైజర్ షాపులను ప్రారంభించాలని, ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే రైతు యొక్క వివరాలు పాసుబుక్ ఆధార్ కార్డు ద్వారా అమ్మకాలు జరపాలని, దుకాణంలోని ఆన్‌లైన్ ఓపి ఎమ్మెస్, ఫిజికల్ గోడౌన్ నిలువలు కచ్చితంగా ఉండాలన్నారు,నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రస్తుతం రైతులు వేసుకున్న పంటలకు అనుగుణంగా ఫర్టిలైజర్స్ మందుల వినియోగం పూర్తిగా తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, వానాకాలం సీజన్ లో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలని, నిత్యం ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సీజనుకు అనుగుణంగా వైద్య కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత సిబ్బందిని ఆదేశించారు, జిల్లాలోని ప్రత్యేక అధికారులందరూ వారికి కేటాయించిన మండలాలలో వర్షాకాలం వరదల కారణంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకొని సిద్ధంగా ఉండాలని, ప్రతి ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ నిర్వహించి, యూరియా నిలువలను సరిచూసుకోవాలన్నారు.పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, డోర్నకల్ తహసీల్దార్ ఇమ్మానియేల్, ఎంపిడిఒ తదితరులు ఉన్నారు

## పిఎంఎవైజి ఇళ్ల భద్రత డొల్ల ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజనగ్రామీణ కింద గ్రామాల్లో నిర్మించిన ఇళ్లలో భద్రతా సమస్యలు ఉన్నాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణం సరిగా లేకపోవడం, విద్యుత్ సమస్యలతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు.2021 నుండి ఇప్పటివరకు పిఎంఎవైజీ కింద దేశంలో ఎన్ని ఇళ్లలో ఇటువంటి సమస్యలు వచ్చాయో రాష్ట్రాల వారీగా వివరాలు ఇవ్వాలని ఎంపీ డాక్టర్ కడియం కవ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్ల భద్రతపై ఎలాంటి చర్యలు చేపట్టారు వాటి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు.ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానం ఇచ్చారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు 1.20 లక్షల నుండి 1.30 లక్షల వరకు ఇల్లు కట్టుకోవడానికి సహాయం ఇస్తున్నట్టు చెప్పారు. స్థానిక మేస్త్రీలతో ఇళ్లు కట్టించడానికి శిక్షణ ఇస్తున్నామని, ఫిర్యాదులు వస్తే 15 రోజుల్లో పరిష్కరించే విధానం ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ "పీఎంఏవైజి పథకం వల్ల గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనాలు ఉన్నప్పటికీ వారి భద్రతా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. బలహీన వర్గాల కుటుంబాలు ప్రమాదంలో పడకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

## వర్షాల నేపథ్యంలో పటిష్ఠ నియంత్రణ చర్యలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు నీరు పారుతున్న రహదారులపై ప్రయాణాలు చేయకుండా పటిష్ఠ నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం మహా ముత్తారం మండలంలోని ముత్తారం యామనపల్లి కేశవాపూర్ పెగడపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పెద్దవాగు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పొంగుతున్న వాగులపై ప్రజలు ప్రయాణాలు చేయకుండా ట్రాక్టర్లు తో భారీ కేండింగ్ ఏర్పాటుతో పాటు రెవెన్యూ, పోలీస్, పంచాయతి శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాగుల్లో చేపలు పెట్టేందుకు ప్రజలు వెళ్ళొద్దని సూచించారు. రహదారిపై నీళ్లు పారుతున్నందున ప్రజల రావాణా ఏ విధముగా చేస్తున్నారని పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అజాం నగర్ మీదుగా వెళ్తున్నారని ప్రయాణం చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ ఎం శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, పీఆర్ డిఈ రవీందర్, ఎంఈఓ రవీందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏఓ అనూష పాల్గొన్నారు.

## నెక్కొండలో పోటెత్తిన వరద



**ప్రజాపక్షం/నెక్కొండ:**గత వారం రోజులుగా వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం సమయంలో బ్రిడ్జి కింది భాగం నుండి ఇరుపక్కల హోల్స్ ఇంజనీర్ సూచనల మేరకు నిర్మించిన గుత్తేదారు. ఈ మధ్యకాలంలో కురుస్తున్న వర్షాల వల్ల గత వారం రోజుల నుండి 24 గంటలు ఊట నీరు (వరదే వరదా) వస్తూనే ఉంది దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నీటిని బ్రిడ్జి పక్కన ఉన్న మోరీ లోకి వెళ్లే విధంగా పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం తమ సిబ్బందితో ఏర్పాటు చేశారు. దీంతో దీని నుండి వచ్చే నీటి ఊట నీరు మొత్తం వట్టే వాగులో కలుస్తున్నది.

# రీల్

## 'మండాడి' పోస్టర్ విడుదల




ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ నుండి 16వ ప్రాజెక్ట్‌గా రాబోతున్న చిత్రం. 'మండాడి' 'సెల్ఫీ' ఫేమ్ మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూరి, సుహాస్ అద్భుతమైన పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ ఇంటెన్స్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. తెలుగు నటుడు, యంగ్ హీరో సుహాస్ తన కెరీర్‌లో మొదటి సారిగా విలన్ పాత్రను పోషిస్తున్నారు. అతని పుట్టిన రోజు సందర్భంగా 'మండాడి'టీం శుభాకాంక్షలు తెలిపింది. ఈ చిత్రం కోసం సుహాస్ తన లుక్స్ మొత్తాన్ని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు వచ్చిన పోస్టర్లు, కొత్త లుక్ ఇప్పటికే దృష్టిని ఆకర్షిస్తున్నాయి. బర్త్ డే విషెస్ చెబుతూ వదిలిన ఈ కొత్త పోస్టర్ కూడా అందరినీ మెప్పించేలా ఉంది.సూరి, సుహాస్‌లతో పాటు మహిమా నంబియార్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. నిర్మాతలు త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నారు.

## తెరపై వీర జవాన్ మురళి నాయక్ బయోపిక్



ఏపికి చెందిన మురళి నాయక్‌పై సినిమా తీస్తున్నారు. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్ బయోపిక్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాని తెలుగు తమిళ్ కన్నడ మలయాళం హిందీ భాషల్లో చిత్రీకరిస్తున్నారు. హీరో గౌతమ్ కృష్ణ మురళి నాయక్ పాత్రను పోషిస్తున్నారు. విషాన్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ పై కే సురేష్ బాబు ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు. ఇది ఒక రియల్ హీరో కథ. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. ఇప్పటివరకు ఒక్క తెలుగు సైనికుడు మీద కూడా బయోపిక్ రాలేదు. తెలుగు సైనికుడి మీద వస్తున్న ఫస్ట్ బయోపిక్ ఇది. ఈ సినిమాని తెలుగు తమిళ్ కన్నడ మలయాళం హిందీ భాషల్లో చిత్రీకరిస్తున్నాం. మాకు అవకాశం దొరికితే ఈ సినిమాని ఇంటర్నేషనల్ లెవెల్‌లో తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నాం. నా గత సినిమా సోలో బాయ్ రిలీజ్ అయినప్పుడు మురళి నాయక్ ఫ్యామిలీ ని పిలిచి వారితో మాట్లాడడం జరిగింది. వారితో మాట్లాడుతున్నప్పుడు మురళి నాయక్ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. మురళి గారు భారత సైన్యానికి సేవలందించాలనే కళ లక్ష్యంతో ఆర్మీలో చేరారు. మురళి నాయక్ లాంటి ఎంతోమంది సైనికులు బోర్డర్లో పోరాటం చేయడం వల్లే మనం ఇక్కడ మనం ఆనందంగా ఉండగలుగుతున్నాం. మురళి కథ ప్రపంచానికి తెలియాలి. ఆపరేషన్ సింధూరం మన దేశ చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయం. అలాంటి ఒక వార్‌లో పాల్గొని వీరమరణం పొందిన మురళి నాయక్ కథ ప్రపంచానికి తెలియాలన్నారు.

## 'ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి..' పాట విడుదల



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా.సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. త్వరలో 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. 'గుర్రం పాపిరెడ్డి' సినిమా నుంచి 'ఏదోటి చేయ్ గుర్రం పాపిరెడ్డి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు.

## ప్రభాస్ చిన్నపిల్లాడిలా మాట్లాడతారు

### చిట్ చాట్‌లో ప్రభాస్ తొలి హీరోయిన్ శ్రీదేవి



ప్రభాస్ తొలి సినిమా ఈశ్వర్‌లో హీరోయిన్‌గా నటిచింది శ్రీదేవి. ఆ తరువాత ఒకటి రెండు సినిమాలు చేసి మాయమైపోయింది. చాలా రోజుల తరువాత శ్రీదేవి మళ్ళీ హీరో నారా రోహిత్ సినిమా సుందరకాండతో మళ్ళీ జనం ముందుకు వస్తోంది. 'సుందరకాండ'కు నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ దేవి విజయ్ కుమార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ దేవి విజయ్ కుమార్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** రీఎంట్రీలో కూడా హీరోయిన్‌గా వస్తున్నారు.. ఎలా ఫీలవుతున్నారు?**

చాలా హ్యాపీగా ఉంది. ఏ యాక్టర్‌కైన మంచి క్యారెక్టర్ చేయాలని ఉంటుంది. ఏదైనా క్యారెక్టర్ స్ట్రాంగ్‌గా ఉండాలి. ఇందులో చాలా మీనింగ్ ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నాను.

*** మీరు సినిమాలకి బ్రేక్ ఇవ్వడానికి కారణం ఏమిటి?**

నేను హీరోయిన్‌గా చేస్తున్న రోజుల్లోనే పెళ్లి చేసుకున్నాను. పెళ్లి ఇంట్లో ముందుగానే ప్లాన్ చేశారు. తర్వాత అమ్మాయి పుట్టింది. అలా సినిమాలకి ఒక బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత టీవీలో కొన్ని ప్రోగ్రామ్స్ చేశాను. ఇన్ని సంవత్సరాల గ్యాప్ తర్వాత స్క్రీన్ మీద చూసుకోవడం చాలా హ్యాపీగా ఉంది. ఇప్పుడు మా అమ్మాయి పెద్దదయింది. మరిన్ని సినిమాలు చేయడానికి అవకాశం దొరికింది.

*** సుందరకాండలో మీ క్యారెక్టర్ చెప్పినప్పుడు ఎలా అనిపించింది?**

డైరెక్టర్ ఈ కథ చెప్పగానే షాక్ అయ్యాను. చాలా కొత్త స్క్రిప్ట్. కొంచెం సమయం కావాలని అడిగాను. కానీ డైరెక్టర్ అంత టైం ఇవ్వలేదు. ఆయన చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. చెప్పినట్టే అద్భుతంగా తీశారు. సినిమా చాలా బాగా వచ్చింది. నా క్యారెక్టర్‌లో చాలా డిఫరెంట్ ఎమోషన్స్ ఉన్నాయి. చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. ఇందులో ఫిమేల్ క్యారెక్టర్స్ అన్నీ చాలా స్ట్రాంగ్‌గా ఉంటా యి. ఇందులో స్కూల్ డ్రెస్ వేసుకునే అవకాశం వచ్చింది. అది చాలా మెమొరబుల్ అనుభవం. చాలా ఫోటోలు తీసి దాచుకున్నాను. ఇది ఒక మెమొరబుల్ క్యారెక్టర్. ఇప్పటివరకు నేను ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు.

*** ఇండస్ట్రీలో అప్పటికి ఇప్పటికి ఎలాంటి మార్పులు గమనించారు?**

అప్పటికి ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి. మొత్తం మారిపోయింది. ఇప్పుడు టెక్నికల్‌గా ఇంకా ఈజీ అయింది. డైరెక్షన్ డిపార్ట్మెంట్ వర్కింగ్ స్టైల్ మారింది. నాకు అంతా కొత్తగా అనిపించింది.

*** మీరు తెలుగు చాలా చక్కగా మాట్లాడుతున్నారు?**

నేను హీరోయిన్‌గా తెలుగులోనే ఎక్కువ సినిమాలు చేశాను. అలాగే మా అమ్మగారు తెలుగులో ఎక్కువ వర్క్ చేశారు. మా ఇంట్లో తెలుగులోనే మాట్లాడుతూ ఉంటాం. నేను ఈశ్వర్ టైంలోనే తెలుగు నేర్చుకున్నాను.

*** మీరు ఈశ్వర్ టైంలో ఎలా ఉన్నారో ఇప్పుడు అలాగే ఉన్నారు హెల్త్ సీక్రెట్ ఏంటి?**

ఆనందంగా ఉండడం. దాంతో పాటు గాడ్ బ్లెస్సింగ్ కూడా అనుకుంటాను. ఈ సినిమా కోసం ఒక నెల రోజులు ముందుగానే డైట్ ప్లాన్ చేశాను.

*** ప్రభాస్ గారు మీరు ఒకేసారి ఈశ్వర్ సినిమాతో లాంచ్ అయ్యారు.. మీ మధ్య ఫ్రెండ్షిప్ ఎలా ఉంది?**

ఫ్రెండ్షిప్ అలానే వుంది. ప్రభాస్ ఇప్పుడు ఇంకా బిగ్ స్టార్ అయ్యారు. అయినప్పటికీ ఆయనలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పటికి కూడా ఆయన చిన్నపిల్లాడిలానే నవ్వుతూ మాట్లాడతారు. ఈశ్వర్ సినిమా సమయంలోనే ఆయన పెద్ద సూపర్ స్టార్ అవుతారని మేమంతా అనుకున్నాం. ఆ సినిమా సక్సెస్ టూర్‌కి వెళ్తున్నప్పుడు చాలా పెద్ద ఎత్తున జనం వచ్చేవారు. మేము ఊహించినదాని కంటే ఆయన పెద్ద స్టార్ అయ్యారు. నిజంగా అదొక బ్లెస్సింగ్.

*** ఎలాంటి క్యారెక్టర్స్ చేయాలనుకుంటున్నారు?**

నాకు అన్ని రకాల క్యారెక్టర్స్ చేయాలని ఉంది. కథలో మంచి ప్రాధాన్యత వుండే స్ట్రాంగ్ క్యారెక్టర్స్ చేయాలని భావిస్తున్నాను.

## 'యూనివర్శిటీ'లో అద్భుతమైన ఎమోషన్స్ వున్నాయి

### పద్మశ్రీ బ్రహ్మానందం



ఆర్.నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన యూనివర్సిటీ పేపర్ లీక్ ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ప్రముఖ హాస్య నటుడు పద్మశ్రీ ఈ సినిమాను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రహ్మానందం మాట్లాడుతూ.. యూనివర్శిటీ అంటే ఏమిటి యూనివర్స్ అంటే విశ్వం. అంటే అన్ని గోళాల తోటి ఖగోళ శాస్త్రానికి సంబంధించినటువంటి భూమి లాంటి గ్రహమే కాకుండా విశ్వాంతరాళాలలోని గ్రహాలన్నింటికీ సంబంధించినటువంటి జ్ఞానాన్ని నేర్పేటటువంటిది ఆలయం. అదే విశ్వవిద్యాలయం అదే యూనివర్సిటీ. అటువంటి యూనివర్సిటీ ఇపుడు ఎటువంటి విశ్వవిద్యాలయాలు అయ్యాయి అని చెప్పడానికి ఎంతో కృషి చేసి అందులో రీసెర్చ్ చేసి అందులో జరుగుతున్నటివంటి అవనీతిని, అప్పట్లో విశ్వవిద్యాలయాలు అంటే కాశీ విద్యాలయం అని పెద్ద పేరు బెనారస్ యూనివర్సిటీ. ఎక్కడెక్కడి నుంచో అన్ని దేశాల నుంచి మనదేశం వచ్చి చదువుకొనివెళ్లిపోయేవారు. అంటే అంత జ్ఞాన సంపద ఉన్న దేశం మనది. ఈవాళ మన దేశం మన ఎద్యుకేషనల్ స్థితి ఎలా వుంది విద్య వ్యవస్థలు ఎలా మరిపోతున్నాయి అని వాటి మీద అధ్యయనం చేసిన తమ్ముడు నారాయణమూర్తి అవన్నీ తట్టుకోలేక దీన్ని నా మిత్రులకు నా వాళ్లకు ఎలాగైనా పంచి పెట్టాలి ఎందుకంటే నారాయణ మూర్తి తేనెటీగ లాంటి మనిషి. తిరుగుతూ ఉంటాడు అన్ని చోట్ల తేనె పోగుచేసుకొని వచ్చి తలా ఒక చుక్క పంచిపెట్టాలి అనేటటువంటి మహా సంకల్పం ఉన్న మంచి మనిషి. మీకు అందమైన హీరో ఎవరు అని అడిగితే నేను నారాయణమూర్తి పేరు చెపుతాను. అందం అంటే అది గ్లామర్, 6 ఫిట్స్ హైట్ కార్లింగ్ హెయిర్ అలాంటి అందం కాదు. నలభై సంవత్సరాలనుండి నాకు తెలిసిన నారాయణ మూర్తి నిరంతరం ప్రజలు, ప్రజలు అందునా పేదవాళ్లు వారు పడుతున్న కష్టాలు వారు పడుతున్న భాధలు, నటుడుగా నటించడం కాకుండా ఒక మెసేజ్ అనేది ప్రపంచానికి ఇవ్వాలి అనేటటువంటి వ్యక్తి నారాయణ మూర్తి. ఈ చిత్రానికి పాటలు గద్దర్ జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ. మోటపలుకులు రమేష్, ఎడిటింగ్ మాలిక్, కెమెరా బాబూరావు దాస్, కథస్క్రీన్ ప్లే మాటలు సంగీతం దర్శకత్వం నిర్మాత ఆర్.నారాయణ మూర్తి.

## రూ.13 కోట్ల పెండింగ్ వేతనాలు విడుదల

● సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ ● రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగు సినిమా షూటింగ్ బంద్ చేసి పదహారు రోజులు దాటుతున్న నేపథ్యంలో మంగళవారం ఫెడరేషన్ నేతలు ఇందిరా నగర్‌లో సమావేశమైయ్యారు. సమస్యల పరిష్కారం గురించి చర్చించుకున్నారు. పెద్ద ఎత్తున కార్మికులు హాజరైన ఈ సమావేశానికి ప్రముఖ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, మరో నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ మీడియాతో మాట్లాడుతూ మా నిర్ణయాలు వారికి తెలియజేస్తాం. మేము ఐక్యంగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. మా డబ్బులు మాకు ఇవ్వండి. 13 కోట్ల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి. మా కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. ఫైటర్స్, డాన్సర్ రేషియో విషయంలో స్థానికులు లేకపోతే ఇతర రాష్ట్రాల వారిని తీసుకోవాలని అంగీకరించాం. నిర్మాతలకు ఇష్టమైన స్కిల్ వారిని నియమించుకోవచ్చు.. ఇందుకుమేము ఒప్పుకున్నాం అని పేర్కొన్నారు. ఈ సారి అన్ని యూనియన్స్‌లో కార్మికుల స్కిల్ డెవలప్మెంట్ చేస్తాం. తెలుగు నిర్మాత ఇబ్బంది పడకుండా మేము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఆదివారం డబుల్ పేమెంట్ ఇవ్వము అంటున్నారు. ఆదివారం కుటుంబాన్ని వదిలి కొంత ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశతో పని చేస్తాం. ఆ నిబంధనకు మేము కొంతవరకు ఒప్పుకున్నాం.. 6 నుండి 6 గంటల పని దినాలు ఇప్పటి వరకు ఉంది. కానీ కార్మికులు పనిచేస్తుంది 16 గంటలు పనిచేస్తున్నాము. కానీ నిర్మాతలు 9 గంటల 9 గంటల వరకు సింగిల్ కాల్ షీట్ అంటున్నారు. అందుకు మేము ఒప్పుకోవడం లేదు. 9 నుండి 9 పని గంటలకు కార్మికులు ఒప్పుకోవడం లేదు. 9 నుండి 9 గంటలు అయితే ఒకటిన్నర కాల్ షీట్ ఇవ్వమని అడుగుతున్నాం.కార్మికుల నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నాం. కార్మికుల నిర్ణయాలు మేము ఛాంబర్‌లో చర్చిస్తాం. సమస్యను ఎంత త్వరగా అయితే అంత త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం అని అనిల్ తెలిపారు.

## రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు

### వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో పౌరులకు ఉత్తమ సేవలందించే లక్ష్యంతో స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌ల శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా, ప్రజల సౌలభ్యం కోసం ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నూతన విధానం వల్ల పర్యవేక్షణ సులభతరం అవుతుందని, అవినీతి తగ్గుతుందని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా పంపిణీ అవుతుందని, తద్వారా దస్తావేజుల ప్రాసెసింగ్ వేగవంతమవుతుందని మంత్రి అన్నారు.

**మొదటి దశలో 11 సమీకృత భవనాలు..**

మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకురానున్నారు. వీటిలో భాగంగా, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో మొదటి ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనానికి ఆగస్టు 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యాలయం రంగారెడ్డి ఆర్వో, గండిపేట, శేర్లింగంపల్లి, రాజేంద్రనగర్ కార్యాలయాలను ఒకే చోటికి చేర్చనుంది. అదనంగా మరో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

## జలాశయాల వరద ప్రవాహాలపై నిఘా పెట్టాలి

### నీటి పారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారీ వర్షాలతో ఇప్పటికే జలాశయాలన్ని నిండు కుండలను తలపిస్తుండడంతో విపత్కర పరిస్థితులు ఏర్పడకుండ వరదల ప్రవాహాల పై ఎప్పటికప్పుడు నిఘా ఉంచడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. జలాశయాల తాజా పరిస్థితులపై మంగళవారం జలసౌధ నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ ఇంజనీర్లు ఇన్ చీఫ్‌లు, చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరద నిర్వహణ, నీటిపారుదల అవసరాలను సమతుల్యం చేయడం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని నొక్కి చెప్పారు.ప్రధాన జలాశయాల స్థితిని సమీక్షించిన మంత్రి, కృష్ణా బేసిన్‌లోకి నీటి ప్రవాహాలు గణనీయమైన స్థాయికి చేరడం, గోదావరి బేసిన్‌లో, కీలక ప్రాజెక్టులన్నింటిలోనూ భారీగా ఇన్‌ఫ్లోలు పెరిగడంతో అప్రత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ అంతటా ఉన్న 34,740 చెరువులు కుంటలు ఉండగా, ఇందులో 9,100 ఎక్కువ చెరువులు, కుంటలు వాటి సామర్థ్యంలో 75నుంచి 100 శాతం నిండి ఉన్నాయని తెలిపారు. దీంతో వరద నష్టాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మంత్రి అన్నారు. వరదల కారణంగా 177 చెరువులు, కాల్వలు, లిఫ్టలలకు నష్టం సంభవించాయని వీటి మరమ్మతులకు రూ.335 కోట్లకు అవసరమని అంచనా వేశారని తెలిపారు. దాదాపు 3,500 తాత్కాలిక పునరుద్ధరణలు పూర్తి చేశారని ఆదిలాబాద్, ములుగు, మహబూబ్ నగర్, సూర్యాపేట వంటి జిల్లాల్లో ఎక్కువ స్థాయిలో నష్టం సంభవించినట్లు నివేదికలు అందాయని తెలిపారు. శాశ్వత పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వరద నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. పంట క్యాలెండర్ల ప్రకారం రైతులు నీటిని పొందేలా చూసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వనకాలం (ఖరీఫ్) సీజన్‌కు గాను ఎస్‌సిఐడబ్ల్యూఎఎం కమిటీ లెక్కల ప్రకారం లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించాల్సి ఉంటుందని ఇందుకు 388 టిఎంసిల కంటే ఎక్కువ నీరు అవసరమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మైనర్ ఇరిగేషన్‌పై ఆధారపడిన ప్రాంతాలలో, ఏ ఆయకట్టు ప్రాంతం కూడా నీరు అందించేలా జిల్లా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. కడం, ఎల్లంపల్లి, ఎస్ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టులలో నీటిని గరిష్టంగా ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు. ఏడాది పొడవునా నీరు తగినంతగా ఉండేలా అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను నింపాలని కూడా ఆయన ఆదేశించారు. జలాశయాల పరిస్థితిని అంచనా వేయడానికి బుధవారం పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్, నిజామాబాద్‌లోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేర్ ప్రాజెక్ట్‌లను సందర్శించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ (ఇరిగేషన్) రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీర్ ఇన్‌చీఫ్ అమ్జాద్ హుస్సేన్, ఇతరులు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com